సోమవారం 17-7-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 116


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



జ్యోతి యర్రాజీకి రజతం

ఆసియా అథ్లెటిక్స్ 200 మీటర్ల రేసులో ఏపీ అమ్మాయికి రెండో స్థానం -12లో



ఇంటి రుణ భారం తగ్గే దారేది..

20 ఏళ్ల కాలానికి రెట్టింపు చెల్లింపు అసలు ఎంతో.. వడ్డీ అంతే -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శరద్ పవార్‌తో అజిత్ భేటీ

ఎన్సీపీని ఐక్యంగా ఉంచాలని ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వర్గం కోరింది.

- వివరాలు 6లో



టమాటా ధర కిలో రూ.80

దేశవ్యాప్తంగా టమాటా ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో కేంద్రం రాయితీపై కిలో రూ. 80కే పలు నగరాల్లో విక్రయిస్తోంది.

- వివరాలు 6లో



కన్నడనాట పొత్తు రాజకీయం

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలవకుండా చేతులు కలపాలని జేడీఎస్, బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 6లో



మా వద్ద 'క్లస్టర్స్' పుష్కలం

తమ వద్ద కూడా క్లస్టర్ బాంబుల నిల్వలు దండిగా ఉన్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

ఎప్పటిలాగే పిలుపు రాలేదు



బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈసారి కూడా పిలుపు రాలేదని, అందుకే ఎప్పటిలాగే రాజ్‌భవన్‌లో బోనాల వేడుకలు నిర్వహిస్తున్నామని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. రాజ్‌భవన్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో బోనాల వేడుకల్లో గవర్నర్ పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి ఒడిబియ్యం పోశారు.

- వివరాలు 14లో

బంగాళాఖాతంలో 18న మరో ఉపరితల ఆవర్తనం



వాయవ్య బంగాళాఖాతంలో 18న మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

- వివరాలు 10లో

బదిలీలు ఉంటాయో.. లేదో!?



గురుకుల విద్యాసంస్థల్లోని ఉద్యోగుల్లో జీఓ 317 భయం వీడలేదు. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత స్థానికత ఆధారంగా ఉద్యోగుల కేటాయింపులను దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి చేసినప్పటికీ... గురుకుల విద్యా సంస్థల్లో మాత్రమే ఈ ప్రక్రియ పెండింగ్‌లో పడింది.

- వివరాలు 3లో

ఈ బాంబు ఒక్కటి వేస్తే.. 100 బాంబులు వేసినట్టే..

ఏదైనా బాంబును ప్రయోగిస్తే.. అది పడిన ప్రదేశంతోపాటు కొంతదూరం వరకు విధ్వంసం సృష్టిస్తుంది. అదే క్లస్టర్ బాంబును ప్రయోగిస్తే.. టార్గెట్ చేసిన ప్రదేశంతోపాటు చుట్టుపక్కల కొంత దూరం దాకా విధ్వంసం సృష్టిస్తుంది. - వివరాలు 14లో



ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలోని లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కల్పవల్లీ.. కరుణించు తల్లీ!

ఆషాఢ మాసం బోనాల జాతర సంబరాలు అంబరాన్నంటాయి. భాగ్యనగరంలో ఆధ్యాత్మికతను ద్విగుణీకృతం చేశాయి. ఆదివారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాతబస్తీతో పాటు సిటీలో వాడవాడలా వేడుకలు ఉత్సాహంగా సాగాయి. అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- వివరాలు 3లో

అల్‌కరాజ్ అద్భుతం



గత నాలుగు వింబుల్డన్ టోర్నీలలో ఓటమి ఎరుగని సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు ఈసారి తుది పోరులో చుక్కెదురైంది. స్పెయిన్ యువతార కార్లోస్ అల్‌కరాజ్ ధాటికి జొకోవిచ్ బోల్తా పడ్డాడు. 4 గంటల 42 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అల్‌కరాజ్ 1-6, 7-6 (8/6), 6-1, 3-6, 6-4తో జొకోవిచ్‌పై గెలిచి తొలిసారి వింబుల్డన్ చాంపియన్‌గా అవతరించాడు. ఫెడరర్, జాన్ బోర్గ్ తర్వాత వరుసగా ఐదు వింబుల్డన్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాలని భావించిన జొకోవిచ్‌కు నిరాశ ఎదురైంది.

-వివరాలు 12లో

డ్రోన్ సాగు సూపర్!

విత్తనాలు చల్లడం నుంచి పురుగు మందుల పిచికారీ దాకా..

- సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేస్తున్న జయశంకర్ వ్యవసాయ వర్సిటీ
- అవసరానికి తగినట్టుగా డ్రోన్లకు ప్రత్యేక పరికరాలను అమర్చేలా రూపకల్పన
- కూలీల కొరతకు చెక్‌తోపాటు పురుగు మందులు, ఎరువుల వృథాను తగ్గిస్తుంది
- వ్యవసాయంలో సురక్షిత విధానాలు అవలంబించడమే లక్ష్యం
- డ్రోన్ల వినియోగం, నిర్వహణపై శిక్షణ కోసం ప్రత్యేకంగా అకాడమీ.. ఏయే పంటలపై డ్రోన్లను ఎలా వినియోగించాలనే దానిపై సూచనలు
- డ్రోన్ల ద్వారా సాగులో దేశానికి తెలంగాణ మార్గనిర్దేశం
- జయశంకర్ వర్సిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికనే దేశవ్యాప్తంగా అమలు చేయనున్న కేంద్రం.. రాష్ట్రంలో సబ్సిడీపై డ్రోన్లు అందించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు!



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయమంటే దుక్కి దున్నడం నుంచి పంట కోత దాకా ఎన్నో పనులు.. తీరిక లేని శ్రమ.. కూలీల కొరత ఓ వైపు, సమయాభావం మరోవైపు ఇబ్బందిగా మారిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో రైతన్నలకు 'వ్యవసాయం' కోసం డ్రోన్లతో ఆధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడంపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టి పెట్టింది. కేవలం పురుగు మందులు పిచికారీ చేయడానికే పరిమితం కాకుండా.. విత్తనాలు, ఎరువులు చల్లడం.. పంటలో చీడపీడలు, తెగుళ్లను, పూత, కాత పరిస్థితిని గుర్తించేలా ఫొటోలు తీయడం.. దిగుబడి ఏ మేరకు వచ్చే అవకాశం ఉందనే అంచనా వేసేందుకు వీలైన సమాచారం

మిగతా 10వ పేజీలో ▶

24 గంటల కరెంటా.. 3 గంటల విద్యుత్తా?

ఇదే నినాదంతో ప్రజల వద్దకు వెళదాం

- కాంగ్రెస్‌కు మంత్రి కేటీఆర్ సవాల్
- రేవంత్ వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్లు ఖండించకపోవడం శోచనీయం
- రైతాంగానికి ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- తెలంగాణ రైతు పథకాలను చూసి ఇతర రాష్ట్రాల రైతులు కేసీఆర్‌కు మద్దతు పలుకుతున్నారని వెల్లడి
- 24 గంటల విద్యుత్‌పై ప్రజల వద్దకు వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచన



జగిత్యాల: కాంగ్రెస్ పార్టీ ఐదు దశాబ్దాల పాలనలో రాష్ట్రంలో కరెంటు, సాగునీటి సౌకర్యం సరిగా ఉండేది కాదని, ఎరువులు, పురుగు మందుల కొరతతో రైతులు ఇబ్బందులు పడ్డారని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఇక ప్రాజెక్టులు, చెరువులు, కుంటల అభివృద్ధిని పట్టించుకున్నవారే లేరని ఆయన ఆరోపించారు. ఫలితంగా ఆశించిన స్థాయిలో పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్సే కారణమని మండిపడ్డారు. ఆదివారం మంత్రి, జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తున్నామన్నారు. రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి, ఉత్తమకుమార్‌రెడ్డి లాంటి వారు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో రైతులకు అందిస్తున్న పథకాలను చూసి కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల రైతులు సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. 'కాంగ్రెస్ మూడు గంటల

మిగతా 2వ పేజీలో ▶

కంప్యూటర్ కోర్సులు 'కేక'



94 శాతం సీట్ల భర్తీ

- 70 వేల సీట్లలో 52 వేలు అవే.. సివిల్ ఇంజనీరింగ్‌లో 44 శాతమే
- మెకానికల్‌లో 38 శాతం దాటిన భర్తీ
- ఇంజనీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు...

సాక్షి, హైదరాబాద్: తొలి విడత ఇంజనీరింగ్ సీట్లను ఆదివారం కేటాయించారు. మొత్తం 82,666 సీట్లు అందుబాటులో ఉంటే, 70,665 భర్తీ చేసినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ వెల్లడించారు. 12,001 సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 1,56,879 మంది అర్హత సాధించారు. 76,821 మంది ఎంసెట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 75,708 మంది వివిధ కాలేజీలు, వివిధ బ్రాంచీలకు ఆప్షన్లు ఇచ్చారు. మొత్తం 50,44,634 ఆప్షన్లు అందాయి. 5,043 మంది ఎలాంటి ఆప్షన్లు ఇవ్వలేదు. 5,576 మందికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటాలో సీట్లు వచ్చాయి. ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు 173 పాల్గొన్నాయి.

28 కాలేజీల్లో వందశాతం సీట్ల కేటాయింపు

మూడు యూనివర్సిటీలు, 28 ప్రైవేటు కాలేజీల్లో వందశాతం సీట్ల కేటాయింపు జరిగినట్టు సాంకేతిక విద్యాశాఖ తెలిపింది. మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 22లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఎంసెట్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు 9 నుంచి 11 వరకూ కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

సగానికిపైగా కంప్యూటర్ కోర్సులే

మొదటి దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ఎక్కువగా కంప్యూటర్ కోర్సులనే విద్యార్థులు కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బ్రాంచీల్లో కలిపి 82,666 సీట్లుంటే, కంప్యూటర్ కోర్సుల్లోనే 55,876 సీట్లున్నాయి. వీటిల్లో భర్తీ అయిన సీట్లు 52,637. అన్ని బ్రాంచీలకు కలిపి ఉన్న సీట్లలో 67.5 శాతం కంప్యూటర్ కోర్సులవైతే, 32.5 శాతం ఇతర బ్రాంచీలకు చెందినవి ఉన్నాయి. కంప్యూటర్ కోర్సుల్లో సీఎస్‌సీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, ఐటీతో కలుపుకుని మొత్తం 18 రకాల కోర్సులున్నాయి. ఎక్కువ మంది ఈ కోర్సులకే ఆప్షన్లు ఇవ్వడంతో 94.20 శాతం సీట్లు భర్తీ చేశారు. మిగిలిపోయిన సీట్లు 3,239 ఉన్నాయి. ఇవి కూడా మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించినవే.

ఈ కోర్సుల్లో వందశాతం భర్తీ

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో 137సీట్లు ఉండగా.. అన్నీ భర్తీ అయ్యాయి. కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో 91, కంప్యూటర్ సైన్స్ అండ్

మిగతా 3వ పేజీలో ▶

ప్యాకేజీ కవర్ల పరిశ్రమలో

భారీ పేలుడు

- 11 మందికి తీవ్ర గాయాలు..
- వీరిలో 10 మంది పరిస్థితి విషమం.. బాధితులంతా ఇతర రాష్ట్రాల వారే!
- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆదివారం రాత్రి దుర్ఘటన

షాద్‌నగర్: ఆహారాన్ని ప్యాక్ చేసే సిల్వర్ కవర్లను తయారు చేసే ఫ్యాక్టరీలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 11 మంది కార్మికులు తీవ్రంగా గాయపడగా.. అందులో 10 మంది పరిస్థితి విషమంగా ఉంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలో ఆదివారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. బాధితులంతా ఇతర రాష్ట్రాల వారేనని తెలిసింది.

పరిమితికి మించిన వేడితో..

షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులో బ్లైండ్ కలర్ పరిశ్రమ ఉంది. ఇందులో ఫుడ్ ప్యాకేజీకి సంబంధించిన సిల్వర్ కవర్లను తయారు చేస్తారు. ఇందుకోసం మెటాలిక్ పొడిని వినియోగిస్తారు. కార్మికులు రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి విధుల్లో ఉండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో జాజిపతుర, పూర్ణాసింగ్, మందిరి,

మిగతా 3వ పేజీలో ▶

రైతు వేదికలపైనే నిలదీయండి: రేవంత్

రుణమాఫీ, రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ నేతలను అక్కడే ప్రశ్నించండి

- బరితెగించిన అధికార పక్షంపై పోరాటానికి సిద్ధం కండి
- సమస్యలను పరిష్కరించుడో, బీఆర్ఎస్‌ను బొంద పెట్టుడో
- బహిరంగ లేఖ ద్వారా తెలంగాణ రైతాంగానికి టీపీసీసీ చీఫ్ పిలుపు
- ఇప్పుడు నిలదీయకపోతే కేసీఆర్ అండ్ కో మళ్లీ దొరకరని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రైతు వేదికల సాక్షిగా రాజకీయానికి వస్తున్న బీఆర్ఎస్ నేతలను రైతాంగ సమస్యలపై అక్కడే నిలదీయాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ రైతు ద్రోహులకు బుద్ధి చెప్పడానికి ఇదొక సదవకాశమన్నారు. ''తెలంగాణ రైతాంగానికి రైతు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో ప్రశ్నించండి. ధాన్యం డబ్బులు ఎప్పుడు జమచేస్తారు.. పోడు భూములకు పట్టాలు ఎప్పుడు ఇస్తారు, అసైన్డ్ భూములను ఎందుకు లాక్కుంటున్నారు.. ఎరువులు ఉచితమని చెప్పిన మాట ఏమైంది..?''అని నిలదీయాలని రేవంత్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన తెలంగాణ రైతాంగానికి బహిరంగ లేఖ రాశారు. చివరి బడ్జెట్ కూడా అయిపోయిందని, ఇప్పుడు నిలదీయకపోతే కేసీఆర్ అండ్ కో మళ్లీ దొరకరని, అందుకే రైతు వేదికల వద్దకు వచ్చే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల గల్లాలు పట్టుకుని ప్రశ్నించాలని ఆయన కోరారు.

రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడుతుందా?: 'ఎద్దు ఏడ్చి ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదంటారు. తెలంగాణలోని రైతుల ఇళ్లలో

మిగతా 2వ పేజీలో ▶

ఇండుజూకేత్



పార్టీనే కొత్త.. అధ్యక్షుడు కాదు కదా సార్!

రాజుతో అంగరక్షకుడి సహగమనం


గొల్లత్తగుడి సమీపంలో గుర్తించిన ఆత్మాహుతి శిల

సజీవ సమాధి చేసే అరుదైన ఆచారం

జడ్చర్ల సమీపంలో వెలుగులోకి

తెలంగాణలో తొలిసారి ఆత్మాహుతి శిల గుర్తింపు

సాక్షి, హైదరాబాద్

సతీ సహగమనం గురించి అందరికీ తెలిసిందే. భర్త చితిపైనే భార్యను సజీవంగా దహనం చేసే దారుణ పద్ధతది. కానీ, రాజు చనిపోతే అంగరక్షకులను అతనితోపాటు సజీవ సమాధి చేసే మరో వికృత ఆచారం కొన్ని ప్రాంతాల్లో కొనసాగింది. స్వామి భక్తితో ఆత్మాహుతి చేసుకున్న అంగరక్షకుడు/ఆంతరంగిక సేవకుడి(లెంక) స్మృతిలో ఏర్పాటు చేసిన స్మారక ఆత్మాహుతి శిల ఇటీవల వెలుగుచూసింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ శివారు ఆల్వాన్‌పల్లిలో ఉన్న అతి పురాతన జైన దేవాలయం గొల్లత్తగుడి వెనక దీన్ని గుర్తించారు. అక్కడి శిథిల శైవమతం గోళకీ ఆలయం పరిసరాల్లో ఆరు వీరగల్లు శిలలున్నాయి. వాటిల్లో ఒకటిగా ఉన్న ఈ శిలను కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ, ముచ్చర్ల దినకర్‌లు పరిశీలించారు. దానిపై పరిశోధన చేసి, అది చనిపోయిన రాజుతోపాటు సజీవంగా సమాధి చేయించుకున్న అంగరక్షకుడు/ఆంతరంగిక సేవకుడిదిగా తేల్చారు. స్థానికంగా ఉన్న రాజు లేదా రాజు హోదాలో ఉన్న వ్యక్తి చనిపోయినప్పుడు అతని సేవకుడు కూడా ఆత్మార్పణ చేసుకోవటంతో తొలుత సేవకుడిని సమాధి చేసి, దాని మీద రాజు శవాన్ని సమాధి చేసినట్టు పేర్కొన్నారు. ఈ శిల మీద చనిపోయిన రాజు చిత్రం, దిగువ ఆ సేవకుడి చిత్రాన్ని చెక్కారు. వారు శివైక్యం చెందారనటానికి గుర్తులు చెక్కి ఉన్నాయి.

యుద్ధంలో చనిపోతే... : 'శిల మీద లఘు శాసనం ఉంది. అది ఆ సేవకుడు, రాజుకు సంబంధించే ఉండి ఉంటుంది. అస్పష్టంగా ఉన్నందున చదవటం సాధ్యం కావటం లేదు'అని హరగోపాల్ పేర్కొన్నారు. ఇక్కడికి చేరువలోని గంగాపూర్ ప్రాంతంలో గతంలో చాలా యుద్ధాలు జరిగాయని, ఓ యుద్ధంలో స్థానిక రాజు/ ఆ స్థాయి వ్యక్తి చనిపోవటంతో అతని సేవకుడు కూడా సజీవ సమాధి ద్వారా ఆత్మార్పణ చేసుకుని ఉంటాడని, దానికి గుర్తుగా స్థానిక దేవాలయం వద్ద ఈ ఆత్మాహుతి శిలను ఏర్పాటు చేసి ఉంటారని ఆయన చెప్పారు. ఏడెనిమిది శతాబ్దాల్లో దీన్ని ఏర్పాటు చేసి ఉంటారని భావిస్తున్నట్టు చెప్పారు.

ఏపీలోని గుంటూరు జిల్లా ఈపూర్‌లో గతంలో కాకతీయ రాణి రుద్రమ మరణంతో ప్రమేయమున్న ఇలాంటి శిల్పం లభించిందని, అది చెన్నై మ్యూజియంలో ఉందని, మరోటి త్రిపురాంతకంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో తొలిసారి వెలుగు చూసిన ఈ శిల్పానికి చరిత్రలో ప్రాధాన్యముంటుందన్నారు.

నీటిపారుదల రంగంలో రూ. 19 లక్షల కోట్ల పెట్టుబడి

- కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడి
- దేశంలో తాగునీటి నాణ్యత పరీక్షలకు 2 వేల ఎన్ఏబీఎల్ వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌లు
- హ్యాకథాన్‌లో 20 స్టార్టప్‌ల షార్ట్‌లిస్ట్
- టీ హబ్‌లో ఘనంగా జరిగిన జేఐఐఎఫ్ ఇన్వెస్టర్స్ కాన్‌క్లేవ్



- వివరాలు 5లో

క్లుప్తంగా...

బీజేపీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయొద్దు

• బీవీ రాఘవులు



సాక్షి, హైదరాబాద్‌: కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో పట్టు సాధించాలని బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించి బలపడాలని బీజేపీ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయని, అయినా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరించారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా బీజేపీ, సంఘ్‌ పరివారాన్ని నిరంతరం ఎదుర్కొవాల్సిందేనన్నారు. హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో రెండు రోజులు జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ ప్రాబల్యం రోజురోజుకు దిగజారుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించటమే లక్ష్యంగా సీపీఎం నిర్దేశించుకుందని రాఘవులు తెలిపారు. అందుకు భావసారూప్యత కలిగిన రాజకీయ శక్తులను సమీకరించటానికి కృషి చేస్తున్నామన్నారు. బీజేపీని ఓడించటం కోసం కేంద్ర స్థాయిలో ఒక కూటమి ఏర్పడాలనే ఆకాంక్ష మంచిదే అయినా ఆయా రాష్ట్రాల్లోని వైవిధ్య పరిస్థితుల రీత్యా సాధ్యం కాదనేది తమపార్టీ అంచనా అని చెప్పారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడుదాం: జాజుల



కల్వకుర్తి రూరల్‌: రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 0.5 శాతంలోపు ఉన్న దొరలే రాజ్యాన్ని ఏలుతున్నారని, 52 శాతం ఉన్న బీసీలు నామమాత్రపు పదవులకే పరిమితమయ్యారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60 చొప్పున సీట్లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ నిర్ణయం ప్రకటించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీసీలు కులాలు కాదని, ఒక సమూహం అన్నారు. మన ఓట్లతో గద్దెనెక్కిన వారిని మన బతుకుల బాగు కోసం అడుక్కోవాల్సిన దుస్థితి రావడం బాధాకరమన్నారు. అన్ని పార్టీలు 60 చొప్పున అసెంబ్లీ సీట్లు ప్రకటించకపోతే వచ్చే నెలలో లక్షలాది మంది బీసీలతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

తప్పకుంటారా?.. ఓడించమంటారా?

• శంకర్‌నాయక్‌ వ్యతిరేక వర్గం

నెల్లికుదురు: బీఆర్‌ఎస్‌ పార్టీ టికెట్‌ ఆశించకుండా తప్పుకుంటే పార్టీలోనైనా మర్యాద మిగులుతుంది.. లేదంటే నోటాకు ఓటు వేస్తామని ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ వ్యతిరేక వర్గం నాయకులు పట్నంశెట్టి నాగరాజు, జిలుకర యాలాద్రి, జెల్ల వెంకటేష్‌ హెచ్చరించారు. మహబూబాబాద్‌ జిల్లా నెల్లికుదురు మండలం మధనతుర్తి పరిధిలోని ఓ మామిడి తోటలో ఆదివారం ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ వ్యతిరేక వర్గీయులు దాసరి ప్రకాష్‌, వినోద్‌రెడ్డి, బండ ఉపేందర్‌, బైరు వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల శంకర్‌, ప్రభాకర్‌, కొప్పు శ్రీనివాస్‌ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్‌ నాయక్‌ను రెండు దఫాలు గెలిపిస్తే నియంత పోకడలు.. ఏకపక్ష నిర్ణయాలతో తొమ్మిదేళ్ల ఉద్యమం చేసినవారిని వదిలి.. మధ్యలో వచ్చినవారిని అందలమెక్కించారని మండిపడ్డారు. అయినా పార్టీని పట్టుకుని ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి శంకర్‌నాయక్‌కు టికెట్‌ ఇస్తే ఓడిపోవడం ఖాయమని స్పష్టం చేశారు. మరొకరికి అవకాశం ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కాగా.. ఈ విషయం తెలుసుకున్న శంకర్‌నాయక్‌ వర్గీయులైన జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి కొందరితో కలిసి సమావేశ సమీప ప్రాంతానికి చేరుకున్నారు. గొడవ జరుగుతుందని పసిగట్టిన తొర్రూర్‌ సీఐ సత్యనారాయణ, నెల్లికుదురు ఎస్‌ఐ క్రాంతికిరణ్‌ పోలీసులను మోహరించి ఉభయ వర్గాలను పంపించివేశారు.

రెండు పద్దులతో హద్దుల్లేని అవినీతి: తరుణ్‌ఛుగ్‌

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌ ఛుగ్‌ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రహదారుల నిర్మాణంలో ఒకే పనికి రెండు పథకాల నుంచి నిధులు తీసు కొని కేంద్రాన్ని మోసగిస్తోందని మండిపడ్డారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రత్యేక సహాయం కింద చేపట్టిన వివిధ రహదారుల పనులు, తెలంగాణ రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ద్వారా పొందిన రుణాలు సహా.. అన్ని ప్రాజెక్టులపై సీబీఐ విచారణ జరిపించాలని ఛుగ్‌ డిమాండ్‌ చేశారు. నిజామాబాద్‌ జిల్లాకు చెందిన 6 ప్రాజెక్టులకు నిధులను రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ రుణం కింద, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహాయం కింద చూపించి.. డబుల్‌ అకౌంటింగ్‌ చేసి కేంద్ర ప్రభుత్వాన్ని మోసగించిందని వివరించారు.



ప్రమాదకరమని తెలిసినా..

అంతర్రాష్ట్ర రహదారిపై జైనథ్‌ మండలం తర్నం గ్రామం వద్ద శిథిలమైన వంతెనపై నుంచి ప్రమాదకరస్థితిలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన పిల్లర్లు పగుళ్లు తేలి, పక్కకు వంగడంతో జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వంతెనకు పక్కన వేసవికాలంలో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాత్కాలిక రోడ్డుపై గల వంతెన సైతం కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విధిలేని పరిస్థితుల్లో ఆదిలాబాద్‌ నుంచి తర్నం వరకు, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి తర్నం వరకు బస్సులు, ఆటోల్లో వస్తున్న ప్రయాణికులు ప్రమాదకరమైన వంతెనపైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్‌, ఆదిలాబాద్‌

24 గంటల కరెంటా.. 3 గంటల విద్యుత్తా?

▶ మొదటి పేజీ తరువాయి

కరెంట్‌ కావాలా.. సీఎం కేసీఆర్‌ ఇచ్చే 24 గంటల విద్యుత్‌ కావాలా..'అనే ఏకవాక్య అజెండాతో ప్రజల వద్దకు వెళ్దామని కేటీఆర్‌ సవాల్‌ విసిరారు. దీనిపై ప్రజలే తీర్పు చెబుతారని పేర్కొన్నారు.

ఆ పరిస్థితి ఇప్పుడు ఉందా?

రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ప్రధాని మోదీని రేవంత్‌రెడ్డి పల్లెత్తుమాట అన్న పాపాన పోలేదని మంత్రి కేటీఆర్‌ దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేసిన వ్యక్తి కావడంతోనే మోదీపై విమర్శలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌ రాకముందు రాష్ట్రంలో ఎవరివైనా అంత్యక్రియలకు వెళ్తే.. నీళ్లు తోడేందుకు కరెంట్‌ సౌకర్యం లేక స్నానం చేయలేని దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. ఎరువుల దుకాణాల ఎదుట చెప్పుల వరుసలు, ఎండాకాలంలో విద్యుత్‌ సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు జరిగేవని అన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. రైతుబంధు దేశంలోనే ఎక్కడా లేదని, అదొక గొప్ప పథకమని పేర్కొన్నారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో ఎక్కడైనా 24 గంటల విద్యుత్‌ ఇచ్చే పరిస్థితి ఉందా? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో వరద కాలువ పొంగిపొర్లుతోందని తెలిపారు. వర్షాలు లేకున్నా కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీని గోదావరి నది నీటితో నింపుతున్నామని, తద్వారా చివరి ఆయకట్టు రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నేటినుంచి రైతువేదికల్లో వెయ్యి మంది రైతులకు తగ్గకుండా సమావేశాలు నిర్వహిస్తూ.. 'కాంగ్రెస్‌ పాలననాటి కటిక చీకటి వద్దు.. కేసీఆర్‌ 24 గంటల కరెంట్‌ ముద్దు' అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లాలని కేటీఆర్‌ తమ పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, ఇతర ప్రజాప్రతినిధులందరు భాగస్వాములు కావాలని సూచించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి కేటీఆర్‌

చేగుంట(తూప్రాన్‌): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుండే మంత్రి కేటీఆర్‌ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మెదక్‌ జిల్లా చేగుంట శివారు రెడ్డిపల్లి బైపాస్‌ చౌరస్తావద్ద ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కోరుట్లకు చెందిన షేక్‌ సల్మాన్‌, డ్రైవర్‌ జమీరొద్దీన్‌ గాయపడ్డారు. అదే సమయంలో జగిత్యాల పర్యటన ముగించుకొని హైదరాబాద్‌ వెళ్తున్న మంత్రి కేటీఆర్‌ కాన్వాయ్‌ని నిలిపి, తన కారులో క్షతగాత్రులను తూప్రాన్‌లోని ఆస్పత్రికి తరలించారు.

ఎడ్లు, వడ్లు తెల్వని రాహుల్‌ లీడర్‌ కాదు..

ఎడ్లు, వడ్లు.. వ్యసాయ రంగం గురించి తెలియని రాహుల్‌గాంధీ.. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని మాట్లాడుతున్నారని మంత్రి కేటీఆర్‌ విమర్శించారు. స్థానిక నాయకులు కాపీ రాసిస్తే.. దానిని చదువుతారని, ఆయన లీడర్‌ కాదని, రీడర్‌ అని ఎద్దేవా చేశారు. కుంభకోణం జరిగితే రివర్స్‌ పంపింగ్‌ ద్వారా ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ప్రాజెక్టు నిండి కింది ఆయకట్టుకు సాగునీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఇది గత వైఎస్సార్‌ హయాం నాటి కాంగ్రెస్‌ పార్టీలా లేదని, ఇప్పటి టీకాంగ్రెస్‌.. చంద్రబాబు పార్టీ అని ఎద్దేవా చేశారు. అప్పట్లో వ్యవసాయం దండగా అన్న చంద్రబాబు మాటలను ఆయన శిష్యుడైన రేవంత్‌రెడ్డి పుణికి పుచ్చుకున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్‌, సుంకే రవిశంకర్‌, దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ వసంత తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వారసుడు రేవంత్‌

• సెన్సేషన్‌ కోసం చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు
• కాంగ్రెస్‌ పదేళ్ల పాలనా... బీఆర్‌ఎస్‌ తొమ్మిదేళ్ల పాలనా?
• ఏది బాగుందో ప్రజలనే అడుగుదాం
• రేవంత్‌ వ్యాఖ్యల వల్లే కాంగ్రెస్‌ నేతలు బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారు
• మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్‌: 'వ్యవసాయం దండుగ అన్న చంద్రబాబుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిజమైన వారసుడు. ఆయన వ్యవసాయం దండుగ అంటే ఈయన మూడు గంటల కరెంటు చాలు అంటున్నాడు''అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జహీరాబాద్‌ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్‌ నేతలు, రిటైర్డ్‌ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆదివారం తెలంగాణ భవన్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ పరిస్థితి పిచ్చోడి చేతిలా తయారయిందన్నారు. మూడుగంటల కరెంటు రైతులకు చాలు అని దొరికిపోయి కుడితిలో పడ్డ ఎలుకలా, నాలుక కొరుక్కుంటూ బుకాయించడానికి రేవంత్‌ అడ్డం పొడుగు మాట్లాడుతూ రోజుకింత అభాసు పాలవుతున్నాడని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ అధికారంలో ఉన్న కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌, రాజస్థాన్‌ రాష్ట్రాల్లో ఎక్కడైనా రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నారా అని ప్రశ్నించారు.

ఎవరి పాలన బాగుందో చూసి ఓట్లడుగుదాం

గతంలో పదేళ్ల కాంగ్రెస్‌ పాలనలో కరెంటు బాగుందా? తొమ్మిదేళ్ల కేసీఆర్‌ పాలనలో బాగుందా? ఎవరి పాలనలో బాగుందో చూసి ఓట్లేయాలని ప్రజలను ఓట్లు అడుగుదాం.'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కరెంటు మీద ఎంత చర్చ జరిగితే బీఆర్‌ఎస్‌కు అంత మేలని అభిప్రాయపడ్డారు. 'నాడు లోక కల్యాణం కోసం రుషులు యజ్ఞాలు చేస్తే రాక్షసులు భగ్నం చేసేవారు. ఇప్పుడు కేసీఆర్‌ ఓ రుషిలాగా రాష్ట్రాన్ని బాగు చేస్తుంటే కాంగ్రెస్‌ వాళ్లు భగ్నం చేసే ప్రయత్నం చేస్తున్నారు.'అని నిందించారు.

అసలు రాష్ట్రంలో కేసీఆర్‌కు పోటీ ఉంటుందా?

కేసీఆర్‌ గజ్వేల్‌ నుంచి పోటీ చేయాలని రేవంత్‌ అంటున్నాడని, అసలు రాష్ట్రంలో కేసీఆర్‌కు పోటీ ఉంటుందా అని హరీశ్‌ ప్రశ్నించారు. కేసీఆర్‌ఎక్కడ పోటీ చేసినా రాష్ట్ర ప్రజలు కళ్లకు అద్దుకుని గెలిపించారని, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌, కరీంనగర్‌, గజ్వేల్‌లలో కేసీఆర్‌ను గెలిపించారని గుర్తు చేశారు. కేసీఆర్‌ తమ దగ్గర పోటీ చేస్తే బాగుండని, ఊరు, నియోజకవర్గం, జిల్లా బాగుపడతాయని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రేవంత్‌ సెన్సేషన్‌ కోసం చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. కరెంటు గురించి రేవంత్‌ మాటలు విని ఆ పార్టీ నాయకులే తిట్టుకుంటున్నారని చెప్పారు. రేవంత్‌ మాటల పర్యవసానంగానే కాంగ్రెస్‌ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని వ్యాఖ్యానించారు.

'24గంటల విద్యుత్‌'పై కాంగ్రెస్‌ దొరికిపోయింది

• ఫైల్స్‌ ఓపెన్‌కు మేం సిద్ధం.. రేవంత్‌రెడ్డి సిద్ధమేనా?
• మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సవాల్‌



సూర్యాపేట: 24గంటల విద్యుత్‌ సరఫరాపై కాంగ్రెస్‌ దొరికిపోయిందని, దాన్నుంచి తప్పించుకునేందుకు 100 అబద్ధాలు ఆడి రైతులను మరోమారు మోసం చేయాలని కుట్రలు పన్నుతోందని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. 1995 నుంచి 2004 వరకు చంద్రబాబు పాలనలో, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్‌ పాలనలోని ఫైల్స్‌ను బహిర్గతం చేసేందుకు తాము సిద్ధమన్నారు. మాజీ బాస్‌, తాజా బాస్‌ అని చెప్పుకుంటున్న చంద్రబాబు, వైఎస్‌ పాలనలో జరిగిన ఒప్పందాల ఫైల్స్‌పై బహిరంగ చర్చకు రేవంత్‌ సిద్ధమేనా అని సవాల్‌ విసిరారు. పారదర్శకతకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ పాలన పెట్టింది పేరని.. ఇందులో దాపరికమంటూ ఏమి లేదని తేల్చిచెప్పారు. 2014కు ముందు సాగునీరు కాదు కదా కనీసం తాగునీరు ఇచ్చిన పాపాన పోలేదని, కాంగ్రెస్‌ పార్టీ దుర్మార్గాలకు నాశనమైన నల్లగొండ జిల్లానే నిదర్శనమని చెప్పారు. వారి కారణంగానే రెండున్నర లక్షల మంది ఫ్లోరోసిస్‌ వ్యాధిగ్రస్తులు అయ్యారని జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. నాగార్జున సాగర్‌ ఎడమ కాలువ కింద ఏనాడైనా వరుసగా రెండు పంటలకు నీళ్లు ఇచ్చిన చరిత్ర 2014కు ముందు ఉందా? మొదటి పంటకు ఎన్ని నీళ్లిచ్చారు? సాగులోకి ఎంత వచ్చింది? రెండో పంటకు ఎన్నిసార్లు నీళ్లిచ్చారు? ధాన్యం ఉత్పత్తి ఎంత అయ్యింది? లెక్కలు కూడా బయటపెట్టి చర్చించాల్సిందేనన్నారు. ఏ రూట్‌లో వచ్చినా కాంగ్రెస్‌ పార్టీ నాయకులను ఎదుర్కొనేందుకు ఇక్కడి రైతాంగం సిద్ధంగా ఉందన్నారు. మూడు గంటల కరెంట్‌ అన్నందుకు కాంగ్రెస్‌ పార్టీని ఎక్కడికక్కడ నిలదీయాలని, మూడు పంటలకు నీళ్లిస్తున్న సీఎం కేసీఆర్‌ పక్షాన రైతాంగాం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రైతు వేదికలపైనే నిలదీయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిత్యంచావు డప్పులు మోగుతున్నాయి. అప్పుల ఊబిలో చిక్కి రైతు శల్యమవుతున్నాడు. ఊరి నడిబొడ్డున రైతు శవం ఉరికొయ్యకు వేలాడుతోంది. పొలం గట్టుపై పురుగుల మందు డబ్బా పక్కన రైతు నిర్జీవంగా పడి ఉన్న దృశ్యాలు మనసును కలచి వేస్తున్నాయి.'అని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే రైతుతో రాజకీయం చేయడానికి బీఆర్‌ఎస్‌ బయలుదేరుతోందని, రైతు వేదికలను ఇన్నాళ్లూ అలంకార ప్రాయంగా ఉంచి ఇప్పుడు వాటిని రాజకీయ వేదికలుగా మార్చడానికి బరితెగించిందని విమర్శించారు.

రుణమాఫీ, ధాన్యం బకాయిలు అడగండి

రాష్ట్రంలో రుణమాఫీకి అర్హులైన 31 లక్షల మందికి చెందిన రూ.20వేల కోట్ల మేర రుణమాఫీ విషయంలో రైతులను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని రేవంత్‌ విమర్శించారు. జూన్‌ 15 నాటికి ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.6,800 కోట్లు ఉన్నాయని, వాటిని ఎప్పుడు చెల్లిస్తారో బీఆర్‌ఎస్‌ నేతలను ప్రశ్నించాలని ఆ లేఖలో రేవంత్‌ పిలుపునిచ్చారు.

అడుగడుగునా మోసమే: రాష్ట్రంలోని లక్షల ఎకరాల అసైన్డ్‌ భూములను పేదల నుంచి ప్రభుత్వం లాక్కుందని, కానీ దళితులకు మూడెకరాల భూమి ఇచ్చేందుకు మాత్రం వారికి చేతులు రాలేదని రేవంత్‌ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11.50లక్షల మంది ఆదివాసీలు పోడు పట్టాలు పొందేందుకు అర్హులని తేలితే కేవలం 4లక్షల మందికి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. రైతులందరికీ ఫ్రీ ఎరువులు, 24 గంటల ఉచిత విద్యుత్‌, పంటలకు గిట్టుబాటు ధర, రైతు వ్యతిరేక చట్టాలకు మద్దతు, పంటనష్టం కింద ఎకరానికి రూ.10వేలు, రైతు బీమా లాంటి విషయాల్లో అడుగడుగునా మోసమేనని, ఇలా చెప్పుకుంటే రైతులను మోసం చేసిన విషయంలో కేసీఆర్‌ది ఆల్‌టైం రికార్డని ఎద్దేవా చేశారు. సమస్యల పరిష్కారానికి లిఖితపూర్వక హామీ తీసుకునేంతవరకు రైతు వేదికల వద్దకు వచ్చే బీఆర్‌ఎస్‌ నేతలను వదిలిపెట్టవద్దని, సమస్యలను పరిష్కరించుడో, బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టుడో తేల్చేదామని కోరారు. రైతాంగానికి కాంగ్రెస్‌ అండగా ఉంటుందని ఆ లేఖలో రేవంత్‌ రెడ్డి వెల్లడించారు.

శిక్షపడిన మరునాడే విడుదల!

• రెండు ఉగ్రవాద కేసుల్లో అరెస్టైన ఒబేదుర్‌ రెహ్మాన్‌
• పాతబస్తీలోని గుల్షన్‌ ఎక్బాల్‌ కాలనీ వాసి ఇతడు
• 2012 నుంచి ఇప్పటి వరకు జైల్లో రిమాండ్‌ ఖైదీనే
• జ్యుడీషియల్‌ రిమాండ్‌లోనే పూర్తి అయిన శిక్షాకాలం



నిందితుడు ఒబేదుర్‌ రెహ్మాన్‌

సాక్షి, హైదరాబాద్‌: నిషిద్ధ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉండి, దేశంలోని ప్రధాన నగరాల్లో విధ్వంసాలకు కుట్రపన్నిన కేసులో అరెస్టు అయిన పాతబస్తీ వాసి ఒబేదుర్‌ రెహ్మాన్‌కు ఢిల్లీ కోర్టు గత బుధవారం పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్షా కాలం రిమాండ్‌ పీరియడ్‌లోనే పూర్తి కావడంతో ఆ మర్నాడే ఢిల్లీలోని తీహార్‌ జైలు నుంచి విడుదలయ్యాడు. ఇతడిపై బెంగళూరు సీసీబీ పోలీసులు నమోదు చేసిన మరో కేసులోనూ ఇప్పటికే శిక్షపడటం, రిమాండ్‌లోనే అదీ పూర్తవడం జరిగాయి. ఒబేదుర్‌ రెహ్మాన్‌ గత శుక్రవారం సిటీకి చేరుకున్నాడు.

తొలి కేసు బెంగళూరులో నమోదు...

పాతబస్తీలోని చంద్రాయణగుట్ట గుల్షన్‌ ఇక్బాల్‌ కాలనీకి చెందిన ఒబేదుర్‌ రెహ్మాన్‌ డిగ్రీ చదువుతుండగానే ఉగ్రవాద బాటపట్టాడు. ఉగ్రవాద సంస్థ హుజీలో కీలకపాత్ర పోషించాడు. బెంగళూరులో ఉన్న బీజేపీ నాయకులను, ప్రముఖులను హతమార్చడానికి ఈ మాడ్యుల్‌కు చెందిన ఉగ్రవాదులు 2012లో రంగంలోకి దిగారు. ఈ విషయం గుర్తించిన కేంద్ర నిఘా వర్గాలు బెంగళూరు సెంట్రల్‌ క్రైమ్‌ బ్రాంచ్‌ పోలీసులు హైదరాబాద్‌లో ఒబేద్‌తో పాటు నాందేడ్‌, బెంగళూరు, హుబ్లీలకు చెందిన 11 మందినీ అరెస్టు చేశారు. వీళ్ల జైల్లో ఉండగానే ఐఎం నేతృత్వంలో సాగిన మరో కుట్ర వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌, ఢిల్లీల్లో పేలుళ్లకు కుట్ర పన్నడంతో అదే ఏడాది ఢిల్లీ ఎన్‌ఐఏ యూనిట్‌ మరో కేసు నమోదు చేసింది. ఒబేద్‌ సహా మరికొందరికి బెంగళూరు జైలు నుంచి 2013లో తీహార్‌ జైలుకు తరలించింది.

జైల్లో ఉండగానే రెండు 'శిక్షలు' పూర్తి...

ఈ రెండు కేసులకు సంబంధించి ఒబేద్‌ సహా మరికొందరు ఉగ్రవాదులు 2012 నుంచి జైల్లో రిమాండ్‌ ఖైదీలుగానే ఉన్నారు. బెంగళూరు కేసులో నిందితులుగా ఉన్న వాళ్ళు న్యాయస్థానంలో నేరం అంగీకరించారు. దీంతో కోర్టు వీరిని దోషులుగా తేలుస్తూ ఆరేళ్ళ శిక్ష విధించింది. అప్పటికే వీళ్ళు అంతకంటే ఎక్కువే జైలులో ఉండటంతో ఆ కాలాన్ని కోర్టు శిక్షగా పరిగణించింది. ఢిల్లీలో నమోదైన కేసు విచారణ పూర్తి కావడంతో ఈ నెల 7న ఒబేద్‌ సహా నలుగురిని దోషులుగా తేల్చిన కోర్టు బుధవారం పదేళ్ళ జైలు విధిస్తూ తీర్పు చెప్పింది. అయితే ఈ ఉగ్రవాదులు అంతకంటే ఎక్కువ రోజులే జైల్లో రిమాండ్‌ ఖైదీలుగా ఉండటంతో శిక్షాకాలం పూర్తయింది. దీంతో ఒబేద్‌ తదితరులు పదేళ్ల శిక్షపడిన మరుసటి రోజైన గురువారమే తీహార్‌ జైలు నుంచి విడుదలయ్యారు.

ఇదే కేసులో భత్కల్‌ తదితరులు...

ఢిల్లీ ఎన్‌ఐఏ యూనిట్‌ నమోదు చేసిన ఈ కేసులో హైదరాబాద్‌లోని గోకుల్‌చాట్‌–లుంబినీపార్క్‌ ట్విన్‌ బ్లాస్ట్‌, దిల్‌సుఖ్‌నగర్‌ జంట పేలుళ్ళకు బాధ్యులైన వాళ్ళూ నిందితులుగా ఉన్నారు. ఐఎం ఉగ్రవాదులైన రియాజ్‌ భత్కల్‌, యాసీన్‌ భత్కల్‌, అసదుల్లా అక్తర్‌, తెహసీన్‌ అక్తర్‌, జియా ఉర్‌ రెహ్మాన్‌ అలియాస్‌ హడ్డీపై విచారణ జరగాల్సి ఉంది. వీరిలో రియాజ్‌ మినహా మిగిలిన వాళ్ళు అరెస్టు కావడం, నగరంలో జరిగిన బాంబు పేలుళ్ళ కేసుల్లో శిక్షలు పడటం కూడా జరిగింది.

ఐఎం కో–ఫౌండర్స్‌ రియాజ్‌ భత్కల్‌, ఇక్బాల్‌ భత్కల్‌ ఆదేశాల మేరకు మిగిలిన ఉగ్రవాదులు ఢిల్లీ, హైదరాబాద్‌ల్లో మానవబాంబులతో మారణహోమం సృష్టించడానికి కుట్ర పన్నారని ఎన్‌ఐఏ గుర్తించింది.

హైదరాబాద్‌ నుంచి నేరుగా విమానాలు ఏర్పాటు చేయండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి యూఎస్‌ఏ ఎన్నారైల వినతి



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌ నుంచి నేరుగా అమెరికాకు విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి యూఎస్‌ఏ ఎన్నారైలు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు అమెరికాలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని తెలుగు ఎన్నారైలు కలిశారు. ఢిల్లీ, ముంబై వంటి అనేక ఇతర భారతీయ నగరాలు ఇప్పటికే అమెరికాలోని ప్రధాన నగరాలతో నేరుగా విమాన కనెక్షన్లు కలిగి ఉన్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం కోసం ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్‌ మరింత ఎదుగుతుందని పేర్కొన్నారు. కాగా ఎయిర్‌ ఇండియా కొత్త ఫ్లైట్లను ఆర్డర్‌ చేయటంతోపాటు, కొత్త రూట్లలో విమాన సర్వీసులను తెచ్చేందుకు కృషి చేస్తోందని, కేంద్ర అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా ప్రవాసుల కోరిక నెరవేరేలా చూస్తామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విలాస్‌ జంబుల, లక్ష్మణ్‌ అనుగు, సంతోష్‌ రెడ్డి, శ్రీకాంత్‌ తుమ్మల, ప్రదీప్‌ కట్టా, వంశీ యమజాల, మధుకర్‌ రెడ్డి, రామ్‌ వేముల, రఘువీర్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలంగాణ డెవలప్‌మెంట్‌ ఫోరమ్‌ నేతలు భేటీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కిషన్‌రెడ్డితో అమెరికాలోని ప్రవాస తెలంగాణవాదులు, తెలంగాణ డెవలప్‌మెంట్‌ ఫోరమ్‌ నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టీడీఎఫ్‌ మాజీ అధ్యక్షుడు మురళి చింతలపాని, లక్ష్మణ్‌ అనుగు, ఇతర కార్యవర్గసభ్యులు కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్ర సాధనలో ప్రవాస తెలంగాణవాసులు, టీడీఎఫ్‌ పోషించిన పాత్రను కిషన్‌రెడ్డి అభినందించారు.

హరీశ్‌ గురించి మాట్లాడితే జనం సహించరు


• రేవంత్‌రెడ్డి తక్షణం క్షమాపణ చెప్పాలి
• బీఆర్‌ఎస్‌ నేతల డిమాండ్‌



సాక్షి, హైదరాబాద్‌: మంత్రి హరీశ్‌రావు, అసెంబ్లీ స్పీకర్‌, మండలి చైర్మన్ల గురించి టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌ రెడ్డి అభ్యంతకర భాషలో మాట్లాడితే తెలంగాణ ప్రజలు సహించరని, తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్‌ పార్టీ డిమాండ్‌ చేసింది. వ్యక్తిగత దూషణలు వదిలేయాలని డిమాండ్‌ చేసింది. ఉచిత విద్యుత్‌ను ఎత్తివేస్తామన్న కాంగ్రెస్‌ ప్రకటనతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించింది. ఆదివారం బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్‌ అంశాన్ని రైతులవద్ద తాము చర్చకు పెట్టే సరికి రేవంత్‌రెడ్డి అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని, కోల్పోయిన ప్రతిష్టను తిరిగి దక్కించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ విమర్శించారు. రేవంత్‌ ట్రాప్‌లో బీఆర్‌ఎస్‌ పడదని స్పష్టం చేశారు. రేవంత్‌ ముఖం కాంగ్రెస్‌దని, మనసు మాత్రం టీడీపీదని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్నపుడు నువ్వు ఏ గోడలకు సున్నాలు వేసుకుంటున్నావో అని దుయ్యబట్టారు. రేవంత్‌ తన మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. దమ్ముంటే రేవంత్‌ రెడ్డి పటాన్‌చెరు సబ్‌ స్టేషన్‌ దగ్గర తనతో చర్చకు రావాలని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి సవాలు విసిరారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌ మాటలు తమ పార్టీకి రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి లాంటిదని మరో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌ మాటలతో తమకు వంద నియోజకవర్గాల్లో గెలుపు ఖాయమైందన్నారు. కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి రేవంత్‌ ఒక్కడు చాలన్నారు. తెలంగాణ ఫైనాన్స్‌ కమిషన్‌ చైర్మన్‌ వి.భూపాల్‌ రెడ్డి, హౌండ్లూమ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ చింతా ప్రభాకర్‌ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వాళ్లకే టికెట్‌

• కాంగ్రెస్‌ నేత నాగం జనార్దన్‌రెడ్డి
• కొల్లాపూర్‌లో ముఖ్య కార్యకర్తల భేటీ
• టికెట్‌ తనకే ఇవ్వాలంటున్న జగదీశ్వర్‌రావు



సాక్షి, నాగర్‌కర్నూల్‌: కాంగ్రెస్‌లో పార్టీ కోసం పనిచేసిన వారికే టికెట్‌ దక్కుతుందని, సర్వేలు, ఉత్తుత్తి ప్రచారాలను నమ్మవద్దని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌ జిల్లా కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నియోజకవర్గ నేత చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితోపాటు నాగం జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ నెల 20న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరనున్న నేపథ్యంలో ఆదివారం జగదీశ్వర్‌రావు తన అనుచరులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కొల్లాపూర్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను పటిష్టపర్చిన జగదీశ్వర్‌రావుకే పార్టీ టికెట్‌ ఇస్తుంది. పార్టీని విడిచిపెట్టి, నష్టం చేసి పోయినవాళ్లు ఇప్పుడు మళ్లీ చేరితే పార్టీకి లాభం అనుకోవడం కరెక్ట్‌ కాదు.. కొల్లాపూర్‌తోపాటు నాగర్‌కర్నూల్‌, గద్వాల, వనపర్తిలో తనవాళ్లకు సీట్లు కావాలని పోయిండట. ముందు నీ సత్తా ఏంటో కొల్లాపూర్‌లో చూపాలి'అని వ్యాఖ్యానించారు. తాను తలచుకుంటే పరిణామాలు వేరేలా ఉంటాయని నాగం హెచ్చరించారు. జగదీశ్వర్‌రావుకు తాను అండగా ఉన్నానని చెప్పారు.

మల్లురవి ప్రసంగానికి అడ్డుపడిన కార్యకర్తలు

సమావేశంలో మల్లురవి మాట్లాడుతూ.. సర్వేలో వచ్చిన ఫలితాల ప్రకారమే పార్టీ నాయకత్వం నేతలకు టికెట్లు ఇస్తుందని చెప్పారు. దీంతో జగదీశ్వర్‌రావు వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జగదీశ్వర్‌రావు జిందాబాద్‌.., కొల్లాపూర్‌ గడ్డ.. జగదీశ్వర్‌రావు అడ్డా'అంటూ నినాదాలు చేశారు. కొల్లాపూర్‌లో పార్టీని పటిష్టం చేసేందుకు ఎంతో కృషిచేశానని, పార్టీలో పనిచేసిన వారికే టికెట్‌ వస్తుందని నమ్ముతున్నానని జగదీశ్వర్‌రావు అన్నారు.

పాత పింఛన్ అమలు చేయకుంటే యుద్ధమే!

సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ


గద్వాలలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

గద్వాల: పాత పింఛన్ విధానాన్ని అమలు చేయకుంటే ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ హెచ్చరించారు. ఆదివారం ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారికి పూజలు చేసి రథయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పాత పింఛన్ అమలు కోసం ఇప్పటివరకు శాంతియుతంగా అనేక ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వానికి నిరసన తెలిపామని.. కానీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో గతంలో ఎన్నడూలేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2004 తర్వాత ఉద్యోగాలు పొందిన వారందరికీ పింఛన్ రద్దు చేయడం దారుణమన్నారు. పెన్షన్ భిక్ష కాదని.. మన హక్కు అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల నాటికి సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గద్వాల జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. 'అబీ నహీతో.. కబీ నహీ' నినాదంతో చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి పెద్దసంఖ్యలో స్పందన లభించింది. 'సీపీఎస్ వద్దు– ఓపీఎస్ ముద్దు.. పింఛన్ ఉద్యోగుల హక్కు' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పల్లె దవాఖానా డాక్టర్ల అధ్యక్షుడిగా అరుణ్

రాష్ట్ర కమిటీ ఎన్నిక



కాశిబుగ్గ: పల్లె దవాఖానా డాక్టర్ల రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో నిర్వహించారు. రాష్ట్రంలోని 33జిల్లాలకు చెందిన పల్లె దవాఖానాల్లో పని చేస్తున్న డాక్టర్లు హాజరయ్యారు. డాక్టర్ల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్.అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ పి.మహేందర్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు దశరథ్‌నాయక్, అజయ్‌కుమార్, శ్రీనివాస్, జైపాల్, రాంబాబు, సురేశ్, సదానందం, విజయ్, స్వాపర్ణన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పల్లె దవాఖానా డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



చెరువు 'ఖాళీ'శ్వరం!

తలాపునే గోదావరి.. పై నుంచి ప్రాణహిత నది వరదతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీబ్యారేజీలో జలకళ ఉట్టిపడుతోంది. లక్ష్మీ బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో సుమారు 22 కిలోమీటర్ల మేర నీరు నిలిచి సముద్రాన్ని తలపిస్తోంది. కానీ స్థానికంగా వర్షాలు లేకపోవడంతో కాళేశ్వరంలోని చెరువులు, కుంటలు మాత్రం నీరు లేక వెలవెలబోతున్నాయి. కాళేశ్వరంలోని మంగలి కుంట చెరువు ఏటా జూన్ 20లోపు నీటితో నిండేది. జూలై 16 వచ్చినా వర్షాలు లేకపోవడంతో ఇప్పటికీ చెరువులోకి చుక్కనీరు రాలేదు. మంగలికుంట చెరువులో ఆదివారం యువత క్రికెట్ ఆడుతూ కనిపించారిలా.. - కాళేశ్వరం

బదిలీలు ఉంటాయో.. లేదో!?

- గురుకులాన్ని వీడని జీఓ 317 గందరగోళం!
- ఉద్యోగుల కేటాయింపు ముగిసి ఏడాదైనా వెలువడని ఉత్తర్వులు
- గతేడాదే జాబితాలు రూపొందించిన సొసైటీలు
- 2023–24 విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని అప్పట్లో స్పష్టీకరణ
- కానీ విద్యా సంవత్సరం ప్రారంభమైనా జాడలేని నూతన కేటాయింపు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లోని ఉద్యోగుల్లో జీఓ 317 భయం వీడలేదు. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత స్థానికత ఆధారంగా ఉద్యోగుల కేటాయింపులను దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి చేసినప్పటికీ... కేవలం గురుకుల విద్యా సంస్థల్లో మాత్రమే ఈ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. నాలుగు గురుకుల సొసైటీల పరిధిలో దాదాపు 30వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. వీరందరికీ స్థానికత ఆధారంగా జిల్లా, జోనల్, మల్టీజోనల్ స్థాయిలో కేటాయింపులు జరిపారు. ఈ మేరకు నూతన కేటాయింపులతో కూడిన జాబితాలను గురుకుల సొసైటీలు సిద్ధం చేసినప్పటికీ 2022–23 విద్యా సంవత్సరం మధ్యలో ఉద్యోగులకు స్థానచలనం కలిగిస్తే ఇబ్బందులు వస్తాయన్న భావనతో ఈ ప్రక్రియను అప్పట్లో వాయిదావేశారు. కానీ ప్రస్తుతం నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై రెండో నెల గడుస్తున్నా జీఓ 317 అమలు ఊసేలేదు.

ఉద్యోగ ఖాళీలపై స్పష్టత ఎలా...?

రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి రావడంతో ఉద్యోగ ఖాళీలపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో ముందుగా ఉద్యోగుల కేటాయింపులు పూర్తయిన తర్వాతే ఖాళీలపై స్పష్టత వస్తుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కసరత్తు చేసింది. ఈ క్రమంలో గతేడాది అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ కేటాయింపులు పూర్తయ్యాయి. స్థానికత ఆధారంగా ఈ కేటాయింపులు జరపడంతో జిల్లా, జోన్లు, మల్టీజోన్ల వారీగా ఉద్యోగ ఖాళీలపై స్పష్టత వచ్చింది. ఈక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులున్న గురుకుల విద్యా సంస్థల సొసైటీల్లోనూ జీఓ 317 అమలు చేస్తేనే ఉద్యోగ ఖాళీల లెక్క తేలుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం... ఆ దిశగా చర్యలు చేపట్టాలని సొసైటీ కార్యదర్శులను ఆదేశించింది. దాంతో గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో ఈ కసరత్తు పూర్తి చేసి ప్రాథమిక జాబితాలు రూపొందించినప్పటికీ... వాటిని ఇప్పటివరకు అమలు చేయలేదు. వాస్తవానికి 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి నూతన కేటాయింపులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడితే ఆ మేరకు ఉద్యోగులు విధుల్లో చేరే వీలుండేది. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండో నెల గడుస్తున్నా జీఓ 317 అమలుపై సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం కొనసాగుతుండడం... మరోవైపు ఎన్నికల సమయం ముంచుకొస్తుండడంతో ఉద్యోగులను కొత్త స్థానాలకు బదిలీ చేసే అవకాశంపై సొసైటీ వర్గాల్లో కొంత అనిశ్చితి కనిపిస్తోంది. ఇంకోవైపు గురుకుల విద్యా సంస్థల్లో కొలువుల ఖాళీల లెక్కపైనా అయోమయం నెలకొంది.

'భరోసా' మరింత పెంచేలా..!

- భరోసా సెంటర్ల సిబ్బంది పనితీరుపై బాధితుల నుంచి ఫీడ్‌బ్యాక్
- తదనుగుణంగా లోపాల సవరణపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళ భద్రతా విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తున్న భరోసా కేంద్రాల్లో బాధితులకు భరోసా మరింత పెంచడంపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. భరోసా కేంద్రాలకు సాయం కోసం వచ్చిన బాధితుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. లైంగికదాడులు, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలు, చిన్నారులకు ఒకే వేదికలో పోలీస్, న్యాయ, వైద్య సాయం అందించేందుకు రూపొందించిన ఈ కేంద్రాల్లో.. సిబ్బంది పనితీరు ఎలా ఉంటోంది? సకాలంలో స్పందిస్తున్నారా? ఎఫ్ఐఆర్ ఎప్పుడు నమోదు చేశారు? భరోసా సెంటర్‌కు అదే రోజు తీసుకెళ్లారా? మీతో లేడీ కానిస్టేబుల్ వచ్చారా? పోలీసులు వారి వాహనంలోనే తీసుకెళ్లారా? భరోసా సెంటర్‌లో సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది? కేసుల ఫాలోఅప్ సక్రమంగా ఉంటోందా? లైంగిక దాడులకు గురైన చిన్నారుల విషయంలో కేంద్రాల సిబ్బంది సరైన రీతిలో స్పందిస్తున్నారా? సేవల్లో ఇంకేమైనా లోపాలున్నాయా? వంటి ప్రశ్నలు అడుగుతున్నారు. అంతేకాదు.. బాధిత మహిళలకు మరింత అండగా నిలిచేందుకు ఇంకా ఏయే చర్యలు తీసుకోవాలని సలహాలు, సూచనలు కూడా కోరుతున్నట్లు అధికారులు తెలిపారు. బాధితుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా క్షేత్రస్థాయిలో మార్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్యాకేజీ కవర్ల పరిశ్రమలో భారీ పేలుడు


డీఆర్‌డీవో ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

▶ మొదటి పేజీ తరువాయి

రాజుసాన్, మంజుదాస్, ప్రదీప్‌మాన్, సత్య, గిరిధర్‌సింగ్, రాహుల్‌ఘడ్, సునీల్ ఎంకీతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి, అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం డీఆర్‌డీఓ ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారేనని.. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రుల వివరాలను తెలుసుకున్నారు. పేలుడు షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిందా, మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే కంపెనీలో కలర్ తయారు చేసే క్రమంలో వాడే మెటాలిక్ పొడి పరిమితికి మించి వేడి (ఓవర్ హీట్) కావడంతో ప్రమాదం జరిగిందని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

కంప్యూటర్ కోర్సులు 'కేక'

▶ మొదటి పేజీ తరువాయి

బిజినెస్ సిస్టంలో 318, సీఎస్‌సీ (సైబర్ సెక్యూరిటీ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ)లో 133, సీఎస్‌సీ (నెట్‌వర్క్)లో 91, సీఎస్‌సీ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)లో 870 సీట్లు ఉండగా.. అన్నీ భర్తీ అయినట్టు అధికారులు వెల్లడించారు.

భారీగా సీట్లు మిగిలిన సివిల్, మెకానికల్, ఈఈఈ

కౌన్సెలింగ్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల పట్ల విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత ఏడాది కూడా ఇదే విధంగా ఉండటంతో చాలా కాలేజీలు ఈ బ్రాంచీల్లో సీట్లు రద్దు చేసుకోవడంతో 7 వేల సీట్లు తగ్గాయి. అయినప్పటికీ ఈ కోర్సుల్లో సీట్లు భారీగా మిగిలిపోయాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వాటి అనుబంధ బ్రాంచీల్లో 17,274 సీట్లు అందుబాటులో ఉంటే, 13,595 సీట్లు మాత్రమే కేటాయించారు. 3,679 సీట్లు మిగిలిపోయాయి. మెకానికల్, సివిల్ సహా వాటి అనుబంధ బ్రాంచీల్లోనూ 3,642 సీట్లు మిగిలిపోయాయి. సివిల్ ఇంజనీరింగ్‌లో 44.76 శాతం, మెకానికల్ 38.50 శాతం సీట్లే భర్తీ అయ్యాయి. ఈఈఈలోనూ 58.38 శాతం సీట్లు భర్తీ చేశారు.

- అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతుల్లో పాత కాలేజీల ఖాళీలతో పాటు, అన్ని కొత్త కాలేజీల్లో ఉన్న ఖాళీలను చూపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలంగాణ బోధనా ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన జారీచేశారు.

కల్పవల్లీ.. కరుణించు తల్లీ!




అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న తలసాని, ఇంద్రకరణ్‌రెడ్డి

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర సంబరాలు అంబరాన్నంటాయి. భాగ్యనగరంలో ఆధ్యాత్మికతను ద్విగుణీకృతం చేశాయి. ఆదివారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాతబస్తీతో పాటు సిటీలో వాడవాడలా వేడుకలు ఉత్సాహంగా సాగాయి. అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు దేవాలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాతబస్తీలో ఏ వీధి చూసినా సందడి సందడిగా కనిపించింది. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి, మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర, సుల్తాన్‌షాహీ జగదాంబ, అక్కన్న మాదన్న, బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ, గౌలిపురా కోట మైసమ్మ, ఉప్పుగూడ మహంకాళి, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ తదితరులు ప్రధాన దేవాలయాల్లోని అమ్మవార్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు.

తొట్టెల సమర్పణ..



అమ్మవారికి ఊయల (తొట్టెల)ను సమర్పించేందుకు పురానాపూల్, లాల్‌దర్వాజా, మీరాలంమండి, కసరట్టా, దూద్‌బౌలి, ఛత్రినాక, ఉప్పుగూడ, గౌలిపురా, మేకలబండ, సీబీబీ క్వార్టర్స్, లలితాబాగ్, నరహరినగర్, కందికల్ గేట్, అరుంధతీ కాలనీ, హరిబౌలి, అలియాబాద్ తదితర ప్రాంతాలలో దేవాలయాలు, వివిధ బస్తీ కుల సంఘాల ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపులను నిర్వహించారు. పోతరాజులు నృత్యాలు ఆకట్టుకున్నాయి.


మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, దానం నాగేందర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాతబస్తీలోని ప్రధాన దేవాలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.







అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అజ్ఞానమే ప్రతి దుష్టత్వానికీ వేరూ, కాండమూ!

– ప్లేటో

సాక్షి

సోమవారం, 17 జూలై 2023

పట్టనట్టుండే రచయిత

ఆధునిక కాలంలో దాదాపు ఒక సన్యాసిగా బతికిన సుప్రసిద్ధ 'ఫ్రెంచ్' రచయిత మిలన్ కుందేరా జూలై 11న తన 94వ ఏట కన్నుమూశారు. ఒక దశ తర్వాత ఇంటర్వ్యూలు ఇవ్వడానికి నిరాకరించి, అధికారిక జీవిత చరిత్రలు రాయడానికి ఒప్పుకోక, జనానికి దూరంగా, తన గురించి వీలైనంత తక్కువ తెలిసేలా మసలుకున్నారు. రాతలోకి వచ్చినది మాత్రమే జీవితం; రచయిత వ్యక్తిగత జీవితం గురించిన కుతూహలం రచనల సమగ్రతను దెబ్బకొడుతుందనేది ఆయన భావన. కమ్యూనిస్టు రచయితగా మొదలైన కుందేరా, అనంతర కాలంలో ఆ భావజాలంతో పాటు తన మాతృదేశం చెకొస్లొవేకియాకూ, దాని పౌరసత్వానికీ, చివరకు తన మాతృభాష 'చెక్'కూ దూరం కావాల్సి వచ్చింది. మొదట్లో చెక్ భాషలోనే రాసినప్పటికీ, మలి దశలో ఫ్రెంచ్‌లోనే రాయడానికి నిర్ణయించుకున్నారు. తనను ఫ్రెంచ్ రచయితగానే చూడాలనీ, తన రచనలను ఫ్రెంచ్ భాషవిగానే పరిగణించాలనీ కోరారు.

1929 ఏప్రిల్ 1న జన్మించిన మిలన్ కుందేరా యవ్వనోత్సాహంలో కమ్యూనిస్టు విప్లవాన్ని సమర్థించినవాడే. సోషలిస్టు రష్యాకు జైకొట్టినవాడే. 24వ యేట మొదటి సంపుటి సహా, విప్లవ సమర్థనగా మూడు కవితా సంపుటాలను వెలువరించినవాడే. విమర్శక గొంతులను నిరసిస్తూ, ఇంకా ఎవరినీ లోపలేసి తాళాలు వేయడం లేదు కదా అని వాదించినవాడే. కానీ పై అధికారిని విమర్శించినందుకు ఒకసారీ, పార్టీలో సంస్కరణలు జరగాలని కోరినందుకు మరోసారీ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. దీనివల్ల తనకు విముక్తి లభించిన భావన కలిగిందని తర్వాత చెప్పారాయన. రాయాలనుకుంటున్న థీమ్స్ మీద పెట్టుకున్న మానసిక నిరోధం తొలగినట్టయి రచయితగా మరింత స్వేచ్ఛను పొందారు. ఆయన తొలి నవల 'ద జోక్'(1967)లో వినోదానికి అనుమతి లేని సంతోషంలో ఉంటారు మనుషులు. ప్రేయసికి రాసిన లేఖలోని ఒక సరదా వాక్యాన్ని (ఆశావాదం అనేది మానవాళి నల్లమందు) కూడా ఓ త్రిసభ్య కమిటీ విచారిస్తుంది. ఈ కారణంగా కథానాయకుడిని పార్టీ నుంచి బహిష్కరించే ఓటింగుకు ఆఖరికి కర్తవ్యోన్ముఖురాలైన అతడి ప్రేయసీ చెయ్యెత్తి సమ్మతిస్తుంది.

పార్టీ నుంచి బహిష్కరణ వల్ల కుందేరా తన ప్రొఫెసర్ ఉద్యోగం పోగొట్టుకుని, పియానో వాయించే తండ్రి వారసత్వంగా వచ్చిన సంగీతాన్ని పాఠాలుగా చెబుతూ, దినసరి కూలీగా పనిచేస్తూ, మారుపేరుతో పత్రికలకు జాతక ఫలాలు రాస్తూ బతకాల్సి వచ్చింది. ఆయన ఫోన్‌ను ట్యాప్ చేశారు. రచనలను నిషేధించారు. ఒక దశలో సీక్రెట్ పోలీసులు రాతప్రతుల కోసం ఆయన గదిని గాలించారు. అప్పుడే పూర్తయివున్న 'లైఫ్ ఈజ్ ఎల్స్‌వేర్'(1973) నవల రాతప్రతిని దాని పేరుకు తగినట్టుగానే స్నేహితుల సాయంతో అప్పటికే ఫ్రాన్స్‌కు తరలించారు. ఆ తర్వాత రెండేళ్లకు ఆయన ఫ్రాన్స్‌కు వెళ్లిపోయారు. 1979లో చెక్ పౌరసత్వం రద్దయింది. 1981లో ఫ్రాన్స్ పౌరసత్వం పొందారు. (నలభై ఏళ్ల తర్వాత, 2019లో మాత్రమే చెక్ పౌరసత్వాన్ని పునరుద్ధరించారు. గొప్ప చెక్ రచయిత పునరాగమనానికి ప్రతీకగా చూస్తున్నామని చెబుతూ, ఆ చర్యను గొప్ప గౌరవంగా అభివర్ణించింది ప్రభుత్వం.)

స్టాలినిస్టు కాని మనిషిని నేను సులభంగా గుర్తించగలిగేవాడిని; ఆయన నవ్వే విధానం నేను భయపడాల్సిన మనిషి కాదని చెప్పేది, అన్నారు కుందేరా. ఆయనకు అత్యంత ప్రసిద్ధి తెచ్చిపెట్టిన నవల 'ది అన్‌బేరబుల్ లైట్‌నెస్ ఆఫ్ బీయింగ్' (1984)లో కథానాయిక తమ కుక్కపిల్లను ఒడిలోకి తీసుకుని జోకొడుతూ, 'భయపడకు, భయపడకు, భయపడకు' అని దాన్ని ఊరడిస్తుంది. 'ద బుక్ ఆఫ్ లాఫ్టర్ అండ్ ఫర్‌గెటింగ్'(1979)లోని 'అధికారానికి వ్యతిరేకంగా మనిషి చేసే పోరాటం, మరపునకు వ్యతిరేకంగా జ్ఞాపకం చేసే పోరాటం' అనే వాక్యం చదివినప్పటినుంచీ తనతో ఉండిపోయిందనీ, ప్రపంచంలోని ఘటనల పట్ల తన అవగాహనను ప్రజ్వరిల్లజేసిందనీ చెబుతారు సల్మాన్ రష్దీ.

తన రచనా గదిలోని ఒక గోడకు తండ్రి ఫొటోనూ, తన అభిమాన సంగీత కారుడు లియోస్ యానాచెక్ ఫొటోనూ పక్కపక్కనే పెట్టుకున్న కుందేరా, నవల మాత్రమే సాధించేది సాధిస్తూనే అది ఒక మ్యూజికల్ నోట్‌లా ఉండాలనీ, నవలలోని అందరి కథనాలూ ఏకసూత్రతతో లయబద్ధంగా అమరాలనీ అంటారు. ఒక కామా కూడా ఉండాల్సిన చోట లేకపోతే నచ్చని పర్ఫెక్షనిస్టు ఆయన. చిత్రంగా ఆయన మొదటి నవల జోక్ ఆంగ్లంలో వచ్చినప్పుడు, తన నియంత్రణలో లేని అనువాదం కారణంగా అధ్యాయాలు తారుమారయ్యాయి. దీనివల్ల 'ఐరనీ' కాస్తా 'సెటైర్' అయ్యింది. 1992లో మాత్రమే ఆయనకు సంతృప్తి కలిగించే అనువాదం వచ్చింది. ఆంగ్లభాషలో ఇది ఐదో వెర్షన్ అని ఆయనే ముందుమాట రాస్తూ నవ్వుకున్నారు. అయితే నవలల పేర్ల విషయంలో మాత్రం ఆయనకు పట్టింపు లేదు. ఒక నవల పేరును ఇంకో నవలకు పెట్టినా సరిగ్గా సరిపోతుందంటారు. తనను పీడించే అంశాలు పరిమితమైనవనేది ఆయన ఉద్దేశం. 2015లో వచ్చిన 'ద ఫెస్టివల్ ఆఫ్ ఇన్‌సిగ్నిఫికెన్స్' ఆయన చివరి నవల. మలి దశ రచనల్లో రాజకీయాల కంటే తత్వానికి ప్రాధాన్యం ఇచ్చిన కుందేరా, జీవితానికి రెండో అవకాశం లేకపోవడం కూడా ఒక విముక్తి లాంటిదేనంటారు. ప్రపంచ వ్యాప్తంగా జనాలు అర్థం చేసుకోవడం కంటే తీర్పులు ఇవ్వడానికే ఇష్టపడుతున్నారంటూ, ప్రపంచంలోని ఘటనలను మరీ అంత సీరియస్‌గా తీసుకోకపోవడం కూడా ఒక ప్రతిఘటనే అని చెబుతారు. అన్నీ పట్టించుకుంటూనే ఏమీ పట్టనట్టుగా ఉండాలంటే చాలా సంయమనం కావాలి.

అవునని తెలిసీ... కాదని అంటాం!

కామెంట్



కరణ్ థాపర్

"దేశంలోని వివిధ వ్యవస్థల దర్యాప్తు అధికారులు, ప్రభుత్వం తరపున వాదించే న్యాయవాదులు, కేసు విచారణ న్యాయమూర్తులు... వీళ్లంతా తమ వాదనలలో, తీర్పులలో పదే పదే స్పష్టమైన కుల దురభిమానాన్ని ప్రదర్శించి కూడా అలాంటిదేమీ లేనట్లు మళ్లీ మళ్లీ ఎలా తప్పించుకోగలరో అర్థం చేసుకోడానికి ప్రత్యక్ష హింసను దాటి చూడాలన్న అవసరాన్ని నేను గ్రహించాను" అంటాడు 'క్యాస్ట్ ప్రైడ్' రచయిత మనోజ్ మిత్తా. కులహత్యలు జరిగినప్పుడు వ్యక్తులుగా, వ్యవస్థలుగా మనం దాదాపు ప్రతిసారీ ఆ హత్యల వెనుక కులపరమైన కారణాలు లేనే లేవని ఖండిస్తాం. మనోజ్ అదే రాస్తూ, "స్పష్టంగా కనిపించే కుల దౌర్జన్యాల వెనుక ఉన్న కులకోణాన్ని సైతం భారతదేశం దశాబ్దాలుగా తిరస్కరిస్తూనే వస్తోంది" అంటాడు.


కులం గురించి, అది మన వ్యవస్థలలోకి చొరబడిన విద్వేష మార్గం గురించి నాకు మరీ అంతగా తెలియదు. అదృష్టవశాత్తూ మనోజ్ మిత్తా రాసిన 'క్యాస్ట్ ప్రైడ్: బ్యాటిల్స్ ఫర్ ఈక్వాలిటీ ఇన్ హిందూ ఇండియా' నా చేతికి అందింది. దట్టమైన పుస్తకం అది. పుస్తకాన్ని చదువుతున్నప్పుడు అడవిని చూడలేనంతగా చెట్ల కింద కూరుకుపోయినట్లుగా ఉంది. అయితే మీరు గొప్ప పట్టుదలను కలిగి ఉంటే కనుక చదవదగిన పుస్తకమే అనిపిస్తుంది.

ఏమైనా, మనోజ్ తనకు తానుగా సత్యాన్ని గుర్తించాడని కనిపెట్టినప్పుడు మొదట నా ముఖంపై చిరునవ్వు వెలసింది. "1984లో సిక్కుల ఊచకోత, 2002లో ముస్లింలపై జరిగిన మారణకాండల మీద పుస్తకాలు రాశాక, మూడో పుస్తకాన్ని భారతదేశంలోని సామూహిక హింసపై రాయాలన్నది నా అసలు ప్రణాళిక. దళితుల హత్యలపై దృష్టి పెట్టాలన్నది నా ఉద్దేశం" అంటాడు మనోజ్. అయితే ఏడేళ్ల పరిశోధన తర్వాత అతడు తెలుసుకున్నది ఏమిటంటే, ఇంకా చాలా కథే ఉందని!


"దేశంలోని వివిధ వ్యవస్థల దర్యాప్తు అధికారులు, ప్రభుత్వం తరపున వాదించే న్యాయవాదులు, కేసు విచారణ న్యాయమూర్తులు, పునర్విచారణ న్యాయ నిర్ణేతలు వీళ్లంతా తమ వాదనలలో, తీర్పులలో పదే పదే స్పష్టమైన కుల దురభిమానాన్ని ప్రదర్శించి కూడా అలాంటిదేమీ లేనట్లు మళ్లీ మళ్లీ ఎలా తప్పించుకోగలరో అర్థం చేసుకోడానికి ప్రత్యక్ష హింసను దాటి చూడాలన్న అవసరాన్ని నేను గ్రహించాను" అంటాడు మనోజ్. అతడి ఈ గ్రహింపు సూటిగా ఉన్నది, సరళమైనది, బాధతో కూడినది. కులహత్యలు జరిగినప్పుడు, కుల మారణకాండలు సంభవించినప్పుడు వ్యక్తులుగా, వ్యవస్థలుగా కూడా మనం దాదాపు ప్రతిసారీ ఆ హత్యల వెనుక కులపరమైన కారణాలు లేనే లేవని ఖండిస్తాం. మనోజ్ అదే రాస్తూ, "అత్యంత స్పష్టంగా కనిపించే కుల దౌర్జన్యాల వెనుక ఉన్న కులకోణాన్ని సైతం భారతదేశం దశాబ్దాలుగా తిరస్కరిస్తూనే వస్తోంది" అంటాడు.

కుల వివాదాలను, కుల దౌర్జన్యాలను అదుపులోకి తెచ్చేందుకు 1816–2019 మధ్య ఏ విధమైన ప్రయత్నాలు జరిగాయో తెలిపే వివరాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. "అంటరానితనం నిర్మూలనకు అంటూ 1950లో ఏదైతే ప్రయత్నం జరిగిందో అది... అప్పటికే అంటరానితనం నుంచి విముక్తి పొంది ఉన్నవాళ్లపై మరింతగా దిగ్భ్రాంతికరమైన హింసాత్మక చర్యలకు ఆధిపత్య కులాలవారిని ప్రేరేపించి, సామూహిక హత్యలు అనే ఒక కొత్త దురాగతాన్ని కనిపెట్టేందుకు వారు పాల్పడేంతగా వ్యతిరేకతకు కారణమైంది" అని మనోజ్ రాశారు. 1968లో తమిళనాడులోని కీలవేణ్మణిలో తొలిసారి అటువంటి సామూహిక హత్యలు జరిగాయి.

మనోజ్ పేర్కొన్న దారుణాలలో నేను బాగా గుర్తెరిగినది బెల్చి హత్యాకాండ. అది జరిగినప్పుడు నా వయసు 22. ఆ భయానక ఊచకోతకు లండన్ నుంచి వెలువడే 'ది స్పెక్టేటర్' పత్రిక 'ది హంటింగ్ ఆఫ్ హరిజన్' అనే శీర్షికను పెట్టడం కన్నా కూడా నాకు ఇప్పటికీ బాగా జ్ఞాపకం ఉన్నది... ఇందిరా గాంధీ చూపిన చొరవ. అర్ధరాత్రి సమయంలో రుతుపవనాలు కుండపోతగా కురుస్తున్నప్పుడు మావటి వెనుక ఏనుగుపై కూర్చొని, ఆ చీకట్లో తనను అంతా గుర్తించగలిగేలా టార్చిలైట్ల వెలుగులో బెల్చి చేరుకోవడం. "ఆ విధంగా చేయడం ద్వారా ఆమె జనాదరణను ఒడిసి పట్టుకున్నట్లయింది" అంటాడు మనోజ్.



బెల్చి హత్యాకాండ బాధితుల పరామర్శకు వెళుతున్న ఇందిరాగాంధీ



మనోజ్ మిత్తా

ఈ పుస్తకం ద్వారా తప్ప... ఇంతవరకు నాకు తెలియందీ, నన్ను ఆశ్చర్యానికి గురి చేసిందీ, "కులపరమైన హత్యలు జరిగిన ఘటనా స్థలాన్ని సందర్శించిన మొట్టమొదటి, బహుశా ఏకైక జాతీయ నాయకురాలు ఇందిరాగాంధీ" కావడం. మన తాజా రాజకీయాలపై, నిజానికి ఇప్పటి మన ప్రజాస్వామ్యంపై ఎంత కఠోర వ్యాఖ్య! మనల్ని బాధించే విషాదాలపై మన పాలకులు ఎలా స్పందిస్తున్నారనే దానిపైన కూడా ఇది కచ్చితమైన వ్యాఖ్య.

అయితే మనోజ్ ఉద్దేశం ఇందిరాగాంధీ చొరవ గురించి చెప్పడం కాదు. బెల్చి ఘటనను మన వ్యవస్థ ఒక కుల ద్వేష దురాగతంగా అంగీకరించడానికి ఎందుకు ఇష్టపడలేదన్న ప్రశ్నను లేవనెత్తడం. నాడు హోమ్ మంత్రిగా ఉన్న చరణ్‌సింగ్ పార్లమెంటులో మాట్లాడుతూ... "ఈ ఘటనకు కుల, మత, భూ తగాదాలు గానీ, రాజకీయాలు గానీ కారణం కాదు. కొన్ని పత్రికల్లో వచ్చిన విధంగా సమాజంలోని బలహీన వర్గాలపై జరిగిన దౌర్జన్యం కూడా కాదు" అని ప్రకటించారు. జనతాపార్టీ ప్రధాన కార్యదర్శి రామ్‌ధన్ చైర్మన్‌గా ఉన్న పార్లమెంటరీ కమిటీ చరణ్ సింగ్‌తో తీవ్రంగా విభేదించింది కానీ, అది కుల దురాగతమేనని ఆయన్ని ఒప్పించలేకపోయింది.

చరణ్ సింగ్ చేసినటువంటి ఖండన ప్రకటనలు దాదాపు ప్రతిసారి కూడా మన ప్రతిస్పందనల్ని వికలపరుస్తాయని మనోజ్ వాదిస్తాడు. అగ్రవర్ణాలవారు ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తిరస్కరిస్తారు. అది ప్రతి దశలోనూ జరుగుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులు సహకరించుకోవడం, బలహీనమైన న్యాయ విచారణ, వాదనలు, తీర్పులు, సుప్రీంకోర్టుకు చేరిన పునర్విచారణల నిర్వహణలో సైతం ఈ అగ్రవర్ణ భావన పని చేస్తుందని మనోజ్ అంటాడు.

ఆఖరికి మనమెంతో గొప్పగా భావించే నాయకుల గురించి కూడా మనోజ్ చేసిన వ్యాఖ్యలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. "ఈ నిర్దిష్ట సందర్భంలో ఎల్లవేళలా మహాత్ముడిలా కనిపించరు" అని గాంధీ గురించి, "కుల సంస్కరణలను ఆయన ప్రతిఘటించలేదు, లేదా పెద్దగా వాటి కోసం ప్రయత్నించనూ లేదు. ఆయనది అతిథి పాత్ర మాత్రమే" అని నెహ్రూ గురించి, చివరికి అంబేడ్కర్ గురించి కూడా – నేను ఎక్కువ వివరాలు ఇవ్వను గానీ– "ఆయన కథేమీ ఆశ్చర్యాలు లేనిదైతే కాదు" అని అంటూ... "స్వాతంత్ర్య సమరయోధులు తప్పనిసరిగా సమానత్వ ఉద్యమశీలురు కావాలనేముంది?" అని ముగిస్తాడు మనోజ్. పుస్తకం గురించి నా ఏకైక విమర్శ ఏమిటంటే... చదివేందుకు ఇది కొంచెం తేలికగా ఉండవలసిందనీ, పేజీలు పొంగిపొర్లేలా వివరాలు ఇవ్వడం వల్ల పుస్తకంలో ప్రధాన సందేశాన్ని తరచు అవి మరుగున పడేస్తున్నాయనీ. అయినప్పటికీ అది మనం వినవలసిన, మనం గుర్తుంచుకోవలసిన సందేశమే.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దీర్ఘదర్శి



ఒక భారత రాజకీయ నాయకుడి అత్యంత గొప్ప సేవ మధ్యాహ్న భోజన పథకం. దాన్ని కె. కామరాజ్ ప్రారంభించారు. ఆయన ఎప్పుడూ బడి ముఖం చూడలేదు. ప్రతిరోజూ 11.7 కోట్ల భారత చిన్నారులు మధ్యాహ్న భోజన పథకం వల్ల తినగలుగుతున్నారు. (జూలై 15న కామరాజ్ జయంతి.)

– ఆనంద్ రంగనాథన్, రచయిత

ఆలోచించాల్సిన విషయం



ఇతర అమెరికా సమాజం మీద ప్రభావం చూపుతున్న ఏ ఆరోగ్య సమస్యలూ 'అమిష్' సమాజపు పిల్లల్లో లేవని 'టీఆర్ఎస్ఎఫ్' అధ్యయనం తేల్చింది. వారిలో క్యాన్సర్, ఆటిజం, గుండె వ్యాధులు లేవు. దీనికి విరుద్ధంగా ఇవన్నీ ఇతర అమెరికా పిల్లల్లో పెరుగుతున్నాయి. (ఆధునిక సాంకేతిక సౌకర్యాలకు దూరంగా, పరిమిత అవసరాలతో బతికే సమాజం ఇది. అమెరికా వ్యాప్తంగా వీరి జనాభా సుమారు 4 లక్షలు.)

– టోంజీ ఇండ్‌సేత్, వ్యాఖ్యాత

ఇక్కడే మెరుగా?



యూఎస్ నుంచి ఇండియాకు తిరిగొచ్చిన తల్లితండ్రులు చాలా సంతోషంగా ఉన్నారు. కారణాలు? సామాజిక జీవితం మెరుగ్గా ఉంటుంది. చాలామంది చేరువగా ఉంటారు. నాణ్యమైన విద్య చవక. డాలర్లలో సంపాదించింది రూపాయల్లో ఖర్చు పెట్టొచ్చు. మెట్రోల్లో చవగ్గా ఇళ్లు దొరుకుతాయి. పనివాళ్లు సులభంగా లభ్యమవుతారు.

– దేబర్ష్య దాస్, ఆంట్రప్రెన్యూర్

ఏ ప్రపంచమిది?



ప్రపంచ సత్యాలను మార్చడానికి చేస్తున్న ప్రయత్నం గమనిస్తున్నారా? వికారమైన వాటిని అందమైనవిగా, అందమైన వాటిని దుష్టమైనవిగా చూపుతున్నారు. ఇప్పుడు లావుగా ఉండటం ఆరోగ్యం, ఫిట్‌గా ఉండటం అతివాదానికి మరో రూపం! తలకిందుల వాస్తవంలో బతుకుతున్నాం.

– నిక్కి, కాలమిస్ట్

ఉంటారంతే!



నిజ జీవితంలో స్నేహితులు కాలేనివాళ్లు, సోషల్ మీడియాలో స్నేహితులుగా ఉండటంలో అర్థమేమిటి?

– జోయీతా, ఫిజిషియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆనాటి ఐక్యత ఏదీ?

తెలుగు నేల మీద మరిచిపోలేని నరమేధం 'కారంచేడు' ఘటన. 1985 జూలై 17న కుల దురహంకారులు దళితులపై జరిపిన మారణకాండ దళితుల స్మృతి పథం నుండి ఇంకా చెరిగిపోలేదు. ఈ దాడికి వ్యతిరేకంగా ఆనాడు జరిగిన దళిత ఉద్యమం నుండి స్ఫూర్తిని పొందడం ఒక చారిత్రక అవసరం. ఒకవైపు 'దళిత మహాసభ', మరోవైపు విప్లవ శిబిరం నుండి వచ్చిన మేధావులు; మరోవైపు బీసీ నాయకులు ఆనాడు బాధితులకు అండగా నిలిచారు. సిద్ధాంతాలు పక్కన పెట్టి, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడడం చరిత్రాత్మకం. కానీ, ఇవాళ వెనక్కి తిరిగి చూసుకుంటే ఎందుకు ఆనాటి ఐక్యత కనిపించడం లేదు?

దళితుల మీద దాడులు జరిగినప్పుడు ముందుకొచ్చే నాయకులు, ఆ తరువాత కాలంలో ఏం చేస్తున్నట్టు? ఆ పరిమిత కాలం వరకే దళిత, బహుజన కార్యచరణ పరిమితమైతే అది అంబేడ్కరిజానికి న్యాయం చేయదు. కారంచేడు తరువాత 'చుండూరు', 'పదిరికుప్పం', 'లక్ష్మీపేట', 'ప్యాపిలి' నుండి 'రోహిత్ వేముల' పోరాటం దాకా... దళిత, బీసీ నాయకుల మధ్య సయోధ్య సన్నగిల్లింది. ఇది కూడా ఒక రకంగా మనువాదమే! మనువాదం మనుషులను కులాలుగా విడదీస్తే, బహుజనవాదం అందరినీ ఒక్కచోటుకు చేరుస్తుంది. ఈ నేపథ్యం నుండి చూస్తే కారంచేడు మృతవీరుల నుండి మనం పొందవలసిన స్ఫూర్తి ఏమిటి? ఆనాడు బాధితులకు కొండంత ధైర్యాన్ని అందించిన నాయకత్వ ఐక్యత ఎందుకు నేడు లోపిస్తున్నది అనే దిశలో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

1990ల తరువాత తెలుగు సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక మార్పులు వేగవంతమయ్యాయి. అలాగే కారంచేడు, చుండూరు స్ఫూర్తితో దళిత ఉద్యమాన్ని సాంస్కృతిక రంగం కూడా ప్రభావితం చేసింది. అనేకమంది ఉద్యమకారులు, నాయకులు అందివచ్చారు. మరీ ముఖ్యంగా దళితోద్యమ పరిణామాల మీద అనేక విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ చైతన్యమే ఆ తరువాత విప్లవ, వామపక్ష పార్టీల్లో సైతం కులం ప్రశ్నను లేవనెత్తింది. ఈ పరిణామం తెలుగు సమాజంలోనే కాదు యావత్ దేశంలోనే దళిత చైతన్యానికి దారులు వేసిందంటే అతిశయోక్తి కాదు. ఒక రకంగా దళిత మేధావులు, కవులు, రచయితలు సంధించిన ప్రశ్నలు కమ్యూనిస్టు పార్టీలను ఒక కుదుపునకు గురిచేశాయి. ఇవాళ బహుజన ఐక్యతను భుజాన వేసుకోవాల్సిన బాధ్యత ఈ దళిత, బీసీ మేధావుల మీదే ఉంది. బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడు మాత్రమే దళితుల మీద దాడులు ఆగుతాయన్న మాన్యవర్ కాన్షీరామ్ మాటల్ని గుర్తు పెట్టుకుందాం. కారంచేడు రుధిర క్షేత్రం నుండి అలాంటి స్ఫూర్తిని పొంది, రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుజనులు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి.

– డా॥ పసునూరి రవీందర్, సీనియర్ జర్నలిస్ట్ । 77026 48825

(నేడు కారంచేడు మృతవీరుల దినం)

సమస్యలు వదిలేసి... ఈ రాజకీయాలేంటి?

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

'విభజించు పాలించు' అనే కిటుకును బ్రిటిష్ వారు భారతీయులకు నేర్పి వెళ్లిపోయారు. సున్నితమైన అంశాలలో ఏకాభిప్రాయం సాధించలేమని గ్రహించినపుడు పాలకులు ప్రయోగించే పాత అస్త్రమే 'డివైడ్ అండ్ రూల్' పాలసీ. ఈ అస్త్రాన్ని ప్రయోగించడంలో గత కాంగ్రెస్ పాలకుల కంటే ప్రధాని నరేంద్రమోదీ ఒక ఆకు ఎక్కువే చదివారు. ఈ 9 ఏళ్ల పాలనలో ఒక్క వ్యవసాయ బిల్లుల విషయంలోనే బొక్కబోర్లా పడ్డారు గానీ 'ట్రిపుల్ తలాక్' రద్దు, కేంద్రపాలిత ప్రాంతాలుగా జమ్మూ–కశ్మీర్‌ను విభజించడం మొదలుకొని పలు కీలక అంశాలలో ఏకాభిప్రాయం లేకున్నా ప్రధాని నరేంద్రమోదీ విజయవంతంగా ఒడ్డునపడ్డారు. ఆ కోవలోనే ఇపుడు 'ఉమ్మడి పౌరస్మృతి' బిల్లును పార్లమెంట్ ముందుకు తెస్తున్నారు.

చర్చించి, అందరి అభిప్రాయాలను స్వీకరించి పరిష్కరించాల్సిన 'బర్నింగ్ ఇష్యూస్' కేంద్ర ప్రభుత్వం ముందు ప్రాధాన్యతాంశాలుగా చాలానే ఉన్నాయి. అదుపు తప్పిన ద్రవ్యోల్బణం, మణిపూర్ అల్లర్లు, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి రాజ్యాంగ విరుద్ధ వ్యవహార శైలి, బ్యూరోక్రసీపై పెత్తనం చేసేందుకు వీలుగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు అప్పజెపుతూ కేంద్ర ప్రభుత్వం మే 19న జారీ చేసిన వివాదాస్పద ఆర్డినెన్స్, వ్యవసాయ ఉత్పత్తులకు అరకొరగా పెంచిన మద్దతు ధరలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని కేంద్రం దుర్వినియోగం చేస్తున్న తీరు, రైల్వేల భద్రత, గ్లోబల్ వార్మింగ్ కారణంగా దేశంలో ఏర్పడిన అసాధారణ వాతావరణ పరిస్థితులు వంటి అంశాలెన్నో ఉన్నాయి.

సమస్యల్లా అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగుతాయా అన్నదే! వివాదాస్పద 'పౌరస్మృతి బిల్లు'ను ప్రవేశపెడితే ఎటూ ప్రతిపక్షాలు సభను అడ్డుకొంటూ రచ్చ చేస్తాయి. దీన్ని సాకుగా చూపి ప్రతిపక్షాన్ని గంపగుత్తగా సస్పెండ్ చేయిస్తుంది ప్రభుత్వం. ప్రజలకు సంబంధించిన అంశాలేవీ చర్చకు వచ్చే ఆస్కారం ఉండదు. మరో 10 నెలల వ్యవధిలో జరిగే లోక్‌సభ ఎన్నికలలో గెలవడమే లక్ష్యంగా 'బీజేపీ' అన్ని రకాల అస్త్రాలూ సిద్ధం చేసుకొంది. అందులో 'ఉమ్మడి పౌరస్మృతి' ఒకటి మాత్రమే!

ఈ 9 సంవత్సరాలలో తాను సాధించిన విజయాలుగా... మూడున్నర కోట్ల గృహాలు కట్టామనీ, 12 కోట్ల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామనీ, 9.60 కోట్ల మందికి కొత్తగా గ్యాస్ కనెక్షన్లు అందించామనీ, 11.72 కోట్ల మరుగుదొడ్లు నిర్మించినట్లూ, కోవిడ్ తర్వాత 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందించినట్లూ ఎన్డీఏ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకొంటున్నది. నిజం చెప్పాలంటే ఈ విజయాలు తక్కువేమీ కాదు.



కాకపోతే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. రెండోవైపు చూస్తే... దేశంలో కీలక రాజ్యాంగ వ్యవస్థల ప్రమాణాలు దిగజారడం, ప్రజల మధ్య కుల, మత వైషమ్యాలు పెరగడం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, భారత్ భూభాగంలో చైనా దురాక్రమణ, పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణ తదితర అంశాలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. కానీ, వీటిని చర్చించడానికి కేంద్రం సిద్ధంగా లేదు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కుగాను కేంద్రం 14 ప్రధాన పంటలకు 5 శాతం నుంచి 11 శాతం మేర కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంచింది. ప్రతి ఏటా వ్యవసాయ ఇన్‌పుట్స్ వ్యయం 10 నుంచి 20 శాతంకు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రకటిస్తున్న అరకొర ఎంఎస్‌పీ దేశ రైతాంగాన్ని సంతృప్తి పర్చడం లేదు. తగిన ప్రోత్సాహం కేంద్రం నుంచి లేనప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌తో సహా కొన్ని రాష్ట్రాలు వ్యవసాయానికి అందిస్తున్న పలు రకాల రాయితీల వల్లనే దేశంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా పండుతున్నాయి. 'రైతు భరోసా', 'రైతు బంధు' వంటి పథకాల కారణంగానే. ఆయా రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాలు పండుతున్నాయన్నది సత్యం. కానీ, వ్యవసాయరంగ ప్రగతిని కేంద్రం తన ఖాతాలో వేసుకొంటోంది.

సంక్షేమ రంగ నిధులకు కేంద్రం భారీ ఎత్తున కోత పెడుతోంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ప్రోత్సాహకాలను ఎత్తివేసింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన ఎస్సీ, ఎస్టీల 'పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్' పథకాన్ని అరకొరగా కొనసాగిస్తోంది. ఈ పథకానికి కేంద్ర వార్షిక బడ్జెట్‌లో దాదాపు రూ. 7,000 కోట్లు కేటాయించినప్పటికీ కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ నిధులు సక్రమంగా అందడం లేదు. ఈ వాస్తవం తెలియనివారు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే అమలు చేయడం లేదని వాటిపై నిందలు వేస్తున్నారు. దళిత విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వడానికి ఎంట్రెన్స్ టెస్ట్‌లను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. వడపోత ద్వారా ఎక్కువ శాతం మందికి మొండి చేయి చూపడమే ఇందులోని ఆంతర్యం.

కొన్ని సమస్యలకు కేంద్రం మాత్రమే జవాబు చెప్పాల్సి ఉంటుంది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి తన పరిధిలో లేని అధికారాలను ఆపాదించుకొని, ఈడీ కేసులో అరెస్ట్ అయిన మంత్రి సెంథిల్ బాలాజీని రాష్ట్ర క్యాబినెట్ సిఫార్సు లేకుండానే తొలగిస్తూ ఆర్డర్ జారీ చేయడం అందర్నీ విస్మయపర్చింది. కేంద్ర హోమ్‌శాఖ సకాలంలో స్పందించి ఆ ఆర్డర్‌ను ఉపసంహరింపచేయడం వల్ల పరువు దక్కింది. ఇప్పటికే అనేక వివాదాల్లో చిక్కుకొన్న తమిళనాడు గవర్నర్‌ను కేంద్రం ఎందుకు తప్పించడం లేదు?! అలాగే మణిపూర్‌లో పరిస్థితుల్ని చక్కదిద్దలేకపోయిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు ఉద్వాసన పలకడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారు? 2019 ఆగస్ట్ 5న జమ్మూ–కశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసినపుడు అతి త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని కలుగజేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌కు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా ఎటువంటి అడుగులూ పడలేదు.

నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయడానికి ముడిచమురు దిగుమతుల భారాన్ని తగ్గించుకోవాలని 'నీతి ఆయోగ్' తన 'బయోఫ్యూయెల్ పాలసీ' పత్రంలో పేర్కొంది. ముడి చమురులో మిక్స్ చేసిన ఇథనాల్‌ను ప్రస్తుతం ఉన్న 10.5 శాతం నుంచి 20 శాతానికి పెంచాలనీ, తద్వారా ఏటా కేంద్రానికి రూ. 30,000 కోట్లు ఆదా అవుతాయనీ నీతి ఆయోగ్ తెలిపింది. 2023 ఏప్రిల్ నుంచి ముడిచమురులో 20 శాతం ఇథనాల్‌ను ఉపయోగించనున్నట్లు కేంద్రం ఘనంగా ప్రకటించి, ఆ మేరకు 'బయోఫ్యూయెల్ పాలసీ'లో మార్పులు కూడా చేసింది. కానీ, ఏప్రిల్ దాటిపోయినా ఇంకా ఆ ప్రాజెక్టు అమలు కావడం లేదెందుకు? ఇటువంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం మాని ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధిపొందడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరించడం శోచనీయం.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం **తిథి:** అమావాస్య రా.10.38 వరకు, తదుపరి అధిక శ్రావణ శు.పాడ్యమి, **నక్షత్రం:** పునర్వసు తె.4.44 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.3.43 నుండి 5.26 వరకు, **దుర్ముహూర్తం:** ప. 12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.58 వరకు, **అమృతఘడియలు:** రా.2.06 నుండి 3.50 వరకు, **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.34, కర్కాటక సంక్రమణం, దక్షిణాయనం ప్రారంభం.

యాదాద్రిలో భారత కాన్సుల్ జనరల్ పూజలు

యాదగిరిగుట్ట: అమెరికాలో భారత కాన్సుల్ జనరల్(శాన్‌ఫ్రాన్సిస్కో) శ్రీకర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రానికి చెందిన ఈ ఐఎఫ్‌ఎస్ అధికారికి ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టాలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


శ్రీస్వామిని దర్శించుకున్న శ్రీకర్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రాజన్‌బాబు

బురద రోడ్లు.. ఎడ్లబండే అంబులెన్స్

దహెగాం(సిర్పూర్): కనీసం వాహనాలు కూడా నడవలేని బురద రోడ్లతో గర్భిణులకు ఎడ్లబండ్లే అంబులెన్సులు అవుతున్నాయి. కుమురంభీం జిల్లా దహెగాం మండలం లోహ గ్రామానికి చెందిన మడే ప్రమీల ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భిణి. ఆమెకు ఆదివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అయితే లోహకు వెళ్లే రోడ్డంతా వర్షానికి బురదమయం కావడంతో అంబులెన్స్ వెళ్లలేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు గర్భిణిని ఎడ్లబండిలో లోహ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని కర్జి వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



కార్టూన్ల ద్వారా రాజకీయచైతన్యం పొందాను

- శేఖర్ మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ గోరటి
- కార్టూనిస్టు శంకర్‌కు అవార్డు అందజేసిన అల్లం నారాయణ


శేఖర్ మెమోరియల్ అవార్డును కార్టూనిస్టు శంకర్‌కు ప్రదానం చేస్తున్న అల్లం నారాయణ. చిత్రంలో ఎమ్మెల్సీలు దేశపతి, గోరటి తదితరులు

లక్డీకాపూల్: కార్టూనిస్టుల బొమ్మల ద్వారా తానెంతో రాజకీయ చైతన్యం పొందానని శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న అన్నారు. శేఖర్, శంకర్‌లు తనకిష్టమైన కార్టూనిస్టులని చెప్పారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్టు శేఖర్ మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామిక కోణంలో శేఖర్ కార్టూన్లు ఇప్పటికీ చైతన్యం కలిగిస్తున్నాయని కొనియాడారు. ప్రముఖ కార్టూనిస్టు పామర్తి శంకర్‌కు శేఖర్ మెమోరియల్ అవార్డును తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ప్రదానం చేశారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ శేఖర్ ఉద్యోగంతోపాటు ఉద్యమాన్ని ఏకకాలంలో నడిపించారని గుర్తుచేశారు. క్యాస్ట్ క్యాన్సర్ పేరుతో శేఖర్ చివరిరోజుల్లో తీసుకువచ్చిన పుస్తకం ఎప్పటికీ సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ శేఖర్‌ను తలచుకోవడమంటే తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేసుకోవడమేనని అన్నారు. అవార్డు గ్రహీత కార్టూనిస్టు శంకర్ మాట్లాడుతూ తనకు బొమ్మలు ఎలా వేయాలి, ఏ పెన్ను వాడాలి, ఏ ఇంకు వాడాలి... ఇలాంటి విషయాలన్నీ శేఖరే నేర్పించారని, ఆయన పేరిట ఉన్న అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు అధ్యక్షత వహించగా చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, బంగారు బ్రహ్మం, శేఖర్ కుటుంబసభ్యులు చంద్రకళ, నందు, చేతన, కంభాలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్వత్‌సభ ఫలవంతం

వర్గల్ (గజ్వేల్): తర్కవితర్కాలు, వాదోపవాదాలు, శాస్త్రీయ ప్రామాణికత జోడిస్తూ సిద్ధాంతులు, పండితుల చర్చోపచర్చల మధ్య కొనసాగిన తెలంగాణ విద్వత్ సభ సప్తమ వార్షిక విద్వత్ సమ్మేళనం ఫలవంతమైంది. సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలోని కంచి శంకరమఠంలో శని, ఆదివారాలలో రెండు రోజులు కొనసాగిన సభలో తెలంగాణ సిద్ధాంతులు, పంచాంగకర్తలు రాబోయే శ్రీ క్రోధి నామ సంవత్సర పండుగలను ఏకాభిప్రాయంతో నిర్ణయించారు. ఆదివారం సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం పీఆర్వో జ్వాలా నరసింహారావుకు పండుగ తేదీల జాబితాను విద్వత్‌సభ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, దివ్యజ్ఞాన సిద్ధాంతి అందజేశారు.

శ్రీక్రోధి నామసంవత్సరంలో ముఖ్య పండుగలు..

2024 ఏప్రిల్ 9 మంగళవారం ఉగాది, సెప్టెంబర్ 7 శనివారం వినాయక చవితి, అక్టోబర్ 10 గురువారం బతుకమ్మ, అక్టోబర్ 12 శనివారం దసరా, అక్టోబర్ 31 గురువారం దీపావళి, 2025 జనవరి13 సోమవారం భోగి, జనవరి 14 మంగళవారం సంక్రాంతి, ఫిబ్రవరి 26 మహా శివరాత్రి.

క్లుప్తంగా...

'57 ఎస్సీ ఉపకులాలకు ప్రాధాన్యమివ్వాలి'

లక్డీకాపూల్(హైదరాబాద్): ఎస్సీ ఉపకులాలను అత్యంత వెనుకబడిన షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించాలని ఎస్సీల్లోని 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దళిత ఉపకులాల సామాజిక, రాజకీయ చైతన్యంపై ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీలంటే మాల, మాదిగ కులాలే కాదని, తమ కులవృత్తులతో జీవనం సాగిస్తున్న ఉపకులాలకు ఇప్పటికీ గుర్తింపులేకపోవడం శోచనీయమన్నారు. జీవో నంబర్ 11/2014 ప్రకారం మోచి, ఏలియా, దాసరి, మాస్టిన్, సమగర, మితల్ అయ్యవార్లు, బ్యాగరి మొదలైన ఉపకులాలకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణపత్రాలు జారీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మాదిగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఎస్సీ ఉప కులాల విద్యార్థులకు అర్హతపరీక్షలు లేకుండా ప్రవేశం కల్పించాలని, దళితబంధు పథకంలో ఉపకులాలకు నియోజకవర్గానికి 40 శాతం యూనిట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో ప్రాతినిధ్యంలేని ఎస్సీ ఉపకులాలకు రాజ్యాంగబద్ధ, నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేకవాటా ఇవ్వాలని వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సెమినార్‌లో ఉప కులాల హక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ రెసిస్టెన్సీ మలేరియాతో బాలుడి మృతి

ఎంజీఎం: కుక్క కాటుతో ఆస్పత్రిలో చేరిన బాలుడు డ్రగ్ రెసిస్టెన్సీ మలేరియాతో మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు అనుమానిస్తున్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ రాజీవ్‌గృహ కాలనీకి చెందిన 15 నెలల బాలుడు డేవిడ్ రాజు జూన్ 17న ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందిన బాలుడు ఈనెల 12న మృతి చెందాడు. ఎంజీఎంలో యాంటీ బయాటిక్స్ ఇచ్చిన పది రోజుల తరువాత కోలుకున్నట్లు కనిపించినా.. జ్వరంతో మరోసారి అస్వస్థతకు గురయ్యాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మలేరియా ఉందని నిర్ధారించారు. అన్ని రకాలు మందులు అందించినా బాలుడు మృతి చెందడంపై విశ్లేషించిన వైద్యులు.. డ్రగ్ రెసిస్టెన్స్ మలేరియా దోమలే కారణమని భావిస్తున్నామని, ఈ మలేరియాతో కొన్ని సందర్భాల్లో రోగులు చనిపోతుంటారని తెలిపారు.

గురుకుల విద్యార్థికి పాముకాటు


చికిత్స పొందుతున్న మహేందర్

కొత్తకోట రూరల్: మూత్రవిసర్జన కోసం ఆరుబయటకు వెళ్లిన ఓ విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల శివారు ఎస్సీ బాలుర గురుకుల (వీపనగండ్ల) పాఠశాలలో చోటుచేసుకుంది. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మహేందర్ శనివారం రాత్రి 10 గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం ఆరుబయటకు వెళ్లాడు. అక్కడ పొదల్లో ఉన్న పాము కాటు వేయడంతో విద్యార్థి హాస్టల్ సిబ్బందికి చెప్పాడు. వెంటనే ప్రిన్సిపాల్ దయాకర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా.. ఆయన స్పందించకపోవడంతో విద్యార్థిని రాత్రికి హాస్టల్‌లోనే పడుకోబెట్టారు. ఉదయం మహేందర్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో వెంటనే వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడు రాత్రి పాముకాటుకు గురైతే ఉదయం 10 గంటలకు సమాచారం ఇచ్చారని, వెంటనే సమాచారం ఇచ్చి ఉంటే తామే రాత్రి వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లే వాళ్లమని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆదివారం ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వైద్య కళాశాలలో ఆదివారం బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రెండో సంవత్సరం విద్యార్థిని మనస్తాపం చెంది పారాసిట్మాల్ మాత్రలను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత ఆమె స్నేహితురాలు.. ఆ విద్యార్థిని గదికి వెళ్లి మాత్రలు మింగినట్లు గమనించింది. వెంటనే విషయాన్ని తోటి విద్యార్థులకు తెలిపి ఆమెను హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

నయా సైబర్ క్రైం.. డీప్ ఫేక్!

డార్క్ వెబ్‌తో పాటు సోషల్ మీడియా ఖాతాల్లో నుంచే ఫొటోలు, ఆడియో, వీడియోల చౌర్యం

- వాటితో సింథసిస్ సాఫ్ట్‌వేర్స్‌తో నకిలీ వీడియోలు రూపొందిస్తున్న ఈ–నేరగాళ్లు
- టార్గెట్ చేసిన వారికి బెదిరింపులు
- ఆత్మహత్య చేసుకునే వరకు వెళ్తున్న సందర్భాలు ఎన్నో..



సోషల్ మీడియాలో ఫొటోలు, ఆడియో, వీడియోలు విరివిగా పోస్ట్ చేస్తుంటారా.. అయితే జరభద్రం.. సైబర్ నేరాల్లో కొత్తగా పుట్టుకొచ్చిన డీప్ ఫేక్ గురించి మీరు కచ్చితంగా తెలుసుకోవాల్సిందే..

వీడియోలో మీ ముఖమే కనిపిస్తూ ఉంటుంది... కానీ అది మీరు కాదు. ఆడియోలో మీ మాటలే వినిపిస్తూ ఉంటాయి... కానీ మాట్లాడేదీ మీరు కాదు. మీరు చేయని అభ్యంతరకరమైన పనులు కూడా మీరే చేసినట్లు మారుస్తారు.. ఎలాగంటే.. మీ వాయిస్, వీడియో, ఫొటోలను వినియోగించి అశ్లీల వీడియోలతో సింథసిస్ చేసి మీరే వీడియో కాల్ చేసినట్లు సృష్టిస్తారు. లేదంటే కిడ్నాప్ అయ్యాననో, అత్యవసరమనో మీ ఫేక్ వీడియోలు సృష్టించి వాటిలో చెప్పిస్తారు. ఆ వీడియోలను కుటుంబీకులకు చూపించి అందినకాడికి దండుకుంటారు. ఈ నేరాలు ఘోరాలు చేసేందుకు అవసరమైన ఫోన్ నంబర్లు, వివరాలన్నీ తెలుసుకునేందుకు నేరగాళ్లు పెద్దగా కష్టపడక్కర లేదు.. కేవలం మన సోషల్ మీడియా ఖాతాల నుంచే సంగ్రహిస్తున్నారు..

సాక్షి, హైదరాబాద్: ఆడియో–వీడియో సింథసిస్ ప్రక్రియ ద్వారా జరుగుతున్న సరికొత్త సైబర్ నేరమే డీప్ ఫేక్. ఈ నయా తరహా సైబర్ నేరాలకు పాల్పడేందుకు నేరగాళ్లకు అవసరమైన డేటా డార్క్ వెబ్‌తో పాటు సోషల్ మీడియాలో తేలిగ్గా లభిస్తోంది. సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఫొటోలు, ఆడియో, వీడియోలను సంగ్రహిస్తున్న ఈ–కేటుగాళ్లు వాటితో డార్క్ వెబ్ సహా ఇంటర్‌నెట్ నుంచి ఖరీదు చేసిన టూల్స్ వినియోగించి సింథసిస్ ప్రక్రియ చేయడుతున్నారు. ఇది కేవలం నేరగాళ్లు మాత్రమే కాదు... సాంకేతికతపై పట్టున్న వాళ్లు కూడా చేస్తున్న వ్యవహారం కావడం ఆందోళన కలిగించే అంశం. ఈ నయా సైబర్ క్రైం డీప్ ఫేక్‌తో బాధితులు ఆర్థికంగా నష్టపోవడమే కాదు... కొన్ని సందర్భాల్లో పరిస్థితి ఆత్మహత్యలు చేసుకునే వరకు వెళుతోంది. యువతీ యువకులతో పాటు మధ్య వయసు వారిలో జరుగుతున్న 'కారణం తెలియని' సూసైడ్స్‌కి ఈ సింథసిస్ ప్రక్రియ కూడా ఓ కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఆ వీడియోలు చూడగానే తొందరపడొద్దు..



ఈ సింథసిస్ ప్రక్రియను ఫోరెన్సిక్ ల్యాబ్‌ల్లోనూ పూర్తి స్థాయిలో నిర్ధారించడం సాధ్యం కావట్లేదు. కొన్ని అభ్యంతరకర అంశాలకు సంబంధించి తమ వారికి సంబంధించిన వీడియోలు, ఆడియోలను చూసిన కుటుంబీకులు తొందర పడకూడదు. అవి ఆడియో–వీడియో సింథసిస్ ప్రక్రియ ద్వారా తయారయ్యాయేమోనని అనుమానించాలి. బెనిఫిట్ ఆఫ్ డౌట్‌ను వర్తింపజేయాలి. బాధితులుగా మారిన వారికి దన్నుగా ఉంటే ఒంటరితనం, కుంగిపోవడం జరగక ఆత్మహత్యలు వంటి వాటికి ఆస్కారం ఉండదు.

– పెండ్యాల కృష్ణశాస్త్రి, సైబర్ నిపుణుడు

బ్లాంక్ వీడియో కాల్స్‌తో... సెక్స్టార్షన్ నుంచి ఎక్స్టార్షన్ వరకు వినియోగం...

ఇటీవల కాలంలో అనేకమందికి వర్చువల్ నంబర్ల నుంచి బ్లాంక్ వీడియో కాల్స్ వస్తున్నాయి. వీటికి స్పందించి ఫోన్ ఎత్తితే.. అవతలి వారు కనిపించరు, మాట్లాడరు. ఎవరు కాల్ చేశారో తెలుసుకోవడానికి కొద్దిసేపు ఫోన్‌లో ప్రశ్నిస్తుంటాం. ఆ సమయంలో సైబర్ నేరగాళ్లు రిసీవర్ వీడియో రికార్డు చేస్తారు. దీన్ని అశ్లీల వీడియోలతో సింథసిస్ చేసి వాళ్ళే ఆ వీడియోలో ఉన్నట్లు రూపొందిస్తారు. ఈ వీడియోను చూపించి బాధితుడిని భయపెట్టి వీలున్నంత దండుకుంటారు. ప్రధానంగా యువకులు, మధ్య వయస్కులే ఈ నేరంలో టార్గెట్‌గా మారుతున్నారు.

నేరగాళ్లే కాదు అవసరార్థులూ వాడేస్తున్నారు..

ఈ సింథసిస్ ప్రక్రియను సైబర్ నేరగాళ్లతో పాటు మరికొందరూ వాడేస్తున్నారు. ఆన్‌లైన్ ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువత కూడా సింథసిస్ టెక్నిక్ వాడి అడ్డదారిలో గట్టెక్కుతోంది. బ్యాంకులు, ఇతర సంస్థలకు వీడియో అథెంటిఫికేషన్ చేయాల్సిన వచ్చినప్పుడూ ఈ ప్రక్రియ వాడుతున్నారు. ఈ కారణంగానే ఇటీవల కార్పొరేట్ సంస్థలు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలను రికార్డు చేస్తూ, అభ్యర్థిని హెచ్‌ఆర్‌కు పిలిచి పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటున్నాయి. ఇక బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్ని మోసం చేయడానికి వీడియో సింథసిస్ వినియోగిస్తున్నట్లు సైబర్ నిపుణులు చెబుతున్నారు.

భర్త గొంతును రికార్డు చేసి.. వేధిస్తున్నట్టుగా మార్చి...

మనస్పర్థల నేపథ్యంలో తన భర్తపై ఫిర్యాదు చేయాలని భావించిన ఓ భార్య వాయిస్ సింథసిస్ టెక్నిక్ వాడారు. తన భర్త గొంతును రికార్డు చేసి తనను దూషిస్తున్నట్లు, వేధిస్తున్నట్లు మార్చేశారు. ఆ రికార్డునే ఆధారంగా చూపించి భర్తపై ఆరోపణలు చేశారు. అయ్యో తాను అసలు అట్లా మాట్లాడలేదంటూ భర్త గోడువెళ్లబోసుకోవడంతో కౌన్సెలింగ్ చేసిన పెద్దల విచారణలో అసలు విషయం బయట పడింది.

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కస్టోడియల్ డెత్!

- పోలీసుల అదుపులో ఉన్న సెక్యూరిటీ గార్డు మృతి
- తీవ్ర ఛాతీ నొప్పితో మృతి చెందారు: డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి (హైదరాబాద్): ఓ గొడవకు సంబంధించిన వ్యవహారంలో విచారించేందుకు తీసుకొచ్చిన సెక్యూరిటీ గార్డు పోలీస్‌స్టేషన్‌లోనే మృతి చెందాడు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నానక్‌రాంగూడలోని ఓ లేబర్ క్యాంపులో బిహార్‌కు చెందిన నితీశ్ (32), బిట్టు, వికాస్‌లు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. క్యాంపులోని కూలీలు శనివారం రాత్రి 11 గంటలకు బయటికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. వీరు అడ్డుకోవడంతో గొడవ జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. బాధితులు డయల్ 100కు కాల్ చేయడంతో గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలైన కూలీలను ఆస్పత్రికి తరలించి.. ముగ్గురు సెక్యూరిటీ గార్డులను అదుపులోకి తీసుకుని, విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే వీరిలో నితీశ్ ఆదివారం ఉదయం 7.55 గంటల సమయంలో ఒక్కసారిగా అపస్మారక స్థితికి వెళ్లాడు. పోలీసు సిబ్బంది అది గమనించి తొలుత సీపీఆర్ చేశారు. తర్వాత సమీపంలోని హిమగిరి ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపు చికిత్స చేసిన వైద్యులు నితీశ్ మృతి చెందాడని ప్రకటించారు. ఈ ఘటనపై మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి వివరణ ఇస్తూ.. కూలీలు, సెక్యూరిటీ గార్డులకు మధ్య గొడవ జరగడంతో అదుపులోకి తీసుకున్నామని, ఛాతీలో తీవ్రనొప్పితో నితీశ్ మృతి చెందాడని తెలిపారు. ఘటనపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

నీటిపారుదల రంగంలో 19 లక్షల కోట్ల పెట్టుబడి

- కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడి
- దేశంలో తాగునీటి నాణ్యత పరీక్షలకు 2 వేల ఎన్‌ఏబీఎల్ వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌లు
- హ్యాకథాన్‌లో 20 స్టార్టప్‌ల షార్ట్‌లిస్ట్
- టీ హబ్‌లో ఘనంగా జరిగిన జీఐఐఎఫ్ ఇన్వెస్టర్స్ కాన్‌క్లేవ్



రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం నీటిపారుదలరంగంలో రూ. 19 లక్షల కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెడుతోందని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని టీ హబ్‌లో జిటో ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (జీఐఐఎఫ్) రెండు రోజులుగా నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సమ్మేళనం, వ్యవ స్థాపక దినోత్సవాల్లో ఆదివారం ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆనకట్ట పునరుద్ధరణ కార్యక్రమాన్ని, భూగర్భజల స్థాయిని పునరుద్ధరించడానికి కార్యాచ రణ, నదుల అనుసంధానం చేపట్టామని తెలిపారు. పారిశ్రామిక రంగాల కంటే వ్యవసాయం రంగమే ఎక్కువ నీటిని వినియోగిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో తలసరి నీటి వినియోగం ఏడాదికి 4,913 నుంచి 5,800 కిలోలీటర్ల వరకు ఉంటుందని, ఇది ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువన్నారు.

వ్యవసాయరంగంలో నీటిసంరక్షణకు స్టార్టప్‌ల అవసరం

వ్యవసాయరంగంలో నీటి సంరక్షణపై ఎవరూ పెద్దగా శ్రద్ధ చూపడం లేదని, ఇక్కడే ప్రైవేట్ రంగ సహాయం, స్టార్టప్‌ల అవసరం ఏర్పడుతోందని కేంద్రమంత్రి షెకావత్ వ్యాఖ్యానించారు. మురుగునీటిని తిరిగి ఉపయోగించుకునే వ్యాపార నమూనాలను అభివృద్ధి చేసేందుకు స్టార్టప్‌ల కోసం మంత్రిత్వశాఖ కూడా ఎదురుచూస్తోందన్నారు. దేశంలో దాదాపు 2వేల ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన నీటి పరీక్ష ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక పరీక్ష సౌకర్యం ఉండాలనేది తమ లక్ష్యమన్నారు. కాఠిన్యం, పీహెచ్, కాపర్, ఐరన్, ఫాస్ఫేట్, క్లోరిన్, అమ్మోనియా, క్రోమియం వంటి 12 పారామీటర్లపై(ప్రామాణికాలపై) నీటి నాణ్యత పరీక్షలు జరుగుతాయన్నారు.

టెస్టింగ్ కిట్‌ల అభివృద్ధిలోనూ స్టార్టప్‌ల సాయం

టెస్టింగ్ కిట్‌లను అభివృద్ధి చేయడంలో స్టార్టప్‌లు తమకు ఎంతో సహాయ పడ్డాయని కేంద్రమంత్రి తెలిపారు. ఇందులో 19 లక్షల మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, 1.5 కోట్ల నమూనాలను సేకరించి పరీక్షించడం జరిగిందన్నారు. సెన్సార్ ఆధారిత తాగునీటి పరీక్ష కోసం పరిష్కారాలను రూపొందించడానికి స్టార్టప్‌ల కోసం తాము హ్యాకథాన్ కూడా నిర్వహించామన్నారు. ఇందులో 250 స్టార్టప్‌లు దరఖాస్తు చేసుకోగా అందులో 20 స్టార్టప్‌లను షార్ట్ లిస్ట్ చేశామని కేంద్రమంత్రి షెకావత్ వెల్లడించారు. ప్రభుత్వం ఒక్కటే అన్ని పనులూ చేయలేదని, జీఐఐఎఫ్ వంటి సంస్థల నుంచి సహాయం కావాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఐఐఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దంపతులను వెంటాడిన మృత్యువు!

- పురుగుమందు తాగి భార్య మృతి
- రెండు గంటల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం


మల్లికార్జున్


శరణ్య

లక్సెట్టిపేట: మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో కబళిస్తుందో ఎవరికీ తెలియదు. కానీ కొన్ని సంఘటనలు జరిగినప్పుడు పగబట్టినట్లే అనిపిస్తుంది. ఇలాంటి సంఘటనే మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో శనివారం రాత్రి జరిగింది. మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన శరణ్య (28), మల్లికార్జున్ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. మల్లికార్జున్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల శరణ్య, పక్కింటి మహిళ గొడవపడ్డారు. వారిని స్థానికులు సముదాయించారు.

పోలీసులకు ఫిర్యాదుతో..

అయితే మరో మహిళ గొడవను ప్రేరేపించి పక్కింటి మహిళతో శరణ్యపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించింది. దీంతో మనస్తాపం చెందిన శరణ్య ఈనెల 13వ తేదీన ఇంట్లోనే పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శరణ్య శనివారం రాత్రి మృతిచెందింది.

మృతదేహాన్ని తీసుకెళ్తుండగా..

ఆస్పత్రిలో భార్య వెంటే ఉన్న మల్లి కార్జున్ ఆమె మరణంతో కన్నీటిపర్యంతమ య్యాడు. రాత్రే మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి పంపించి, మల్లికార్జున్ తన బంధువుతో కలిసి బైక్‌పై బయల్దేరాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో లక్సెట్టిపేట ఎన్‌టీఆర్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. మూత్రవిసర్జన కోసం ఆగి.. బైక్ పక్కన నిలిపి మల్లికార్జున్ రోడ్డు దాటుతుండగా రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న బంధువు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. భార్య మృతదేహం లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి చేరుకున్న కాసేపటికే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు భర్తను కూడా కబళించింది. తల్లిదండ్రులిద్దరూ రెండు గంటల వ్యవధిలో మరణించడంతో పిల్లలు అనాథలయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

18న ఇందిరాపార్కు వద్ద జేఎన్‌జే సొసైటీ మహాధర్నా

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తుదితీర్పు మేరకు జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ(జేఎన్‌జే మ్యాక్ హెచ్‌ఎస్)కి పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాలను రాష్ట్రప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేయాలని కోరుతూ ఈ నెల 18వ తేదీ(మంగళవారం)న హైదరాబాద్ ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నారు. మహాధర్నాకు మద్దతుగా వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటున్నట్లు జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ఫౌండర్ మెంబర్ పీవీ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మహాధర్నా జరుగుతుందని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు 16 ఏళ్ల క్రితం ప్రభుత్వం నుంచి పేట్ బషీరాబాద్ స్థలాన్ని కొనుగోలు చేశారని, ఈ విషయమై సొసైటీకి అనుకూలంగా సుప్రీంకోర్టు తుదితీర్పు వచ్చి 10 నెలలు గడిచిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిని తమ సొసైటీకి స్వాధీనం చేయకపోవడంతో సొసైటీ సభ్యులు ఈ మహాధర్నా చేపడుతున్నట్లు రమణారావు తెలిపారు. మహాధర్నాలో జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ సభ్యులు తమ కుటుంబాలతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి బాలుడు మృతి

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాలో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. మహారాష్ట్రలోని నర్సీ సమీపంలోని దానురా గ్రామానికి చెందిన సోని, మాధవ్‌లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సవీధాన్, సంఘర్ష్. దంపతుల మధ్య గొడవ జరగడంతో సోని తల్లిగారి ఇల్లయిన గన్యతండాకు శనివారం ఇద్దరు కుమారులతో కలిసి వచ్చింది. కాగా, గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు ఏర్పాటు చేయడానికి జేసీబీతో గుంతలను తవ్వి అలాగే వదిలేశారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు గుంతలో నీళ్లు నిండాయి. కాగా, ఆదివారం బాలుడు సవీధాన్ కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం అటువైపుగా వెళ్లి నీటి గుంతలో పడ్డాడు. ఎంతసేపయినా తిరిగి రాకపోయే సరికి కుటుంబీకులు వెళ్లి చూడగా బాలుడు గుంతలో పడి ఉన్నాడు. వెంటనే నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి సవీధాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. రెండు వారాలుగా గుంతలు తవ్వి అలాగే వదిలేశారని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు.

అతివేగానికి ఇద్దరు యువకుల బలి


ఘటనా స్థలంలో మృతదేహాలు

దుండిగల్: అతి వేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. వాహనం అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్‌కు చెందిన యువరాజ్ ఉప్పల్‌లో ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తుంటాడు. గండిమైసమ్మ చౌరస్తాలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న నాయుడు స్థానికంగా ఉన్న టెక్ మహీంద్రా యూనివర్సిటీలో పని చేస్తున్నాడు. వీరిద్దరు కలిసి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో బైక్‌పై గండిమైసమ్మ నుంచి సూరారం వైపు వస్తున్నారు. ఈ సమయంలో బహదూర్‌పల్లి టెక్ మహీంద్రా వద్ద అతివేగంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువరాజ్, నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ప్రపంచ కుబేరుడి భార్యకు కాఫీ ధర ఎక్కువైందట!



ఇడహో: ప్రపంచ కుబేరుల్లో వారెన్ బఫెట్ ఒకరు. ఆయన ఆస్తి 115 బిలియన్ డాలర్లకు పైమాటే. అటువంటి వ్యక్తి భార్య కాఫీ ధర ఎక్కువగా ఉందంటూ ఫిర్యాదు చేయడం ఆసక్తికర అంశంగా మారింది. సన్ వ్యాలీలో ఇటీవల బిలియనీర్ల సమ్మర్ క్యాంప్ జరిగింది. ఓ రిసార్టులో జరిగిన ఈ కార్యక్రమంలో వారెన్ బఫెట్ భార్య ఆస్ట్రిడ్ బఫెట్ కప్పు కాఫీకి నాలుగు డాలర్లు వసూలు చేయడంపై అక్కడి సిబ్బందికి ఫిర్యాదు చేశారట. ఇతర ప్రాంతాల్లోని కాఫీ ధరతో పోలిస్తే ఇది ఎక్కువేనంటూ అసహనం వ్యక్తం చేశారట. ఈ విషయం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాగా, సంపద ఎంతున్నా వారెన్ బఫెట్ మహా పొదుపరి. 1958లో 31,500 డాలర్లకు కొనుగోలు చేసిన ఇంట్లోనే ఆయన ఇప్పటికీ నివసిస్తున్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రతిష్టాత్మక 'గ్లోబల్ ఇన్‌క్రెడిబుల్ ఐఎన్‌సీ లీడర్‌షిప్ అవార్డు'



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ ఇన్‌క్రెడిబుల్ ఐఎన్‌సీ లీడర్‌షిప్ అవార్డు' వరించింది. భారత్–అమెరికాల మధ్య వాణిజ్యం, వ్యాపారం, పీపుల్–టు–పీపుల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు నిర్వహించే యూఎస్ ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ ఈ అవార్డును కేంద్రమంత్రికి అందించింది. భారతదేశపు సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు పర్యాటకాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన కృషికి గాను అందిస్తున్నట్లు తెలిపింది. అమెరికాలోని మేరీలాండ్ నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు ఈ అవార్డును కేంద్రమంత్రికి అందించారు. కిషన్ రెడ్డి ట్విట్టర్‌లో స్పందిస్తూ.. 'యూఎస్ ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్' సంస్థ నుంచి లీడర్ షిప్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశ ఘనమైన చరిత్రను, సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు పర్యాటక రంగాభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది' అని పేర్కొన్నారు.

టమాటా ధర కిలో రూ.80

రాయితీతో విక్రయిస్తున్న కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా టమాటా ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇటీవలే కిలో రూ.250 దాకా పలికిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం దేశంలో సగటు ధర కిలోకు రూ.117గా ఉంది. వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీపై టమాటాలు విక్రయిస్తోంది. పలు నగరాల్లో కొన్ని రోజులపాటు కిలో రూ.90కి విక్రయించగా, ఆదివారం నుంచి రూ.80కే అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత జాతీయ సహకార వినియోగదారుల సంఘం(ఎన్‌సీసీఎఫ్), భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సంఘం(నాఫెడ్) ద్వారా ప్రభుత్వం టమాటాలను రాయితీపై విక్రయిస్తోంది. ప్రభుత్వ జోక్యంతో రిటైల్ మార్కెట్‌లో టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయని అధికార వర్గాలు చెప్పాయి. ఆదివారం ఢిల్లీ, నోయిడా, లక్నో, కాన్పూర్, వారణాసి, పాట్నా తదితర నగరాల్లో కిలో టమాటాలు రూ.80 చొప్పున విక్రయించారు. సోమవారం నుంచి మరి కొన్ని నగరాల్లో ఈ రాయితీ ధరతో టమాటాలను విక్రయించనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.178, ముంబైలో రూ.150, చెన్నైలో రూ.132 చొప్పున పలుకుతోంది. సాధారణంగా జూలై–ఆగస్టు, అక్టోబర్–నవంబర్‌లో టమాటా ధరలు పెరుగుతుంటాయి. ఈసారి వర్షాలు ఆలస్యం కావడం వల్ల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, కర్ణాటకలోని కోలార్, మహారాష్ట్రలోని సంగనేరీ నుంచి కేంద్ర ప్రభుత్వం టమాటాలను సేకరిస్తోంది.


1950 నుంచే
పెనుముప్పు శకం ఆరంభం

మానవుల చర్యల వల్ల భూమికి అపార నష్టం

నిర్ధారించిన 'ఆంథ్రోపొసీన్ వర్కింగ్ గ్రూప్' సైంటిస్టులు

భూగోళంపై గతంలో ఎన్నడూ కనిపించని ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. కాలుష్యం, భూతాపం, వాతావరణ మార్పులు పెరిగిపోతున్నాయి. రుతువులు గతి తప్పుతున్నాయి. ఒకవైపు భీకర వర్షాలు, వరదలు, మరోవైపు నిప్పులు కక్కే ఎండలు సర్వసాధారణంగా మారాయి. మొత్తం పుడమి ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అయితే, మానవుల నిర్వాకం వల్ల భూమిపై అవాంఛనీయ ఈ పరిణామం ఎప్పుడు మొదలైందో తెలుసా? 1950 నుంచి 1954 మధ్య మొదలైందని 'ఆంథ్రోపొసీన్ వర్కింగ్ గ్రూప్' సైంటిస్టులు గుర్తించారు. భూమాతను ప్రమాదంలోకి నెట్టివేసే కొత్త శకానికి అదొక ఆరంభమని అంటున్నారు. ఈ పరిణామానికి ఆంథ్రోపొసీన్ అని నామకరణం చేశారు. మనిషి, నూతన అనే అర్థాలున్న గ్రీక్ పదాలతో ఈ కొత్త పదం ఏర్పడింది. మొదట దీనిని 2000 సంవత్సరంలో పాల్ క్రట్‌జెన్, యూగీన్ స్టార్మర్ అనే శాస్త్రవేత్తలు ఉపయోగించారు. దీనిని ప్రస్తుత 'జియోలాజికల్ టైమ్ ఇంటర్వెల్'గా పరిగణిస్తున్నారు. 'ఆంథ్రోపొసీన్ వర్కింగ్ గ్రూప్' సైంటిస్టులు ఇంకా ఏం చెప్పారంటే..

– సాక్షి, నేషనల్ డెస్క్



- ఆంథ్రోపొసీన్‌లో భాగమైన పరిణామాలు, మార్పులు 1,000 లేదా అంతకంటే ఎక్కువ కాలం కొనసాగుతాయి.
- ఇవి మొత్తం భూమి ఆవరణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. కొన్ని మార్పులు ప్రభావం భూమిపై శాశ్వతంగా ఉంటుంది.
- శిలాజ ఇంధనాల వాడకం, అణ్వాయుధాలను ఉపయోగించడం, పొలాల్లో రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగం, భూమితో పాటు నదులు, చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం వంటివి ఆంథ్రోపొసీన్‌కు కారణమవుతున్నాయి.
- మానవుల చర్యల భూమికి జరుగుతున్న నష్టం అనూహ్యంగానే ఉందని, ఈ నష్టం రానురాను మరింత పెరుగుతుందని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్‌కు చెందిన జియాలజిస్ట్ కోలిన్ వాటర్స్ ఆందోళన వ్యక్తం చేశారు.
- సుమారు 6.6 కోట్ల సంవత్సరాల క్రితం బలమైన గ్రహ శకలాలు భూమిని ఢీకొట్టడం వల్ల రాక్షస బల్లులు అంతరించిపోయాయి. ఇప్పుడు మానవ చర్యలు సైతం అదే కేటగిరీకి సమానంగా ఉన్నాయి. 1950వ దశకం తర్వాత భూగోళంపై ఎన్నో రకాల జీవులు అంతరించిపోయాయి.
- గ్రహ శకలాలు ఢీకొట్టడం అనేది ఒక కొత్త శకానికి దారితీసింది. మనుషుల కార్యకలాపాలు కూడా భూమిపై కొత్త శకానికి నాంది పలికాయి.
- ఇప్పటికైనా మేల్కొని నష్ట నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మరిన్ని తీవ్ర పరిణామాలు తలెత్తుతాయనడంలో సందేహం లేదు.

పిల్లల ఫొటోల్ని షేర్ చేయకండి

- తల్లిదండ్రులకు అస్సాం పోలీసుల సూచన
- ఏఐ ఫొటోలతో వినూత్న ప్రచారం



గువాహటి: సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కోసం చిన్నారుల ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంపై అస్సాం పోలీసులు వినూత్న ప్రచారం ప్రారంభించారు. ఇందుకోసం పోలీసులు కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన చిన్నారుల చిత్రాలను వాడుకున్నారు. 'పిల్లలు సోషల్ మీడియా ట్రోఫీలు కాదు, నెటిజన్ల దృష్టిలో పడేందుకు చిన్నారుల గోప్యతతో వ్యాపారం చేయకండి, మీ చిన్నారుల కథ చెప్పే అవకాశం వారికే ఇవ్వండి, లైక్స్ పాతబడిపోతాయి కానీ, డిజిటల్ మరకలు శాశ్వతం'వంటి సందేశాలను జత చేశారు. ఇటీవలి కాలంలో ఫ్యామిలీ వ్లాగర్లు ప్రచారం కోసం చిన్నారులను కూడా వాడుకోవడం ఎక్కువైపోయింది. సోషల్ మీడియాలో తాము ఎలా కనిపిస్తామో తెలియని చిన్నారులను ప్రచారం కోసం ఉపయోగించుకోవడం ఎన్నో విధాలుగా నష్టం తెస్తుందని పోలీసులు చెబుతున్నారు. తమ పిల్లల చిత్రాలను షేర్ చేయడం హానికరం కాదని తల్లిదండ్రులు మొదట్లో భావించవచ్చు. కానీ, పిల్లలను గురించి అవసరం లేకున్నా ఎక్కువ మందికి తెలియడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ చర్య పిల్లల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడంతోపాటు, వారి మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అస్సాం పోలీసుల ప్రయత్నంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇది అద్భుతం, నేటి తల్లిదండ్రులకు ఇలాంటి సందేశాలు ఎంతో అవసరమని పేర్కొంటున్నారు. అస్సాం పోలీసులు ఇటీవల సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు బాలీవుడ్ సినిమాలతో ప్రభావితమైన సైబర్ నేరగాళ్ల కృత్రిమ మేధ చిత్రాలను ట్వీట్ చేసి ప్రశంసలు అందుకున్నారు.

హిమాచల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా
దివ్యాంగ మహిళలు



ప్రతిభ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో ఇద్దరు దివ్యాంగ మహిళలు అరుదైన ఘనత సాధించారు. అంధులైన వీరిద్దరూ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమితులయ్యారు. పట్టుదల, అంకితభావంతో తమ కలలను నిజం చేసుకున్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ముస్కాన్ ప్రముఖ గాయకురాలు. హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఎన్నికల సంఘం యూత్ ఐకాన్‌గా ఇప్పటికే గుర్తింపు పొందారు. దేశ విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. 2013లో రాజకియా కన్య మహావిద్యాలయలో సంగీతంలో ప్రవేశం పొందారు. ఇప్పుడు అదే విద్యాసంస్థలో సంగీతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ముస్కాన్ చురుగ్గా ఉంటున్నారు. సాధారణమధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ప్రతిభా ఠాకూర్ సైతం అంధురాలు. పీహెచ్‌డీ పూర్తిచేశారు. విద్యా రంగంలో సేవలు అందించాలన్నది ఆమె చిన్నప్పటి కల. రాజీవ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితురాలైంది.

మా దగ్గరా బోలెడు క్లస్టర్ బాంబులు



కీవ్: ఉక్రెయిన్‌కు అమెరికా విధ్వంసకర క్లస్టర్ బాంబులను సరఫరా చేయడంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పందించారు. తమ వద్ద కూడా క్లస్టర్ బాంబుల నిల్వలు దండిగా ఉన్నాయని ప్రకటించారు. ఈ వివాదాస్పద ఆయుధాలను ఉక్రెయిన్ వాడిన పక్షంలో తగు రీతిలో స్పందించే హక్కు తమకుందని హెచ్చరించారు. 'మా వద్ద క్లస్టర్ బాంబులు ఉన్నప్పటికీ ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటి వరకు వాటిని వాడలేదు. అటువంటి అవసరం కూడా మాకు రాలేదు' అని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ ఇప్పటికే క్లస్టర్ బాంబులను వాడినట్లుగా పలు ఆధారాలను అసోసియేటెడ్ ప్రెస్, అంతర్జాతీయ మానవతావాద సంస్థలు చూపుతున్నాయి. రష్యాపై ఉక్రెయిన్ ఎదురుదాడి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో, యుద్ధక్షేత్రంలో రష్యా ఆర్మీపై ఉక్రెయిన్ పైచేయి సాధించాలంటే విధ్వంసకర క్లస్టర్ బాంబులే మార్గమని అమెరికా అంచనా వేస్తోంది. క్లస్టర్ బాంబుల సరఫరాపై నెలలపాటు అమెరికా మల్లగుల్లాలు పడింది. ఉక్రెయిన్‌కు వీటిని అందజేయాలన్న నిర్ణయానికే అధ్యక్షుడు బైడెన్ చివరికి మొగ్గు చూపారు. ప్రమాదకరమైనవిగా భావించే క్లస్టర్ బాంబులను చివరిసారిగా అమెరికా 2003లో ఇరాక్ యుద్ధంలో వాడినట్లు చెబుతోంది. ప్రస్తుతం ఆ దేశం వద్ద 30 లక్షల క్లస్టర్ ఆయుధ నిల్వలున్నాయి. డొనెట్స్క్, ఖేర్సన్ ప్రాంతాలే లక్ష్యంగా గత 24 గంటల్లో రష్యా రెండు షహీద్ డ్రోన్లను, రెండు క్రూయిజ్ మిస్సైళ్లను, రెండు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైళ్లతోపాటు 40 వైమానిక దాడులు, 46 రాకెట్ దాడులు జరిపిందని ఉక్రెయిన్ తెలిపింది.



ప్రధాని మోదీ గౌరవార్థం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ పారిస్‌లో శుక్రవారం ఇచ్చిన విందుకు హాజరై వారితో సెల్ఫీ దిగుతున్న సినీ నటుడు, దర్శకుడు ఆర్.మాధవన్. చారిత్రక లౌవ్రె మ్యూజియంలో ఈ కార్యక్రమం జరిగింది.

పవార్‌తో అజిత్ భేటీ
పార్టీని ఐక్యంగా ఉంచాలని విజ్ఞప్తి



శరద్ పవార్‌ను కలిసివస్తున్న అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ తదితరులు

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)ని ఐక్యంగా ఉంచాలని ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌కు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వర్గం విజ్ఞప్తి చేసింది. అజిత్ పవార్‌తోపాటు ఆయన వర్గానికి చెందిన కొందరు మంత్రులు ఆదివారం దక్షిణ ముంబైలోని వైబీ చవాన్ సెంటర్‌లో శరద్ పవార్‌తో సమావేశమయ్యారు. అజిత్ ఈ నెల 2న తన బాబాయ్ శరద్ పవార్‌పై తిరుగుబాటు చేసి, తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి శివసేన–బీజేపీ ప్రభుత్వంలో చేరి, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత శరద్ పవార్‌తో ఆయన ముఖాముఖి సమావేశం కావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా అజిత్ వెంట మంత్రులు హసన్ ముష్రీఫ్, ఛగన్ భుజబల్, అదితి తత్కారే, దిలీప్ వాల్సే పాటిల్ తదితరులు ఉన్నారు. శరద్ పవార్‌తో భేటీ అనంతరం అజిత్ వర్గంలోని ముఖ్యనేత ప్రఫుల్ పటేల్ మీడియాతో మాట్లాడారు. పార్టీని ఐక్యంగా ఉంచాలంటూ తమ అధినేతను కోరామని చెప్పారు. తాము చెప్పిందంతా ఆయన నిశ్శబ్దంగా విన్నారని, ప్రతిస్పందించలేదని తెలిపారు. శరద్ పవార్ తమకు దేవుడిలాంటివారని, ఆయన ఆశీస్సుల కోసం వచ్చామని పేర్కొన్నారు. తమను ముందుండి నడిపించాలంటూ విన్నవించామని చెప్పారు. అజిత్ పవార్ వర్గం నేతలు శరద్ పవార్‌ను కలవడంలో ఎలాంటి తప్పు లేదని బీజేపీ ముంబై శాఖ అధ్యక్షుడు ఆశిష్ షెలార్ అన్నారు. శరద్ పవార్‌ను అజిత్ వర్గం తమ అధ్యక్షుడిగా భావిస్తోందని స్పష్టం చేశారు. మొత్తానికి అజిత్ వర్గం శరద్ పవార్‌ను కలిసి మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది.

కన్నడ నాట పొత్తు రాజకీయం

చేతులు కలిపే దిశగా బీజేపీ–జేడీఎస్ • కాంగ్రెస్‌కు చెక్, అధిక ఎంపీ సీట్లే లక్ష్యం



శివాజీనగర: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కన్నడనాట బీజేపీ, జేడీఎస్ పార్టీలు పొత్తు పెట్టుకోవాలని జాతీయస్థాయి నాయకులు భావిస్తుంటే, రాష్ట్ర బీజేపీ ఇందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. తమ ఓటు బ్యాంకును అప్పనంగా జేడీఎస్‌కు అప్పజెప్పడమేనని రాష్ట్ర బీజేపీ నాయకులు ఆందోళనతో ఉన్నారు. ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్‌లను కాదని ప్రతిపక్ష కాంగ్రెస్ విజయదుందుభి మోగించి సర్కారును ఏర్పాటు చేయడం తెలిసిందే. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలవకుండా చేతులు కలపాలని జేడీఎస్, బీజేపీలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై బీజేపీ హైకమాండ్‌తో జేడీఎస్ అగ్రనేత హెచ్‌డీ కుమారస్వామి చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 18న ఢిల్లీలో ఎన్‌డీఏ సమావేశం జరగనుంది. దీనికి జేడీఎస్‌ను ఆహ్వానించాలని బీజేపీ హైకమాండ్ యోచిస్తోంది. పిలుపు వస్తే వెళ్లాలని కుమారస్వామి సిద్ధమయ్యారు. అక్కడ చర్చలు ఫలిస్తే లోక్‌సభ ఎన్నికలకు పొత్తు కుదిరే అవకాశముంది. కానీ కుమారస్వామితో పొత్తు పెట్టుకొంటే పాత మైసూరు భాగంలో పార్టీ ప్రభావం తగ్గుతోంది, అంతేకాకుండా ఒక్కలిగుల ఓట్ బ్యాంకును కోల్పోతాము. పొత్తు వద్దని బీజేపీ రాష్ట్ర నాయకులు, అందులోనూ ఒక్కలిగ నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇది గ్రహించిన కుమారస్వామి రాష్ట్ర నాయకులను కాదని బీజేపీ కేంద్ర నాయకులతో పొత్తు చర్చలకు సిద్ధంగా ఉన్నారు. జేడీఎస్‌తో చేతులు కలిపి ఎక్కువ ఎంపీ స్థానాలను గెలుపొందాలని బీజేపీ కూడా ఆశిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రికార్డుస్థాయిలో 20కి పైగా ఎంపీ సీట్లను గెలుచుకుంది. ఈసారి అదే జాదూను పునరావృతం చేయాలనుకుంటోంది. కాగా, బీజేపీ–జేడీఎస్ పొత్తు వార్తలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. అవకాశవాద జేడీఎస్ పార్టీ అధికారం కోసం ఎంతకైనా దిగజారుతుందని ఆరోపించింది.

జేడీఎస్‌ను చీల్చేందుకు కాంగ్రెస్ ఎత్తుగడ

ఇదిలా ఉండగా, అధికార కాంగ్రెస్ పార్టీ మరో ఎత్తుగడలో ఉంది. బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్న జేడీఎస్ ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకోవాలని చూస్తోంది. సుమారు 12 జేడీఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకు రావటం ద్వారా పార్టీ ఫిరాయింపు చట్టం వర్తించకుండా చూడాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జేడీఎస్‌కు 16 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అలా వచ్చే వారికి మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. అదనుచూసి జేడీఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని పథకం వేస్తోంది.

చర్చలు జరిగాయి: బొమ్మై

పొత్తు గురించి బీజేపీ మాజీ సీఎం బస్వరాజ బొమ్మై ఆదివారం స్పందిస్తూ తమ హైకమాండ్, జేడీఎస్ అధినేత దేవేగౌడ మధ్య పొత్తులపై చర్చలు జరిగాయన్నారు. చర్చలు సఫలమైతే రాజకీయ మార్పులు తథ్యమన్నారు.

నేడు అమిత్ షా సమక్షంలో..
1.44 లక్షల కిలోల డ్రగ్స్ ధ్వంసం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విధ్వంసానికి కేంద్రం రంగం సిద్ధం చేసింది. సోమవారం ఢిల్లీలో హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో నిర్వహించనున్న 'డ్రగ్స్ స్మగ్లింగ్, జాతీయ భద్రత' సదస్సులో ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ ఎన్‌సీబీ పరిధిలో పట్టుకున్న 6,590 కిలోలు సహా 1,44,000 కిలోల మాదకద్రవ్యాలను (రూ.2,416 కోట్లు) ధ్వంసం చేయనున్నారు. దీంతో కలిపి జూన్ 1, 2022 నుంచి జులై 15, 2023 వరకూ రాష్ట్రాల్లోని ఎన్‌సీబీ, యాంటీ నార్కొటిక్స్ టాస్క్ ఫోర్స్‌ల ప్రాంతీయ యూనిట్లు సమష్టిగా సుమారు రూ.9,580 కోట్ల విలువైన 8.76 లక్షల కిలోల డ్రగ్స్‌ను ధ్వంసం చేశాయి. సోమవారం నాటితో ఏడాదిలో ధ్వంసమయ్యే డ్రగ్స్ మొత్తం 10 లక్షల కిలోలు దాటనుంది. డ్రగ్స్ రహిత భారతదేశాన్ని సృష్టించడానికి ప్రభుత్వం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జీరో టోలరెన్స్ విధానం అవలంబిస్తోందని హోంశాఖ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.



స్పెయిన్‌లో కార్చిచ్చు..

స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో కార్చిచ్చు చెలరేగింది. శనివారం ఉదయం నుంచి మొదలైన మంటలు సుమారు 11వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని దహించివేశాయి. మంటలను అదుపు చేసేందుకు ప్రభుత్వం 400 మంది సిబ్బందిని రంగంలోకి దించింది. ఇప్పటి వరకు 4 వేల మందికి పైగా ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించింది. మంటల్లో 12కు పైగా నివాసాలు ఆహుతయ్యాయి. అగ్ని కీలలను అదుపు చేసేందుకు సీప్లేన్‌లను కూడా వినియోగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. – మాడ్రిడ్

మధ్యప్రదేశ్‌లో యువతిపై గ్యాంగ్‌రేప్

నిందితుల్లో బీజేపీ నేత మైనర్ కుమారుడు

దతియా: ఓ యువతిని, ఆమె చెల్లెల్ని నలుగురు యువకులు కిడ్నాప్ చేశారు. యువతిపై సామూహిక అత్యాచారం చేయడంతోపాటు ఆమె చెల్లెల్ని లైంగికంగా వేధించారు. నిందితుల్లో స్థానిక బీజేపీ నేత కుమారుడు కూడా ఉన్నారు. బాధితురాలు మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఓ యువతి(19)ని, ఆమె చెల్లిని నలుగురు వ్యక్తులు నిర్బంధించి, ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ యువతిపై నలుగురు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె చెల్లిని లైంగికంగా వేధించారు. ఘటన అనంతరం వారిద్దరూ ఇంటికి చేరుకున్నారు. మనస్తాపానికి గురైన బాధితురాలు ఆత్మహత్యకు యత్నించింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఘటనపై బాధితురాలి చెల్లెలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీస్‌స్టేషన్ ఎదుట పెద్ద సంఖ్యలో జనం నిరసనకు దిగడంతో పోలీసులు నిందితులపై పోక్సోతోపాటు 376డి (గ్యాంగ్‌రేప్), దౌర్జన్యం (354), 342 (నిర్బంధం) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో బీజేపీ జిల్లా నేత కొడుకు(మైనర్) కూడా ఉన్నాడు. మరొకరికి కోసం గాలిస్తున్నారు. ఘటనపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర బుధోలియా స్పందించారు. పోలీసు విచారణలో తమ పార్టీ నేత కొడుకు కూడా ఉన్నట్లు బాధితురాలు వెల్లడిస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

బెంగళూరులో విపక్షాల వ్యూహరచన

నేడు, రేపు సమావేశాలు


బనశంకరి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కట్టడి చేయడానికి బెంగళూరులో సోమ, మంగళవారాల్లో కాంగ్రెస్ సహా 24 ప్రతిపక్ష పార్టీలు సమావేశం కానున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ ఆధ్వర్యంలో జరిగే భేటీలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చిస్తారు. బిహార్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ సీఎంలు నితీశ్‌కుమార్, స్టాలిన్, మమతాబెనర్జీ కూడా పాల్గొననున్నారు. జూన్ 23న బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పట్నాలో ప్రతిపక్షాల మొదటి సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. తాజా సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్) నితీశ్‌కుమార్ (జేడీయూ), మమతా బెనర్జీ (టీఎంసీ), ఎంకే.స్టాలిన్ (డీఎంకే), హేమంత్‌సోరెన్ (జేఎంఎం), ఉద్ధవ్ ఠాక్రే (ఎస్ఎస్–యుబీటీ), శరద్‌పవార్ (ఎన్సీపీ), డి.రాజా(సీపీఐ), లాలూప్రసాద్ యాదవ్ (ఆర్‌జేడీ), అఖిలేశ్‌యాదవ్ (ఎస్పీ), సీతారాం ఏచూరి (సీపీఐఎం), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీపీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐఎంఎల్) తదితరులు పాల్గొంటారు.

భేటీకి ఆప్ కూడా..

ఢిల్లీ యంత్రాంగంపై పెత్తనం కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ తెలిపింది. కేంద్రంలోని బీజేపీ ప్రయత్నాలు సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయని తెలిపింది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లును తిరస్కరిస్తామని స్పష్టం చేసింది. దీనిపై ఆప్ స్పందించింది. బెంగళూరులో జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశానికి తాము కూడా హాజరవుతామని ఆ పార్టీ నేత రాఘవ్ చద్దా తెలిపారు. ఆదివారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు.

అలాస్కాలో భూకంపం.. స్వల్ప సునామీ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికాలోని అలాస్కాలో శనివారం భూకంపం సంభవించింది. అధికారులు సునామీ హెచ్చరికను సైతం జారీ చేశారు. సుమారు గంట తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. అలాస్కాలో సునామీ సంభవించే అవకాశం ఉందంటూ శనివారం రాత్రి అధికారులు సైరన్లతో హెచ్చరికలు చేశారు. ప్రజలను షెల్టర్లలోకి తరలించారు. అలాస్కాలోని శాండ్ పాయింట్‌కు 106 కిలోమీటర్ల దూరంలో భూమిలో 13 మైళ్ల లోతులో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఎటువంటి నష్టం సంభవించినట్లు సమాచారం లేదని పేర్కొంది.



సీడీపీ నిధులకు మోక్షం

జిల్లాలో సీడీపీ నిధులకు మోక్షం లభించింది. ఒక్కో నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రూ.75లక్షల చొప్పున నిధులు విడుదల అయ్యాయి. 8లో▸



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లన్న స్వామివారికి భక్తులు పట్నాలు వేయించారు. బోనం చేసి నైవేద్యం సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను పాలకవర్గం పర్యవేక్షించింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న థామస్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ తెలంగాణ మాజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు రావల్సిన రెండు పీఆర్‌సీలు, 2013 ఏరియర్స్, సీసీఎస్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు డిపోల్లో, టెర్మినల్ పాయింట్లలో తగిన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. టికెట్ తీసుకునే పూర్తి బాధ్యత ప్రయాణికుడిదే ఉండేలా చూడాలని అన్నారు.15రోజుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కె. శంకర్‌రెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, సలహాదారులు బి.యాదయ్య, రాఘవరెడ్డి, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.మనోహర్, కార్యదర్శి ఎంపీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్ పోటీల్లో ముందుండాలి



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీలత

గంగాధర: రాష్ట్రస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో గట్టుభూత్కూర్‌ను ముందు వరుసలో నిలపాలని సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డికి డీఆర్డీవో శ్రీలతరెడ్డి సూచించారు. గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపిక కాగా ఆదివారం డీఆర్‌డీవో స్థానికంగా చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలల మరమ్మతు పనులు, సెగ్రిగేషన్ షెడ్డులో చెత్తవేరు చేసే పద్ధతులు పరిశీలించారు. ఉపసర్పంచ్ కాసారపు శైలజ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఏడీఏగా రణధీర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: సుదీర్ఘకాలంగా ఇన్‌చార్జీతో నెట్టుకొస్తున్న కరీంనగర్ ఏడీఏ పోస్టుకు పూర్తిస్థాయి అధికారి వచ్చారు. కొన్నేళ్లుగా కరీంనగర్ వ్యవసాయ సహాయ సంచాలకుల పోస్టును డీఏవో శ్రీధర్ నిర్వహిస్తున్నారు. కాగా రెండు రోజుల క్రితం ఏడీఏను నియమించడం శుభపరిణామం. కరీంనగర్ ఏడీఏగా రణదీర్‌రెడ్డిని నియమించారు. కొంతకాలం క్రితం వరకు రణధీర్ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ అధికారిగా వ్యవహరించారు. గతంలో అర్బన్ ఏవోగా పనిచేసిన అనుభవం ఈ అధికారికి ఉంది.

ముగిసిన సివిల్స్ ప్రిలిమినరీ ఉచిత శిక్షణ పరీక్షలు

కరీంనగర్: బీసీస్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సివిల్స్ ఉచిత శిక్షణ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ముగిశాయి. జ్యోతిష్మతి, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి11 గంటల వరకు, మధ్యాహ్నం12 గంటల నుంచి 2 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. హాల్ టికెట్‌తో పాటు గుర్తింపుకార్డు ఉంటేనే అభ్యర్థులను అనుమతించారు. పరీక్షకు మొత్తం 175మంది హాజరయ్యారని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.

ఇసుక మాఫియా ఇష్టారాజ్యం

- చిగురుమామిడి, మానకొండూరులో జోరుగా రవాణా
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు
- మైనారిటీ తీరకుండానే ట్రాక్టర్లు డ్రైవింగ్‌లు
- ఉద్యోగాలు వద్దని ట్రాక్టర్లు కొంటున్న బీటెక్ బాబులు
- రాత్రికి రాత్రే లక్షాధికారులు కావొచ్చని కలలు



వాగులో ఇసుక ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లాలో ఇసుక దందా ఆగడం లేదు. ఓ వైపు సుప్రీం కోర్టు, ఎన్జీటీ ఎలాంటి తవ్వకాలు చేపట్టవద్దని స్పష్టం చేసినా మండలాల్లో రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. దందాను నిలువరించాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. జిల్లాలో ఇసుక తవ్వకాలు పర్యావరణానికి విఘాతం కలిగిస్తాయని ఎన్జీటీ ఆదేశాలను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులివ్వడంతో కొంతకాలం నిలిపివేశారు. స్థానిక డిమాండ్లు, ఒత్తిళ్లతో డంపుల్లో ఉన్న ఇసుక తరలింపునకు కలెక్టర్ అనుమతించడంతో ఇదే అదనుగా ట్రాక్టర్ల మాఫియా రంగంలోకి దిగింది. ఎక్కడికక్కడ మామూళ్లు ఇవ్వడం, రాజకీయ అండదండలతో జోరుగా ఇసుక తరలిస్తున్నారు.

చిగురుమామిడి, మానకొండూరులో..

ఈ రెండు మండలాల్లో వింత పరిస్థితి నెలకొంది. ఈ మండలాల్లోని లింగాపూర్, రామంచ క్వారీల్లో అనుమతి పొందిన కాంట్రాక్టర్లు ఇసుక తవ్వకాలు చేపట్టారు. కోర్టుతీర్పుతో తవ్వకాలు నిలిచిపోయాయి. కానీ, మానకొండూరులో మానేరు, చిగురుమామిడిలో మోయతుమ్మెద నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు ఆగడం లేదు. చిగురుమామిలో దాదాపు 150 ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. ఇందులో 60 వరకు ఇందుర్తి గ్రామానికి చెందినవి కాగా, మరో 90 వరకు రామంచవి. మానకొండూరు మండలంలో 200కు పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. ట్రాక్టరుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేసి నెలనెలా పోలీసులకు, రెవెన్యూ, గ్రామపంచాయతీ, కీలక ప్రజాప్రతినిధులకు మామూళ్లుగా ఇస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఇటీవల ప్రమాదాలు

- మానకొండూర్ మండలకేంద్రానికి చెందిన బోడ కిరణ్ మరో ఇద్దరితో కలిసి మే 1, 2022లో శ్రీనివాస్‌నగర్ శివారులోని మానేరు వాగులో ట్రాక్టర్‌లో ఇసుక నింపేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ డ్రైవ్ చేస్తూ అదుపుతప్పి దానికిందపడి మృతి చెందాడు.
- మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము అజయ్ ద్విచక్ర వాహనం ఇసుక ట్రాక్టర్‌కు సెంట్రీడ్యూటీ నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఇసుక ట్రాక్టర్ ముంజంపల్లి శివారులో ఎస్సారెస్పీ కాలువ గుండా వెళ్తుండగా ముందుగా పోలీసులు ఉన్నారనే విషయాన్ని ట్రాక్టర్ డ్రైవర్‌కు చెప్పేందుకు బైకుపై వేగంగా వెళ్లి, అదుపుతప్పి పడి మృతి చెందాడు.
- ఇసుక ట్రాక్టర్‌పై కూలి పనికి వెళ్లిన శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన గణేశ్ అనే యువకుడు మరణించాడు. కరీంనగర్‌లో ఇసుకను అన్‌లోడ్ చేసి తిరిగి ఇంటికి వస్తుండగా డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న గణేశ్ గతుకుల రోడ్డు కారణంగా ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు.
- ఇటీవల రాజీవ్ రహదారిపై మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన అరవింద్(23), సంపత్(21), ఆంజనేయులు (25) మరణించిన విషయం తెలిసిందే.



అంజి(ఫైల్)



సంపత్ (ఫైల్)



అరవింద్ (ఫైల్)



మోయతుమ్మెద వాగులో ఇసుక లోడింగ్

మైనర్ డ్రైవింగ్

జిల్లాలో మానేరు, మోయతుమ్మెద వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇసుక ట్రాక్టర్ల యజమానులు కొందరు అక్రమంగా సంపాదించారు. వారి వద్ద ఉన్న కార్లు, మొబైల్స్, వాహనాలు చూసి యువత పక్కదారి పడుతోంది. మానకొండూరు, జమ్మికుంట, చిగురుమామిడి, వీణవంక మండలాల్లో బీటెక్ చదివిన యువత ఉద్యోగ ప్రయత్నం చేయకుండా ఇసుక తరలింపునకే మొగ్గు చూపుతుండటం గమనార్హం. వీరంతా ఇసుక దందాతో రాత్రికి రాత్రి రూ.లక్షలు సంపాదించవచ్చు అన్న అపోహలో.. ట్రాక్టర్లు కొని అప్పుల పాలవుతున్నారు. మరోవైపు వీరినిచూసి మైనర్లు కూడా ట్రాక్టర్లు నడిపేందుకు ముందుకు వస్తున్నారు. జేబు ఖర్చులు, కుటుంబ అవసరాల కోసం ట్రాక్టర్ స్టీరింగ్ పడుతున్నారు. మితిమీరిన వేగంతో వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు వెంబడించినప్పుడు, ఎవరైనా అడ్డగించినప్పుడు అడ్డదిడ్డంగా బండ్లునడిపి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.



సుందరగిరి నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

మీరు అధికారులకు ఫిర్యాదు చేసుకోండి

- కార్పొరేటర్ వీడియో వైరల్





సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ 21వ డివిజన్‌లో కార్పొరేటర్‌కు స్థానికులకు మధ్య జరిగిన ఓ వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కార్పొరేటర్ జంగిలి సాగర్ తన డివిజన్‌లో ఓ ప్లాట్ ముందున్న విద్యుత్‌పోల్‌ను తొలగించేందుకు వచ్చినప్పుడు స్థానికులు తీవ్రఅభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ విషయంలో స్థానికులకు కార్పొరేటర్‌కు మధ్య మాటామాటా పెరిగి పరస్పర దూషణలకు దారితీసింది. తమ ప్రాంతంలో పోల్‌ను విద్యుత్ అధికారు ల అనుమతి లేకుండా ఎలా తొలగిస్తారని స్థానికులు ప్రశ్నించగా.. మీరు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసుకోండని కార్పొరేటర్ సాగర్ కూడా ప్రతిస్పందించారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన ఇటీవలే జరిగినా.. ఏ తేదీన జరిగింది? అన్న విషయంలో మాత్రం స్పష్టతలేదు. ఈ విషయమై కార్పొరేటర్ సాగర్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

శతాధిక కరపత్ర దీపిక ఒక జ్ఞానదీపిక



కరీంనగర్‌కల్చరల్: శతాధిక కరపత్ర దీపిక విద్యార్థులకు ఒక జ్ఞానదీపికలా నిలుస్తుందని అదనపు పాలనాధికారి జీవీ.శ్యాంప్రసాద్ లాల్ పేర్కొన్నారు. ఆదివారం ఫిలింభవన్‌లో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన శతాధిక కరపత్ర దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ దినోత్సవాలు, ప్రసిద్ధవ్యక్తులు, మన పండుగలు, ప్రముఖ కవులు, సామాజిక అంశాలపై సందేశాత్మకమైన కరపత్రాలు రూపొందించిన ఘనత ప్రభాకర్‌దే అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్ కర్ర అశోక్‌రెడ్డి మాట్లాడుతూ శతాధిక కరపత్ర దీపిక ఒక జ్ఞానరూపమని ఈ పుస్తకం ప్రతీ పాఠశాల గ్రంథాలయంలో ఉండాలని అన్నారు. ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు విడపు శ్రీనివాస్, కవులు నూజెట్టి రవీంద్రనాథ్, స్తంభంకాడి గంగాధర్, గంప ఉమాపతి, అన్నాడి గజేందర్‌రెడ్డి, గూడెపు కుమార్, నలమాసు విజయప్రసాద్, తిరుకోవెల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మట్టిరోడ్లు లేకుండా చేయడమే లక్ష్యం

- రూ.157 కోట్ల నిధులు మంజూరు
- ఆగస్టు 11 నుంచి పనులు ప్రారంభం
- ఎన్నికలప్పుడే రాజకీయాలు
- మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: అన్ని వర్గాల బాగోగులే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కరీంనగర్ నియోజకవర్గంలో మట్టిరోడ్లు కనబడకుండా చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఆదివారం మీసేవ కార్యాలయంలో మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి మాట్లాడారు. నగర అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.350కోట్లు విడుదల చేశారని తెలిపారు. వీటిలో రూ.132 కోట్లు మిగిలాయని అన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోనూ సీసీరోడ్లకు రూ.25కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఆగస్టు 4వరకు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని, 11నుంచి పనులు ప్రారంభించి ఎన్నికల లోపు పూర్తిచేస్తామని వెల్లడించారు. కొంతమంది అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడకుండా రాజకీయాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. తమకు ఎన్నికలప్పుడే రాజకీయాలని, అనంతరం అభివృద్ధే తమ నినాదామని స్పష్టం చేశారు. నగరంలో ఇటీవలవేసిన రోడ్లతో కొత్తశోభ సంతరించుకుందని అన్నారు. అంబేద్కర్ భవన్, షాదీఖానాకు రూ.కోటి చొప్పున మంజూరయ్యాయని తెలిపారు. ఆగస్టులోగా రివర్‌ఫ్రంట్ మొదటిదశ పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. వారంరోజుల్లో కరీంనగర్‌కు అత్యాధునిక రెండు పడవలు రానున్నట్లు వెల్లడించారు. ఏడాదిన్నరలో మానేరు రివర్‌ఫ్రంట్ పనులు చివరి దశకు చేరుకొని, పర్యాటకంగా కరీంనగర్ అగ్రగామిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, చల్లా హరిశంకర్, ఐలేందర్‌యాదవ్, కంసాల శ్రీనివాస్, భూమాగౌడ్, కులదీప్‌వర్మ, గందె మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని జర్నలిస్టులకు పక్షం రోజుల్లో ఇళ్లస్థలాలు కేటాయించనున్నట్లు మంత్రి కమలాకర్ వెల్లడించారు. కొత్తపల్లి మండలం చింతకుంట, మల్కాపూర్ శివార్లలో జర్నలిస్టుల ప్రతిపాదిత స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ఇదివరకే ప్లాట్లు చేసిన స్థలంతో పాటు మరో మూడెకరాలు చదునుచేయాలని తహసీల్దార్ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. సుమారు 120మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కొత్తపల్లి మండలం చింతకుంటలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్‌భవన్, షాదీఖానాలను పరిశీలించారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న టి.లింగారెడ్డి

- డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి

కరీంనగర్‌కల్చరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ముకరంపురాలో జరిగిన డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 30తో పీఆర్సీ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం ఐఆర్ ప్రకటించకపోవడం, పెండింగ్‌లో ఉన్న కరువుభత్యం విడుదల చేయకపోవడం విడ్డూరమని మండిపడ్డారు. వేలాదిగా ఉపాధ్యాయ పోస్టులు, వందలాది పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నా.. నియామకాలు, పదోన్నతులు చేపట్టకపోవడం దారుణం అని పేర్కొన్నారు. విద్యావలంటీర్లను ఇవ్వకపోవడం, స్వీపర్లు, స్కావెంజర్లు పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వ పాఠశాలల దుస్థితి అర్థమవుతోందని అన్నారు. కేంద్రప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం –2020పేరుతోకార్పొరేటీకరణ చేస్తోందని, విద్యారంగంపై నిరాసక్తి కనబరుస్తోందని తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు పోరాడుతున్నా స్పందించడం లేదన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 18,19 తేదీల్లో మండలాల్లో, ఆగస్టు 12న జిల్లాకేంద్రాల్లో బైక్‌ర్యాలీలు, సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డీటీఎఫ్ బాధ్యులు వి.రాజిరెడ్డి, పి.ఈశ్వర్‌రెడ్డి, యాంసాని ఉమారాణి, తూముల తిరుపతి, కె.నారాయణరెడ్డి, ఎ.నరహరి, కె.రాజమౌళి, ఏ.దామోదర్, రాంమోహన్, ఎస్.అంజయ్య, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.





బోనం.. వైభవం



కరీంనగర్‌కల్చరల్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: నగరంలో ఆషాఢ బోనాల సందడి నెలకొంది. ఆదివారం వివిధ డివిజన్లలో పోచమ్మ, పెద్దమ్మ, మైసమ్మ, ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు.. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ నెత్తిన బోనాలు ఎత్తుకున్న మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఒడిబియ్యం పోసి చల్లంగచూడాలని వేడుకున్నారు. పలు డివిజన్లలో జరిగిన ఉత్సవాల్లో మంత్రి కమలాకర్, మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు. బోనం ఎత్తుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 37, 16వ డివిజనల్లో మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్వర్యంలో జరిగిన బోనాల జాతరలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి- హరిశంకర్, గ్రంథాలయసంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ పాల్గొన్నారు. తెలంగాణ షార్ట్‌ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో బైపాస్‌రోడ్‌లోని ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. కొత్తపల్లిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో, కరీంనగర్ మండలం గుంటూరుపల్లిలో పోచమ్మకు బోనాలు సమర్పించగా.. మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గుంటూరుపల్లి ఉపసర్పంచ్ మాచర్ల సత్యనారాయణ తదితరులు హాజరై బోనం ఎత్తుకున్నారు.

క్లుప్తంగా

వ్యాన్ పట్టివేత



గుంతలో దిగబడిన వ్యాన్

జగిత్యాలక్రైం: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ ప్రమాదవాశాత్తు బురదలో దిగబడింది. దీంఅసలు విషయం బయట పడింది. బుగ్గారం మండలం చిన్నాపూర్ సమీపంలోని ఓ రైస్‌మిల్లు నుంచి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి ఐచర్ వ్యాన్‌లో 183 క్వింటాళ్ల నూకలు తరలిస్తున్నారు. వ్యాన్‌డ్రైవర్ వద్ద ఉన్న రసీదులో మాత్రం హైదరాబాద్‌కు చెందిన శ్రీమహాలక్ష్మి ట్రేడర్స్ వేబిల్లు ఉంది. బిల్లు పొంతన లేకుండా ఉండటంతో అధికారులు రేషన్ బియ్యంగా అనుమానిస్తున్నారు. బురదలో చిక్కుకున్న వ్యాన్‌ను పట్టణ ఎస్‌ఐ సంజీవ్ క్రేన్ సాయంతో బయటకు తీయించారు. పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వ్యాన్‌లో తరలిస్తున్నవి రేషన్ బియ్యమా..నూకలా అనేవి తేల్చేందుకు పౌరసరఫరాల శాఖ అధికారికి లేఖ పంపారు. దీంతో వారు పరీక్షిస్తే తప్ప నూకలా..బియ్యమా అనేది తేలనుంది.

భర్త మారడం లేదనే మనస్తాపంతో ఆత్మహత్య



అనసూయ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తాగుడుకు బానిసైన భర్త ప్రవర్తనలో మార్పు రావడం లేదనే మనస్తాపంతో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో వివాహిత బంధువులు భర్తకు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర, రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. మండంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గండికోట అనసూయ(30)కు మండలంలోని పదిరకు చెందిన గండికోట శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. శ్రీనివాస్ నిత్యం తాగివచ్చి మృతురాలిని వేధించేవాడు. దీంతోపాటు ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చకపోగా.. భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో మనస్తాపంతో అనసూయ బాత్‌రూంలోని ఇనుపపైపుకు చీరతో ఉరివేసుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనసూయ మృతికి శ్రీనివాస్ కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతురాలి సోదరుడు బత్తుల కృష్ణంరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ దేవాలయానికి వెళ్లే రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన చిన్నవేణి గణేశ్, కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన దేవరాయుల రాజు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

సీడీపీ నిధులకు మోక్షం

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రూ.75 లక్షల చొప్పున మంజూరు
- జనాభా ప్రాతిపదికన కేటాయించిన ప్రభుత్వం



సీడీపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు (ఫైల్)

కరీంనగర్: 'రెండేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) నిధులు లేకపోవడంతో ఎమ్మెల్యేలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయారు. ఇప్పుడు నిధులు విడుదల కావడమే కాకుండా ఆమొత్తం పెరగడంతో హామీలను నెరవేర్చేందుకు అవకాశం ఏర్పడింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి విడతగా కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిధులు జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీకి మంజూరయ్యాయి. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంత్రిగా కొనసాగుతుండగా సుంకె రవిశంకర్(చొప్పదండి), రసమయి బాలకిషన్ (మానకొండూర్), ఈటల రాజేందర్ (హుజూరాబాద్) ఎమ్మెల్యేగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కౌశిక్‌రెడ్డి కొనసాగుతున్నారు. నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీకి రూ.75లక్షల చొప్పున మొత్తంగా రూ.3.75 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో తమ పరిధిలోని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి నిధులు ఖర్చు చేయనున్నారు.'

రెండేళ్ల నిరీక్షణకు తెర

సీడీపీ నిధుల కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రెండేళ్లుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు తెరపడింది. వాటిని జనరల్, ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించింది. నియోజకవర్గ అభివృద్ధి నిధులు గతంలో రూ.3 కోట్లు మాత్రమే ఉండగా ఈసారి ప్రభుత్వం రూ.5 కోట్లకు పెంచింది. ఈ నిధులను ఆయా ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు వెచ్చించుకోవచ్చు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీడీపీ నిధులను ఇవ్వడం 2010 నుంచి ప్రారంభమైంది. మొదట్లో రూ.ఒక కోటి ఉండగా ఆ తర్వాత రూ.3 కోట్లకు పెంచగా, ప్రస్తుతం రూ.5 కోట్లకు చేరింది.

40 శాతం పాఠశాలలకు..

నియోజకవర్గ అభివృద్ధి నిధులను జనాభా ప్రాతిపదికన కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు సంబంధించి మొదటి విడతగా మంజూరైన నిధుల నుంచి 16.75 శాతం ఎస్సీలకు, 2.65 శాతం ఎస్టీ, మిగిలిన నిధులు జనరల్ కేటగిరీల్లో అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఎస్సీ కేటగిరీ నిధులు ఎస్సీ కాలనీల్లో, ఎస్టీ కేటగిరీ నిధులను తండాల్లో ఖర్చు చేస్తారు. జనరల్ కేటగిరీ నిధులు ఎక్కడైనా ఖర్చు చేసుకోవచ్చు. అయితే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఐదు విడతల్లో మంజూరైన రూ.5 కోట్లలో కచ్చితంగా 40 శాతం నిధులను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఊరట

నియోజకవర్గ అభివృద్ధి నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఊరట కలిగించింది. ప్రజాప్రతినిధులు వారి నియోజకవర్గాల్లో పర్యటించే సమయంలో ప్రజల నుంచి వినతులు, డిమాండ్లు వస్తుంటాయి. ఆ సమయంలో వారు హామీ ఇవ్వడంలో కొంత ఆలోచిస్తుంటారు. సీడీపీ నిధులు చేతిలో ఉంటే వారు స్వేచ్ఛగా హామీ ఇచ్చే అవకాశం ఉంటుంది. సీడీపీ నిధులు మంజూరు కావడంతో ఊళ్లలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేయించడం, స్కూళ్లలో అదనపు తరగతి గది, టాయిలెట్లు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర 98 రకాల అభివృద్ధి పనులకు వెచ్చించుకోవచ్చు.

మంత్రి ఆమోదం తప్పనిసరి

సీడీపీ నిధుల ఖర్చుకు సంబంధించి సంబంధిత జిల్లా మంత్రి ఆమోదం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో కేవలం కలెక్టర్ ఆమోదంలో నిధుల మంజూరు జరిగేది. ఈసారి కలెక్టర్‌తో పాటు మంత్రి ఆమోదం తప్పనిసరి చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ద్వారా కలెక్టర్‌కు అక్కడి నుంచి మంత్రికి చేరి ఆమోదం పొందాల్సి ఉంటుంది.

ఉత్తర్వులు అందాయి

2023–24 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా జిల్లాకు సీడీపీ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 20 రోజుల క్రితమే ఉత్తర్వులు అందగా, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. వారు చేపట్టే పనులకు ప్రతిపాదనలు పంపించాలని కోరాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిధులు కేటాయింపులు జరుగనున్నాయి. – కొమురయ్య, సీపీవో

ఐకమత్యంతో ముందుకెళ్లాలి



సదస్సులో మున్నూరుకాపు విద్యావంతులు

విద్యానగర్(కరీంనగర్): మున్నూరుకాపులందరూ సంఘటితమై ఐకమత్యంతో ముందుకెళ్లాలని తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ అన్నారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం తెలంగాణ మున్నూరుకాపు కరీంనగర్ ఉమ్మడి జిల్లా విద్యావంతుల ఆత్మీయ సన్నాహక సదస్సు వేల్పుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, సాయం కావాలన్నా తాము సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఆగస్టు 6న కరీంనగర్‌లో పెద్ద ఎత్తున మున్నూరుకాపు విద్యావంతుల సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో నంది శ్రీనివాస్, వీర బుచ్చయ్య, సాయి సరేందర్, బండారి రాజ్‌కుమార్, తోట రమణ, దూలూరి జగన్, కొత్త సత్యనారాయణ, రాసమల్ల సుగుణాకర్, కామినేని మధుసూదన్, ధనపురి సాగర్, లింగారెడ్డి, తిరుమల్, బొబ్బిలి శ్యామ్, వంగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



మోహన్(ఫైల్)

కరీంనగర్‌క్రైం/జూలపల్లి: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండల కేంద్రానికి చెందిన తోట మోహన్ (48) కరీంనగర్‌లో భవన నిర్మాణ కూలీగా పనులు చేస్తున్నాడు. అంబేద్కర్‌నగర్‌లో ఆదివారం ఉదయం ఆసుపత్రి నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో భవనం ఐదవ అంతస్తుకు మెటీరియల్‌ను కింది నుంచి క్రేన్ ద్వారా పైకి తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయాడు. కాళ్లు, తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రి వద్దకు కార్మికులు తరలివచ్చారు. ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులు జోహార, మహేంద్రకు కూడా గాయాలు అయ్యాయి. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోజువారీ కూలీ..

జూలపల్లి మండల కేంద్రానికి చెందిన తోట మోహన్‌ది నిరుపేద కుటుంబం. రోజువారీ కూలీ పనులకు కరీంనగర్‌కు వెళ్లేవాడు. ఆదివారం ప్రమాదవశాత్తు మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య అంజలి, కుమారుడు రవి, కూతురు సన్నిహిత ఉన్నారు. కూతురుకు పెళ్లి కాగా, కుమారుడు జూలపల్లిలోని కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని భవనం నిర్మాణ యజమాని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ షిర్కె క్వార్టర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుద్దపల్లి దినేశ్(30) అనే సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వకీల్‌పల్లిగనిలో లో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న దినేశ్ సెంటినరీ కాలనీ నుంచి తన బైక్‌పై కాలనీ వైపు వస్తుండగా కుమార్ హోటల్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి వాటర్‌బాటిల్ కిందపడి పోతుండగా, పట్టుకోబోయి పడిపోయాడు. తలకు బలంగా తగలడంతో స్పృహ కోల్పోయాడు. టూటౌన్ పోలీసులు, బ్లూ కోర్ట్ సిబ్బంది గమనించి పోలీస్ వాహనంలోనే సింగరేణి డిస్పెన్సరీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించినట్లు టూటౌన్ రెండో సీఐ అష్ఘలోద్దీన్ తెలిపారు. మెరుగైన చికిత్సకోసం దినేశ్‌ను కుటుంబీకులు సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన వివాహిత గంగిపెల్లి కల్పన (30) అదృశ్యమైంది. ఈమేరకు పోలీసులు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన కల్పన శనివారం సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త రాజేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స

కోరుట్ల: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జగిత్యాలలో ఆదివారం ఎమ్మెల్సీ రమణ తండ్రి దశదిన కర్మకు హాజరయ్యారు. హైదరాబాద్ తిరిగి వెళ్తుండగా మెదక్ జిల్లా చేగుంట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. కేటీఆర్ వాహనం ఆపి రోడ్డు ప్రమాద బాధితులను దగ్గరుండి తన వాహనంలో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. కేటీఆర్ వెంట ఉన్న కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గాయపడ్డవారికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం



సాయిరాం (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన మునిగంటి సాయిరాం (22) ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం .. మునిగంటి మంగ– ఎల్లయ్య దంపతులకు సాయిరాం ఒక్కడే కుమారుడు. తీగలగుట్టపల్లిలోని వైన్స్‌లో పనిచేస్తున్న సాయిరాం ఆదివారం రాత్రి 9గంటలకు ద్విచక్ర వాహనంపై చామనపల్లి నుంచి నగునూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో జూబ్లీనగర్ శివారులో వాహనం అదుపు తప్పడంతో చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిరాం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కాగా సాయిరాం ఈ రోజు సాయంత్రమే కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో స్నేహితులతో కలిసి యూట్యూబ్ రీల్స్ చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..



ఘటన స్థలంలో హన్మండ్లు మృతదేహం

కొత్తపల్లి(కరీంనగర్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన ఆదివారం మల్కాపూర్‌లో జరిగింది. పోలీసులు, మృతుడి భార్య శంకరవ్వ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల హన్మండ్లు(75) ఆదివారం ఉదయం మోటార్ సైకిల్‌పై బతికినపెల్లిలో ఉన్న కూతురు ఇంటికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో మల్కాపూర్ గ్రామశివారు డంపింగ్ యార్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో హన్మండ్లు కుడికాలు, తలకు దెబ్బతగిలి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి మృతిపై ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతిచెందగా తండ్రి కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితులు తెలిపిన వివరాలు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లెకు చెందిన బండపెల్లి రాజయ్య కూతురు చైతన్య (23) నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు విరగడంతో నగునూరులోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి రాడ్ అమర్చారు. ఈనేపథ్యంలో కాలుకు అమర్చిన రాడ్‌ను తొలగించుకునేందుకు ఈ నెల 11న ఆస్పత్రిలో చేరిన చైతన్యకు వైద్యులు ఆపరేషన్ చేశారు. అయితే శనివారం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆందోళనకు గురైన తండ్రి రాజయ్య వైద్యులను కలిస్తే డబ్బు డిపాజిట్ చేయాలని చెప్పారు. అదేరోజు రాత్రి 12.40గంటలకు పరిస్థితి విషమించి చైతన్య మృతిచెందగా ఆస్పత్రి యాజమాన్యం పట్టించుకోలేదు. తన కూతురు మృతికి కారణమైన వైద్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాజయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలి



కూరగాయల సాగుపై మహిళలకు వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రశాంతి

- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట(హుజూరాబాద్): గ్రామీణ రైతులకు నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ రైతుల ఆదాయం పెంచే దిశగా కేవీకే పని చేస్తుందని సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే హెడ్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఐసీఏఆర్ 95వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ కేవీకే ద్వారా మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, దిగుబడులు పెంపొందించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించేలా రైతులకు సూచనలు అందిస్తుందన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. రైతులకు సూచనలు, సలహాలతో కేవీకే అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రిటైర్డ్ ఏడీఏ రామచందర్‌రావు, శాస్త్రవేత్తలు ప్రశాంతి, మహేష్, విజయ్, ల్యాబ్ అసిస్టెంట్ సుప్రజ, ఫామ్ మేనేజర్ సింగ్, సిబ్బంది, రైతులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆశ్రయం



బాలుడిని బాలల సంక్షేమ సమితి ముందు హాజరుపరిచిన అధికారులు

కరీంనగర్/కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడులోని బుడగ జంగాలకు చెందిన బాలుడు(11) మే 21న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లో చైల్డ్ లైన్ వారికి దొరికాడు. వారు శ్రీకాకుళం బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) ముందు ప్రవేశపెట్టారు. అనంతరం అక్కడి నుంచి విశాఖపట్నంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహానికి పంపించారు. తర్వాత వసతి గృహం వారు బాలుడి పూర్తి వివరాలు తెలుసుకోగా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు గ్రామానికి చెందినవాడని గుర్తించారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తల్లిదండ్రులు స్పందించకపోవడంతో అప్పటి నుంచి బాలుడు వసతి గృహంలోనే ఉన్నాడు. అనంతరం వసతి గృహం, శ్రీకాకుళం బాలల సంక్షేమ సమితి ద్వారా బాలుడిని కరీంనగర్ బాలరక్ష భవన్‌లోని బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టారు. ఈక్రమంలో సంబంధిత అధికారులు బాలుడి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి వారికి అప్పగించారు. మళ్లీ తల్లిదండ్రుల కోరిక మేరకు బాలుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చదువుల నిమిత్తం కరీంనగర్ చిల్డ్రన్ హోమ్ ప్రశాంత్ భవన్‌లో చేర్పించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, కె.విజయ్‌కుమార్, బి.రాధ, అర్చనరెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శాంత, చైల్డ్ లైన్ 1098 సాయికిరణ్, పుష్పలత, క్రాంతి కిషోర్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఎరుకల కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

హుజూరాబాద్‌రూరల్: ఎరుకల కులస్తుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎరుకల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఎరుకల ఎంపవర్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి రూ.60 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా ఎరుకల కులస్తులు పందుల పెంపకాన్ని సాగిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కూతాడి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు పూదాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యమసారం సంపత్, యూత్ అధ్యక్షుడు కూతాడి కుమారస్వామి తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులం బంగారం రూ.7వేల నగదు అపహరణ



దొంగలు పగులగొట్టిన బీరువా

ధర్మపురి: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. తులం బంగారంతోపాటు వెండి, రూ.7వేల నగదు అపహరణకు గురైంది. పట్టణంలోని కాశెట్టివాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురికి చెందిన శీలం రాజు కొన్నినెలల క్రితం మృతి చెందాడు. అతడి భార్య పద్మ తన ఇద్దరు కుమారులతో కలిసి ఉంటోంది. పెద్ద కుమారుడు కరీంనగర్‌లో చదువుతున్నాడు. అయితే, వారంరోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన చిన్న కొడుకుతో కలిసి స్థానికంగా ఉన్న తన పుట్టింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటితాళం పగులగొట్టి.. తలుపులు తీసి ఉండడాన్ని చూసిన స్థానికులు.. పద్మకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన ఆమె.. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని వస్తువులు, బట్టలు చిందరవందరగా పడిఉన్నాయి. అందులో దాచి ఉంచిన తులం బంగారం, వెండి వస్తువులు, రూ.7వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని వేలిముద్రలు సేకరించింది. జాగిలాలు చోరీ జరిగిన ఇంటి నుంచి జాతీయ రహదారి వరకు వెళ్లి ఆగిపోయాయి.

బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడి మృతి

- సంతాపం తెలిపిన మంత్రి కేటీఆర్



సంజీవ్ (ఫైల్)



పూలమాల వేస్తున్న జిందం కళాచక్రపాణి

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు కొమిరె సంజీవ్‌గౌడ్(43) ఆదివారం ఉదయం మరణించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సంజీవ్ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సంజీవ్ దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్ పార్టీ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య లత, కూతురు స్నేహిత ఉన్నారు. ఇటీవల సిరిసిల్ల పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ అనారోగ్యంతో ఉన్న సంజీవ్ ఇంటికెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం సంజీవ్‌ను హైదరాబాద్ పంపించారు. అయినా సంజీవ్‌ను మృత్యువు కబళించడంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంజీవ్ మృతిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ సంతాపం తెలిపారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సత్తార్ తదితరులు సంజీవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఆగిన పసి హృదయం



సిద్ధు (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): కొడుకును కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేవు. గుండెలో రంధ్రంతో ఏడాది వయస్సు గల కొడుకు చనిపోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని బంజేరు గ్రామానికి కన్నం బాబు–మమత దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఏడాది వయస్సు ఉన్న సిద్ధు సంతానం. సిద్ధు గుండెలో చిన్నరంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చికిత్స కోసం కరీంనగర్, హైదరాబాద్‌లలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించారు. నిరుపేద కుటుంబం అయినప్పటికీ రూ.3లక్షలు అప్పు చేసి చికిత్స చేయించారు. ఆపరేషన్‌కు మరో రూ.6లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో మళ్లీ అప్పు సమకూర్చుకునేందుకు ఇంటికొచ్చారు. శనివారం రాత్రి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడం గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

వారాంతం ఆహ్లాదం.. ఆనందం

- అనుబంధాలకు వేదికగా ఉద్యానవనాలు
- మానసిక ఒత్తిడికి ఉపశమనం
- ఉల్లాసంగా గడుపుతున్న నగరవాసులు



జింకల ఉద్యానవనంలో చిన్నారుల సందడి



కరీంనగర్ అర్బన్: మానసికోల్లాసం కరువవుతోంది. పని ఒత్తిడిలో వివిధ రుగ్మతలకు గురవుతుండగా ప్రకృతే ప్రథమ చికిత్స అని నిపుణులు చెప్పే మాట. అసలే కాంక్రీట్ నగరం తెల్లారితే ఉరుకులు పరుగుల జీవితం, కనీస యోగక్షేమాలు తెలుసుకునే అవకాశం లేకుండా చేసిన పోటీ ప్రపంచం. నిత్యం మానసిక సంఘర్షణ.. పని ఒత్తిడి.. తీరిక లేని విధులు నిత్యగమనంలో భాగమయ్యాయి. మానసిక ప్రశాంతత లేని జీవితం చుక్కాని లేని నావ లాంటిదని ప్రముఖులు ఘోషిస్తున్నా ఆచరణలో అమలు ఆమడదూరం. తల్లిదండ్రుల పరిస్థితి ఇలా ఉంటే పిల్లల పరిస్థితి మరీ ఘోరం. బంధాలు అనుబంధాల మాధుర్యం తెలియదు. నిత్యం పుస్తకాలతో కుస్తీ. వీలు దొరికితే టీవీలకు అతుక్కుపోవడమే. దీంతో చిన్న సమస్య తలెత్తగానే మానసికంగా ఒత్తిడికి గురవ్వడం జీవితం అయిపోయిందన్నట్లు విరుద్ధ ఆలోచనలు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడికి బంధాల ప్రాముఖ్యతకు ఉద్యానవనాలు చక్కని వేదిక. నగరంలో ఇళ్లలో అద్దెకుండే గదులు ఇరుకుగా ఉండటం సమతుల వాతావరణాన్ని ఆస్వాదించే అవకాశం లేకపోవడంతో ఆహ్లాదకర ప్రాంతాలే అనుబంధాలకు అనువని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సెలవు రోజులు రావడమే తరువాయి వారాంతం లేదా మాసాంతంలో ఆహ్లాదకర ప్రాంతాల్లో ఆనందంగా గడుపుతున్నారు.

కిక్కిరిస్తున్న ఉద్యానవనాలు

3 లక్షల జనాభా గల కరీంనగర్‌లో ప్రభుత్వపరంగా ఉన్న ఉద్యానవనం కేవలం ఒకే ఒక్కటి. నగర శివారులో జింకల ఉద్యానవనం అటవీశాఖ నేతృత్వంలో కొనసాగుతుండగా పలు సౌకర్యాలు కల్పించడంతో సందర్శకుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శించే అవకాశం ఉండగా ఇటీవల స్నేహితుల కుటుంబాలు, సహచర ఉద్యోగుల కుటుంబాలు, పనిచేసే దుకాణాలు షోరూంలలోని అందరు కలిసి ఉద్యానవనాల్లో గడుపుతూ ఉల్లాసం పొందుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు విద్యార్థుల నుంచి ఉద్యోగులు, ఉన్నతాధికారులు ఇలా కుటుంబ సమేతంగా పచ్చని ఒడిలో సేద తీరుతున్నారు. ఈ క్రమంలో సామూహిక వన భోజనాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. కొత్త బంధాలను కలుపుకుంటుండగా పిల్లలకు కొత్త స్నేహితులు పరిచయమవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఆడి పాడుతూ ఆనందం పొందుతున్నారు.

ప్రశాంతతకు వేదిక



వారంలో ఒకరోజు పచ్చని వాతావరణంలో గడిపితే మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఎంత ఒత్తిడిలో ఉన్న ఉల్లాసం ఉంటుంది. అందుకే వారంలో ఒకరోజైనా ఉద్యానవనానికి వస్తుంటా. పిల్లలు, కుటుంబానికి సమయమిచ్చినట్లు ఉంటుంది.

– రాకేశ్, ప్రైవేట్ ఉద్యోగి, జ్యోతినగర్

ఉద్యానవనాలను ఏర్పాటు చేయాలి



లక్షల జనాభా గల నగరంలో కేవలం ఒకే ఒక ఉద్యానవనం ఉంది. జనాభాకు అనుగుణంగా పార్క్‌లు పెంచాలి. ఆట పరికరాలను ఏర్పాటు చేయాలి. అరకొర పరికరాలుండటంతో ఆడుకునేందుకు అవకాశం దొరకడం లేదు. శారీరక ధృడత్వం ఆటల వల్లే లభిస్తుంది.

– పింకి, సన్నీ, కట్టరాంపూర్

పిల్లలతో గడిపే అవకాశం



కుటుంబ సమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో గడపడం ఆనందంగా ఉంది. రోజూ పాఠశాలకు వెళ్లడం, రావడం ఇదే దినచర్య. సెలవు రోజుల్లో ఉద్యాన వనాలకు వెళ్తే మానసికంగా ప్రశాంతత దొరుకుతుంది. పిల్లలతో సమయం గడపడంతో పాటు వారిని నాలుగు గోడల మధ్య కాకుండా ప్రకృతిలో తిప్పితే సృజనాత్మకత పెరుగుతుంది.

– పత్తెం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

ఆరోగ్య వాతావరణం



పల్లెటూళ్లలో రోజూ ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుంది కానీ పట్టణాల్లో అలాంటి పరిస్థితి ఉండదు. రోజూ శబ్ద, వాయు కాలుష్యం మధ్య కాలం వెళ్లదీయాలి. కనీసం సెలవు రోజుల్లోనైనా ఆరోగ్యకర వాతావరణం కోసం ఉద్యానవనాలు, డ్యామ్‌ను ఆశ్రయిస్తున్నాం. పిల్లలతో రావడం వల్ల వారికి అనుబంధాల విలువ తెలుస్తుంది. మానసిక స్థైర్యం లభిస్తుంది.

– వినోద, టీచర్, ఎన్టీఆర్ చౌక్

స్నేహితులతో కాలక్షేపం



సెలవు రోజుల్లో అప్పుడప్పుడు జింకల ఉద్యానవనం, డ్యాముకు వస్తుంటాం. కేవలం మా కుటుంబమే కాకుండా స్నేహితుల కుటుంబాలతో రావడంతో కొత్త కొత్త పరిచయాలు ఏర్పడుతున్నాయి. ఉద్యోగమనే కాకుండా కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు అవకాశం దొరకుతుంది. దీనివల్ల అనుబంధాలు బలపడుతాయి.

– సన్నీ, ప్రైవేట్ ఉద్యోగి,

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్(కరీంనగర్): ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్ 47వ డివిజన్‌లో కార్పొరేటర్ షర్ఫొద్దిన్ ఆధ్వర్యంలో సందర్శించి హలాతే హాజీరా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషగా ఉన్నా కరీంనగర్‌లో మాత్రం అమలు కావడం లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరి ద్వారా సత్ఫలితాలు పొందారో మంత్రి గంగుల కమలాకర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ముస్లింలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ముస్లింల ఓట్లు అడిగే అర్హత ఆయనకు లేదన్నారు. 11 ఎకరాల వక్ఫ్ భూమి మంత్రి గంగుల కమలాకర్ ఆధీనంలో ఉందని, ఆ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నాడని అన్నారు. రేకుర్తిలో పేద ముస్లింల ఇళ్లను కూల్చిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పద్మనగర్ పాల డెయిరీ వద్ద 25 ఎకరాల స్థలాన్ని ఈద్గా కోసం కేటాయిస్తే ఆ భూమిలో కేసులు వేయించి ఇబ్బందులు సృష్టించిన వారి గురించి ముస్లిం సమాజం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రెటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి, యూసుఫ్, సయ్యద్ ఖమరుద్దీన్, ఖాజా, కోశాధికారి ఇబ్రహీం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, కార్పొరేటర్లు షర్ఫుద్దీన్, ఆతిన, అలీ బాబా, అజర్ దబీర్‌తోపాటు ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరుద్ర నక్షత్ర పూజ



ఆది శంకరచార్యలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారులు

విద్యానగర్(కరీంనగర్): ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలోని ఆదిశంకరచార్యలకు ఆలయ ధర్మాధికారి, వేదపండుతులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ప్రత్యేక అభిషేకం, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' ప్రదానం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదానం చేస్తున్న అనిల్‌కుమార్‌గౌడ్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరుగుతున్న ఎమ్మెల్యే యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ సందర్శించారు. మ్యాచ్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కుల్దీప్ సింగ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన అవారి రాజయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం 1991–92 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రబృందం రూ.31వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ బోగొండ లక్ష్మిఎలయ్య ద్వారా భార్య లతకు అందించారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు దారం జగన్నాథరెడ్డి, దేవనపల్లి ఆంజనేయులు, తాళ్లపల్లి కనుకయ్య, మెరుగు రాములు, రేగుల తిరుపతి, కొట్టె లింగమూర్తి, వెంకటేశ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 23న జరుగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను విజయవంతం చేయాలని ఎస్సారార్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం కళాశాల మైదానంలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెటా టీఎస్ కోశాధికారి వీరేపాల్‌రెడ్డి, జీఎస్ డైరెక్టర్ గౌతమ్, కోఆర్డినేటర్ వికాస్, మని, ఎస్సారార్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



శ్యాంప్రసాద్‌లాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం 10వ డివిజన్‌లో నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ గంగాధర్, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్‌చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు, పద్మశాలీ సంఘం నాయకులు మెతుకు సత్యం, గడ్డం శ్రీరాములు, సుభాష్, శివ, చంద్రమౌళి, రవి, రాఘవులు, ప్రభాకర్, తిరుపతి, రాజేశ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలీ నాయకులు శ్యాంప్రసాద్‌లాల్‌ను సన్మానించారు.

రైతులకు 24 గంటల కరెంటు బూటకం



కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో లాగ్ బుక్‌లు పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ రైతులకు 24గంటల కరెంటు ఇస్తున్నామన్నది బూటకమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా చేసే లాగ్‌బుక్‌లను పరిశీలించారు. ప్రతీ గంట, రెండు గంటలకు ఓసారి ట్రిప్ అయినట్లు ఎల్సీ పేరు మీద గంటలకు గంటలు సరఫరా నిలిపివేసినట్లు లాగ్‌బుక్‌లో ఉందని అన్నారు. నిబంధనల ప్రకారం ఒక జేఎల్‌ఎంకు 300 సర్వీసులు, ఒక ఏఎల్‌ఎంకు 500 సర్వీసు, లైన్‌మెన్‌కు 3వేల సర్వీసులు ఉండాలని, కానీ ఒక్కో లైన్‌మెన్‌కు పదివేల సర్వీసుల పైనే ఉన్నాయని సిబ్బంది వాపోతున్నారని తెలిపారు. రోజుకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని రైతులను మోసం చేసేది చాలక రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్న బీఆర్‌ఎస్‌నాయకుల బండారం బయట పెట్టేందుకే సబ్‌స్టేషన్‌లో లాగ్‌బుక్ పరిశీలించామన్నారు. సిబ్బందితో సమస్య పరిష్కరించేందుకు ఎక్కువ సమయం పడుతోందని, మెటీరియల్ కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఓఎస్‌ఎం స్టాఫ్ రిక్రూట్‌మెంట్ లేక క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు శ్రవణ్‌నాయక్, ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ చాంద్, మామిడి సత్యనారాయణరెడ్డి, గాదె శివరాం, వనపర్తి నవీన్, రంగానాయక్, షేక్ శేహెన్షా, భారీ, జిలకర రమేశ్, నేహాల్, బషీర్, కీర్తి కుమార్, సోహెల్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన నాయకులు



హైదరాబాద్ తరలివెళ్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగే దళిత ఉపకులాలు–సామాజిక, రాజకీయ చైతన్యం సదస్సులో పాల్గొనేందుకు సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో హైదరాబాద్ తరలివెళ్లారు. బైరి వెంకటేశం వెంట సమితి నాయకులు, సభ్యులు ఉన్నారు.

బోనాలు.. వనభోజనాలు



తీగలగుట్టపల్లిలో బోనాలతో మహిళలు



గుంటూరుపల్లిలో..



గోపాల్‌పూర్‌లో వనభోజనాలకు వెళ్తున్న మహిళలు

కరీంనగర్‌రూరల్: ఆషాఢ మాసం చివరి ఆదివారం కరీంనగర్ మండలంలోని గ్రామాలన్నీ పోచమ్మ బోనాలు, వనభోజనాలతో సందడిగా మారాయి. తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లిలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు పూసాల సంపత్‌కుమార్, నరేశ్, రాజు, లింగయ్య, మల్లీశ్వరీ, అర్చన, కవిత తదితరులు పాల్గొన్నారు. గుంటూరుపల్లిలో జరిగిన పోచమ్మ బోనాల వేడుకల్లో ఉప సర్పంచ్ మాచర్ల సత్యనారాయణ, వార్డుసభ్యురాలు సుజాత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దాది సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ చెట్టి జగన్‌పటేల్, శ్రీనివాస్, రవీందర్, సదానందం, వైజయంతి, కొమురయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. గోపాల్‌పూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి గ్రామాల్లోని పలు కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామశివారుల్లో వంటలు చేసుకుని విందు భోజనాలను ఆరగించి ఆటపాటలతో సందడి చేశారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నందున సోమవారం పద్మనగర్ 33కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్, కుర్మవాడ, శ్రీహరినగర్, పోలీసు ట్రైనింగ్ సెంటర్, మార్కండేయనగర్, ప్రగతినగర్, రాజీవ్ పార్క్, పాత లేబర్ అడ్డా, ఆదిత్య అపార్ట్‌మెంటు ఏరియా, సిద్ధార్థ స్కూల్, వాసర ఆస్పత్రి, ఆకుల శైలజ ఆస్పత్రి, పారమిత స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిత్ర కథ: ఇసుక లారీలతో రోడ్డుపై గుంతలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తిలోని ఇసుక క్వారీ లారీల రాకపోకలతో రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. టీఎస్‌ఎండీసీ ఆధ్వర్యంలో ఏడాదిగా మానేరు వాగు నుంచి ఇసుకను ప్రభుత్వ పనుల కోసం తరలిస్తున్నారు. అయితే లారీల రాకపోకలతో చేగుర్తి, దుర్శేడ్‌లోని బీటీ రోడ్డుకు పలు చోట్ల గుంతలేర్పడి ప్రమాదకరంగా మారాయి. జెడ్పీ పాఠశాలకు వచ్చే విద్యార్థులు లారీలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఇసుక లారీలు రావడంతో గుంతల రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు తగిన చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేస్తామంటూ కొందరు యువకులు గుంతల ఫొటోలను సోషల్‌మీడియాలో పెట్టారు. వెంటనే స్పందించిన కాంట్రాక్టర్ గుంతల్లో మట్టిపోయించడంతో వివాదం సద్దుమణిగింది.

ఆత్మీయ సమ్మేళనం



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలో ఆదివారం పెరిక కుల పట్టణ బంధువుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు లకర్స్ ప్రభాకర్ వర్మ, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లెకు చెందిన అర్షం శ్రీనివాస్, కార్యదర్శిగా అప్పని హరీశ్‌వర్మలు నియమితులయ్యారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాళికాదేవి బోనాల జాతర



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పూజలు చేస్తున్న మంత్రి, మేయర్

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని కిసాన్‌నగర్ 24వ డివిజన్‌లోని ఏకలవ్య కాలనీలో గల శ్రీకాళికామాత ఆలయంలో ఆదివారం కార్పొరేటర్ కుర్ర తిరుపతి ఆధ్వర్యంలో అమ్మవారి బోనాల జాతర నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావులు అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. డివిజన్‌వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి.

ఉరకలేస్తున్న గోదావరి



ధవళేశ్వరం: తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో బ్యారేజీ వద్దకు వచ్చి చేరుతున్న వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 9.70 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 1,25,693 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. నీటిమట్టం ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద 14 అడుగులకు, పోలవరంలో 27.67 మీటర్లకు చేరింది.

బంగాళాఖాతంలో 18న మరో ఉపరితల ఆవర్తనం

సాక్షి, హైదరాబాద్: వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 18న మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలోని ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లో అల్పపీడనం ఏర్పడినట్లు చెప్పింది. రానున్న రెండు రోజుల్లో దక్షిణ వాయవ్య దిశలో ఝార్ఖండ్ మీదుగా కదిలే అవకాశం ఉన్నట్లు వివరించింది. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది.

డ్రోన్ సాగు సూపర్!

▶ మొదటి పేజీ తరువాయి

సేకరించడానికి వీలుగా డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. డ్రోన్లను సరైన తీరులో వినియోగించడం ద్వారా.. సాగులో పురుగు మందులు, ఎరువుల వృథాను అరికట్టవచ్చని, కూలీల కొరతకు చెక్‌పెట్టవచ్చని వర్సిటీ అధికారులు చెప్తున్నారు.

వరిలో విత్తనాలు వెదజల్లేలా..

డ్రోన్ల ద్వారా వరి విత్తనాలను వెదజల్లి సాగు చేసే విధానాన్ని వ్యవసాయ వర్సిటీ అభివృద్ధి చేస్తోంది. దీనిపై పరిశోధన కొనసాగుతోందని, త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తామని వర్సిటీ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం వరి నారు పెంచడానికి కొన్ని రోజులు పడుతుందని, తర్వాత నారు తీసి నాట్లు వేయడానికి సమయం పడుతుందని.. ఇదే సమయంలో కూలీల కొరత, ఖర్చు సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తే బాగుంటుందని, దీనికి డ్రోన్ సాంకేతికతను వినియోగించేలా పరిశోధన చేస్తున్నామని వివరించారు. డ్రోన్‌తో రోజుకు ఏకంగా 30 ఎకరాల్లో ఐదు వరుసల్లో వరి విత్తనాలను వెదజల్లవచ్చని చెప్తున్నారు. దీనివల్ల రైతులకు కూలీల ఖర్చు తగ్గుతుందని, సమయం కలిసివస్తుందని అంటున్నారు. కలుపు మందును కూడా డ్రోన్ల సాయంతో చల్లేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొంటున్నారు.

డ్రోన్లపై శిక్షణ కోసం అకాడమీ

రాష్ట్రంలో నిరుద్యోగులకు, ఆసక్తి కలిగిన వారికి డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని.. ఇందుకోసం డ్రోన్ అకాడమీని నెలకొల్పాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని.. వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర రంగాల్లో డ్రోన్లను ఎలా వాడాలో శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 60ఏళ్ల మధ్య వయసున్న వారికి శిక్షణ అవకాశం ఉంటుందని.. ఇందుకోసం తప్పనిసరిగా పాస్‌పోర్ట్ ఉండాలని, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వెల్లడించారు. ఆరు రోజులపాటు సమగ్రంగా శిక్షణ ఇచ్చేందుకు రూ.45 వేలు ఫీజు ఖరారు చేశారు. ప్రధానంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఉంటుంది.

పురుగు మందులు చల్లడంపై ప్రత్యేకంగా..

రాష్ట్రంలో ప్రధానంగా సాగు చేసే వరి, పత్తి, వేరుశనగ, కంది, పొద్దు తిరుగుడు, ఆముదం, సోయాబీన్ పంటల్లో డ్రోన్ల ద్వారా పురుగు మందులను చల్లడంపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని వ్యవసాయ వర్సిటీ వెల్లడించింది. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించింది. ఉదాహరణకు డ్రోన్ల ద్వారా పురుగు మందు చల్లేటపుడు వాటి రెక్కల నుంచి వచ్చే గాలి వేగానికి వరి చేను విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఎంత ఎత్తు నుంచి డ్రోన్లను ఉపయోగించాలి, ఎంత స్థాయిలో మందును విడుదల చేయాలన్నది నిర్ణయించారు.

- ఇక సాధారణ తైవాన్ స్ప్రేయర్ల ద్వారా



పెద్దపల్లి జిల్లాలో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

ఎకరా పంటకు పురుగుమందు పిచికారీ చేయాలంటే 150 లీటర్ల నుంచి 200 లీటర్ల నీటిని వాడుతారు. అదే డ్రోన్ల ద్వారా అయితే కేవలం 20 లీటర్లతో పిచికారీ చేయొచ్చు. ఒక రోజులో ఏకంగా 30 ఎకరాల్లో మందును చల్లవచ్చు. ప్రత్యేక పరికరాలను అమర్చడం ద్వారా.. కాండం మొదట్లోకి పురుగు మందు చేరేలా చేయవచ్చు.

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తెచ్చిన నానో యూరియాను కూడా డ్రోన్ల ద్వారా పంటలపై చల్లవచ్చని వ్యవసాయ వర్సిటీ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాంగోపాల్ వర్మ తెలిపారు. పురుగు మందులను తక్కువ వ్యవధిలో, పొదుపుగా, సమర్థవంతంగా చల్లడానికి డ్రోన్లతో వీలవుతుందని వివరించారు.

అదనపు పరికరాలను అమర్చి..

పంటలకు డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందులు చల్లడానికి సంబంధించి అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఎందుకంటే కొన్ని పంటలకు పైపైన స్ప్రే చేస్తే సరిపోతుంది. మరికొన్నింటికి కాండం మొదట్లో చల్లాల్సి ఉంటుంది. దీనితో పాటు పంట పరిస్థితి ఏమిటి? ఏవైనా చీడపీడలు ఆశించాయా? అన్నది తెలుసుకునేందుకు ఫొటోలు తీయాలి. వాటిని వ్యవసాయాధికారికి పంపాలి. ఈ క్రమంలోనే ఆయా అవసరాలకు అనుగుణంగా డ్రోన్లకు ప్రత్యేక పరికరాలను అమర్చాలని అధికారులు భావిస్తున్నారు. ఇక పంటల పూత, కాత ఎలా ఉంది? దిగుబడి ఏమేరకు వచ్చే అవకాశం ఉంది వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మస్థాయిలోనూ పర్యవేక్షించేలా డ్రోన్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్లు

రాబోయే రోజుల్లో గ్రామాల్లో సాగు కోసం డ్రోన్ల వినియోగం పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా.. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, దుక్కు దున్నే యంత్రాలు, వరి కోత యంత్రాలు వంటివి ఇవ్వగా.. భవిష్యత్తులో డ్రోన్లను అందజేసేందుకు వ్యవసాయ శాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. ఒక్కో డ్రోన్ ధర రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. వాటిని ఆగ్రోస్ సేవా కేంద్రాల నిర్వాహకులకు సబ్సిడీపై ఇవ్వాలని యోచిస్తున్నారు.

డ్రోన్ల సాగులో దేశానికే మార్గదర్శకంగా..

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి సంబంధించి తెలంగాణ దేశానికే మార్గనిర్దేశం చేస్తోందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. వివిధ పంటల్లో డ్రోన్ల వినియోగం, నిర్వహణకు సంబంధించి జయశంకర్ యూనివర్సిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక (ఎస్‌ఓపీ)నే కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందని అంటున్నారు.

వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై సాధారణ మార్గదర్శకాలివీ..

- నీటి వనరులు, నివాస ప్రాంతాలు, పశుగ్రాసం పంటలు, ప్రజా వినియోగాలు, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ మొదలైన వాటికి దూరంగా డ్రోన్లను వినియోగించాలి.
- డ్రోన్ వాడకానికి సంబంధించి గ్రామ పంచాయతీ, వ్యవసాయ అధికారి కనీసం 24 గంటల ముందుగా అనుమతి ఇస్తారు.
- డ్రోన్ మంచి స్థితిలో ఉందని, సురక్షితంగా ప్రయాణించడానికి సరిపోతుందని ముందే సరిచూసుకోవాలి.
- దానితో పిచికారీ చేసే సమయంలో ఆయా ప్రాంతాల్లోకి జంతువులు, వ్యక్తులు ప్రవేశించకూడదు.
- ఆపరేటర్లు డ్రోన్ ఆపరేషన్, సురక్షితమైన పురుగు మందుల పిచికారీ.. ఈ రెండింటిపై శిక్షణ పొంది ఉండాలి.
- ముందుగానే ప్రతిపాదిత ప్రాంతం, సరిహద్దు, అడ్డంకులు (గోడలు, చెట్లు)ను పరిశీలించి ఆ ప్రకారం డ్రోన్‌ను ఆపరేట్ చేయాలి.
- ప్రభుత్వ సంస్థలు, సైనిక స్థావరాలపై లేదా డ్రోన్లకు అనుమతి లేని జోన్ల మీదుగా ఎగురవేయవద్దు. అనుమతి ఇవ్వని ప్రైవేట్ ఆస్తులపైనా డ్రోన్ ఎగరవేయవద్దు.

నిరుత్సాహపర్చిన బీసీలకు 'లక్ష' సాయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం పంపిణీ పథకం ఆశావహులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద భారీగా దరఖాస్తులు రావడంతో వాటిని పరిశీలించి ప్రతి నెలా 15వ తేదీన విడతల వారీగా సాయం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా తొలివిడత కింద ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా ఆర్థిక సాయానికి ఎంపికైన వారికి చెక్కులు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు చేసిన యంత్రాంగం చివరకు అరకొరగా.. కేవలం పదుల సంఖ్యలోనే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. చాలా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పంపిణీ ఊసే లేకపోగా.. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చోట్ల పరిమితంగా లబ్ధిదారులకు చెక్కులు అందించడంతో ఎంతో ఆశగా సాయంకోసం ఎదురు చూసిన దరఖాస్తుదారులు నిరాశకు గురయ్యారు.

ఎంతమందికి అందాయి..?

బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం కింద రాష్ట్రవ్యాప్తంగా 5.28 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని మండల స్థాయిలో పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో అధికారులు వీలైనన్ని దరఖాస్తులను పరిశీలించి జాబితాలను జిల్లా కలెక్టర్లకు అందించారు. తొలివిడత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ డబ్బుతో ప్రతి అసెంబ్లీ సెగ్మెంటుకు సగటున 335 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున సాయం అందించవచ్చని అంచనా వేశారు. కానీ శనివారం మెజార్టీ సెగ్మెంట్లలో ఈ కార్యక్రమమే నిర్వహించలేదని ఆరోపణలు వస్తున్నాయి. అయితే శాసనసభ్యులకు సమయాభావం వల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేకపోయినట్లు క్షేత్రస్థాయి అధికారులు అధికారులు చెబుతున్నారు. దీంతో 15వ తేదీన జరిగిన కార్యక్రమంలో ఎంత మందికి చెక్కులు పంపిణీ చేశారనే దానిపై అస్పష్టత నెలకొంది. దీంతో మండలాల వారీగా సమాచారాన్ని సేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తొలివిడతలో చేపట్టిన కార్యక్రమంలో పంపిణీ చేసిన చెక్కుల వివరాలపై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని చెపుతున్నారు.

తొలి విడతలో అరకొరగా సాగిన చెక్కుల పంపిణీ

- పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంపిణీ ఊసే లేదు
- రాష్ట్రవ్యాప్తంగా ఎంతమందికి పంపిణీ చేశారనేదానిపై అస్పష్టత
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందంటున్న అధికారులు



అత్యధికం అనర్హులే..!

వెనుకబడిన వర్గాల్లో కులవృత్తులపై ఆధారపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలో స్వీకరించింది. దరఖాస్తుల ప్రక్రియకు తక్కువ సమయం ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో అనూహ్య స్పందన వచ్చింది. అధికారులు వాటి పరిశీలనకు ప్రత్యేక విధానాన్ని అమలు చేసినట్లు తెలిసింది. ప్రతి దరఖాస్తుపై పూర్తిస్థాయి పరిశీలన (360 డిగ్రీలు) విధానంలో ఆరా తీసినట్లు చెపుతున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో మూడోవంతు వాటిని తొలివిడత కింద పరిశీలన చేశారు. ఇందులో మెజార్టీ అర్జీదారులు కులవృత్తులపైనే ఆధారపడకుండా ఇతరత్రా వ్యాపకాలు నిర్వహిస్తున్నట్లు వెలుగు చూసింది. అంతేకాకుండా ఆర్థికంగా బాగా ఉన్న వాళ్లు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడైంది. చాలా మందికి సొంతంగా నాలుగు చక్రాల వాహనాలు, ఇళ్లు, పొలాలు.. తదితరాలున్నాయని తేలింది. ఆదాయపన్ను చెల్లిస్తున్న వాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఈ క్రమంలో మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాల ఆధారంగా పరిశీలించిన దరఖాస్తుల్లోనూ ఇదే తరహాలో పలువురు అనర్హతకు గురైనట్లు తెలిసింది. దీంతో తాము సిఫార్సు చేసిన వారి పేర్లు లేనందున చెక్కుల పంపిణీ విషయంలో వారు ఆసక్తి చూపించలేదని తెలిసింది.

పెరుగుతున్న 'ఎల్లంపల్లి' నీటిమట్టం



మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్టులో నీటిమట్టం 15 టీఎంసీ లకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ఆదివారం 145.98 మీటర్లకు చేరింది. నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 14.850 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి పార్వతి పంప్‌హౌస్ నుంచి 2,610 క్యూసెక్కులు, ఎగువ నుంచి 992 కూసెక్కు ల వరద వస్తుంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులతో ఔట్‌ఫ్లో ఉంది. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

'కుంటాల'కు పర్యాటకుల తాకిడి



జలపాతం వద్ద సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. జలపాతం అందాలను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి సైతం పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో సందడి నెలకొంది. కాగా, ఈ ప్రాంతంలో రక్షణ చర్యలతో పాటు రోప్‌వే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

'కొర్టికల్'కు జలకళ

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొర్టికల్ జలపాతం జలకళ సంతరించుకుంది. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు కాసేపు ఆగి ఆహ్లాదం పొందుతున్నారు. సెల్ఫీలు దిగుతుండగా, మరికొందరు ఈ జలపాతం అందాలను తమ తమ సెల్‌ఫోన్‌లలో బంధిస్తున్నారు.



కొర్టికల్ జలపాతం

ఉప్పొంగిన వాగులు, నదులు



వాగు ఉప్పొంగడంతో దెబ్బతిన్న తాత్కాలిక రోడ్డు

కోటపల్లి: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో రెండు రోజు లుగా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని నక్కలపల్లి బమన్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న గొల్లగట్టు వాగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో తాత్కాలికంగా వేసి న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వెంచపల్లి–రాచర్ల గ్రామాల మధ్య తాత్కాలికంగా వేసిన రోడ్డు పూర్తిగా తెగిపోవడంతో సమీప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తుంది. వెంచపల్లి, జనగామ, ఆలుగామ, సిర్సా గ్రామాల వద్ద నది ఉధృతి ఎక్కువగా ఉంది.

'టమాటా' లోడింగ్‌కు.. ఏడు గంటలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం అదుపుతప్పి టమాటా లారీ బోల్తా పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు అందులోని టమాటాను ఆదివారం అన్‌లోడ్ చేసి మరో వాహనంలో లోడింగ్ చేసేందుకు ఏడు గంటల సమయం పట్టింది. కోలార్ నుంచి ఢిల్లీకి 18 టన్నుల టమాటా లోడ్‌ను లారీలో తరలిస్తుండగా ఘటన చోటు చేసుకున్న విషయం విదితమే. మరో వాహనాన్ని తెప్పించి టమాటాను ఢిల్లీకి తరలించారు. శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు టమాటాకు హైవే పోలీసులు బందోబస్తు నిర్వహించి వారికి సహకరించారు.



టమాటాను అన్‌లోడింగ్ చేస్తూ..

కరెంట్ బిల్లులకు కాసుల్లేవ్

- జాడలేని నిర్వహణ నిధులు
- ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల దుస్థితి

పెండింగ్ బిల్లులు(రూ.లలో)
ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు 90,000
కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు 86,000



ధర్మపురిలోని మంత్రి కొప్పుల ఈశ్వర్ క్యాంపు కార్యాలయం

కోరుట్ల: సుమారు ఐదేళ్లక్రితం రోడ్లు, భవనాల శాఖ నుంచి ఎమ్మెల్యేలకు నియోజకవర్గ కేంద్రాల్లో రూ.కోటి వ్యయం చేసి క్యాంపు కార్యాలయాలు నిర్మించారు. ఏడాదిన్నర వ్యవధిలో భవన నిర్మాణాలు పూర్తిచేశారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో అద్భుతమైన రీతిలో ఆఫీసులు రూపొందించారు. ఎమ్మెల్యేలు తమ సెగ్మెంట్లలో ఉన్నసమయంలో అధికారిక కార్యక్రమాలన్నింటినీ క్యాంప్ ఆఫీసుల్లోనే నిర్వహిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా.. ×అల్లుని నోట్లో శని× చందంగా సుమారు మూడేళ్ల నుంచి ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల నిర్వహణకు ఒక్కరూపాయీ విడుదల కావడంలేదు.

కిందిస్థాయి నాయకులపై భారం..

- ఎమ్మెల్యేల క్యాంపు క్వార్టర్లలో సిబ్బంది, ఇతర అవసరాల సంగతి అలా ఉంచితే.. కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం ఒక్క రూపాయి విడుదల చేయడంలేదు.
- ప్రభుత్వపరమైన అనేక కార్యక్రమాల కోసం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు వినియోగిస్తున్నారు.
- యినా, ఇప్పటివరకు రోడ్ల, భవనాల శాఖ నుంచి బిల్లులు రాలేదు.
- కొన్నిచోట్ల కిందిస్థాయి నాయకులు కరెంట్ బిల్లులు చెల్లిస్తుండగా మరికొన్ని చోట్ల రూ.వేలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల నిర్వహణ నిధుల విడుదల విషయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులకు స్పష్టమైన అవగాహన లేదనే విమర్శలు ఉన్నాయి.

అడిగేవారెవరు?

కరెంటు బిల్లులు చెల్లించేందుకు సర్కారు నుంచి నిధులు రాకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు మింగలేక.. కక్కలేక సతమతమవుతున్నారు. ఒక్క జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోనే కరెంటు బిల్లులు ఇప్పటివరకు బకాయిలు లేవు. రోడ్ల, భవనాల శాఖ నుంచి విద్యుత్ చార్జీలకు సంబంధించిన బిల్లులు మంజూరు కాకున్నా.. అక్కడ బిల్లులు చెల్లింపు సాఫీగా సాగుతోంది. అక్కడ ఎవరోఒకరు బాధ్యత తీసుకుని ఠంచన్‌గా బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని ధర్మపురి, కోరుట్ల ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల బిల్లులు రూ.వేలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు చెల్లించాలని అడగటానికి స్థానిక ట్రాన్స్‌కో అధికారులు చొరవ చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిపాదిస్తాం

జిల్లాలోని మూడుచోట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు సంబంధించిన బిల్లుల స్లిప్పులు మాకు ఇవ్వాలని కోరాం. అవి మాకు అందగానే బకాయిల వివరాలు పరిశీలించి నిర్వహణ చార్జీల కింద మంజూరు చేయడానికి ప్రతిపాదిస్తాం.

– వెంకటరమణ, డీఈ, ఆర్ అండ్ బీ, జగిత్యాల

శరణు..శరణు రాజన్నా





వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ అధికారులు అభిషేకాలకు పరిమిత సంఖ్యలో టోకెన్లు ఇచ్చారు. ఆరుద్ర నక్షత్రోత్సవం సందర్భంగా స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అద్దాల మండపంలో పర్యవేక్షకులు అల్లి శంకర్ ఆధ్వర్యంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు.

రాష్ట్రస్థాయి చెస్‌పోటీల్లో పవన్ ప్రతిభ



ప్రశంస పత్రం అందుకుంటున్న పవన్

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని జగదాంబతండాకు చెందిన అజ్మీరా పవన్‌నాయక్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. కరీంనగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్నాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్–17 చెస్‌పోటీలకు కేంద్రీయ విద్యాలయం నుంచి పవన్‌కు అవకాశం వచ్చింది. ఆటలో అత్యంత ప్రతిభ కనబర్చి ఢిల్లీలో జరుగబోయే జా తీయస్థాయి టోర్నీకి అవకాశం దక్కించుకున్నాడు. పవన్‌ప్రతిభను తండావాసులు అభినందిస్తున్నారు.

సన్నిధి

జీవనం.. జీవితం

ఆచరణల ప్రయోగం, ఆశల ప్రణాళిక, నమ్మకాల ప్రదర్శన, అభిప్రాయాల ప్రకటన, గుణాల ప్రతాపం, భావాల ప్రవాహం, ఆలోచనల ప్రస్థానం మనిషి జీవనం, జీవితం. జీవనం, జీవితం వీటిని మనిషి ఏ మేరకు ఫలవంతం చేసుకుంటున్నాడు? ఎంత సారవంతం చేసుకుంటున్నాడు? తన జీవనం, జీవితం వీటివల్ల మనిషి ఏ మేరకు ఫలవంతం ఔతున్నాడు? ఎంత సారవంతం ఔతున్నాడు? ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన జవాబులు మాత్రమే రావాలి లేదా సాధించుకోవాలి. అందుకనే మనిషికి జీవనం, జీవితం ఉన్నాయి; అందుకనే జీవనం, జీవితం వీటితో మనిషి ఉన్నాడు.

తతోనూ, సరిగ్గానూ ఉండాలి లేదా నాణ్యతతోనూ, సరిగ్గానూ పని చేస్తూ ఉండాలి. మస్తిష్కమూ, మనసూ నాణ్యతతోనూ, సరిగ్గానూ పని చేస్తూ ఉంటే జీవనం, జీవితం ఇవి ఫలవంతమూ, సారవంతమూ ఔతూ మనిషికి మాన్యత వస్తుంది.

పుట్టేశాం కదా అని కాలాన్ని తోసెయ్యడం జీవనం కాదు; కాలంవల్ల తోసెయ్యబడడం జీవితం కాకూడదు. అభిప్రాయాల్నీ, మనోభావాల్నీ పేర్చుకుంటూ పోవడం జీవనం కాదు; వాటినే మోసుకుంటూ వాటి బరువుకు కుంగిపోవడం, నలిగిపోవడం జీవితం కాకూడదు. వాగులో కొట్టుకు పోవడం కొనసాగడం ఔతుందా? ప్రవాహంలో



ఏది మనిషికి విజయం? తన జీవనం, జీవితం ఇవి ఫలవంతమూ, సారవంతమూ అవడమే మనిషికి విజయం. ఫలవంతమూ, సారవంతమూ ఐన జీవనం జీవితానికి విజయం; ఫలవంతమూ, సారవంతమూ ఐతే జీవితానికి జీవనం విజయం'.

మనిషికి జీవనం లేకపోతే జీవితం లేదు; జీవితం లేకపోతే జీవనం లేదు. జీవనం, జీవితం ఈ రెండూ లేకపోతే మనిషి లేడు. ఉన్న మనిషికి ఉండే జీవనం, జీవితం మనిషి సఫలం అయ్యేందుకే కాని విఫలమూ, విధ్వంసమూ అయ్యేందుకు కాదు; విఫలమూ, విధ్వంసమూ చేసేందుకు కాదు.

మనిషి మస్తిష్కం ఆకాశం ఐతే అక్కడ నుంచి నాణ్యమైన, సరైన భావనల వానపడితే ఆ వానకు మనసు తడిస్తే జీవనం పూస్తుంది; జీవితం రూపొందుతుంది. జీవనం, జీవితం ఇవి ఫలవంతమూ, సారవంతమూ అవాలంటే మస్తిష్కమూ, మనసూ నాణ్య

ముందుకు ఈదడమూ, అవసరానికి అనుగుణంగా ప్రవాహానికి ఎదురు ఈదడమూ జీవనం అవుతుంది; నదిలో కొట్టుకు పోవడమా? కాదు, కాదు నదిలా ప్రవహించడం జీవితం ఔతుంది.

రాని పిలుపును విని వడివడిగా వెళ్లడం జీవనం కాదు; లేని చోటును వెతుక్కుంటూ వెళ్లడం జీవితం కాదు. ఉన్న దారిలో లేని తలుపులు మూసుకుని ఉన్నాయి అని అనుకుని ఊరికే పడి ఉండడం జీవనం కాదు; కొండే అడ్డుగా ఉన్నా దారీ, తీరూ మార్చుకుని నీరులా ముందుకు సాగడమే జీవితం.

మనిషికీ

మంచిమాట

జీవితం ఒక గుంటగానూ, ఆ గుంటలో పడిపోయి పరుగెత్తుతూ ఉండడం జీవనంగానూ అవకూడదు. తనను తాను కోల్పోవడం మనిషికి జీవితం అవుతుందా? అవదు, అవదు; తన నుంచి తాను కోలుకోవడం ఏం ఔతుంది? అదే జీవితం ఔతుంది! పోగొట్టుకోవడం జీవనం అవదు అన్న తెలివిడి వస్తే పొందడం అన్నది జీవితం అవుతుంది అని తెలియవస్తుంది మనిషికి.

మనిషి తననుంచి తాను విడివడడం అన్న కళను అభ్యసించి నేర్చుకోవాలి. జన్మతః మనిషికి మానసికంగానూ, చింతనపరంగానూ లోపాలూ, దోషాలూ ఉంటాయి. లోపాలూ, దోషాలూ లేని మనిషి ఉండడం ఉండదు. తన లోపాల్నీ, దోషాల్నీ వదులుకోవడం కోసం మనిషి తన నుంచి తాను విడివడాలి లేదా విడుదల అవాలి. అలా జరిగితే అప్పుడు అది జీవనం ఔతుంది. తనను తాను మాటిమాటికీ సరి చూసుకుంటూ, సరి చేసుకుంటూ తనలోకి తాను చేరుతూ ఉంటే అప్పుడు అది జీవితం ఔతుంది.

జీవితం తనతో ఉన్నప్పుడు మనిషి దాన్ని ఉపయోగించుకోవడం జీవనం; జీవనం ఉపయోగపడడంవల్ల ఉన్నతిని పొందడం జీవితం. జీవనానికి జీవితం ఉండాలి; జీవితానికి జీవనం పండాలి; మహిలో మనిషి మెరవాలి. జీవనమూ, జీవితమూ ఉన్నాయి కాబట్టి మరణించాక కూడా మనిషి పరిమళించాలి.

– రోచిష్మాన్

గురువాణి

సైన్స్ ఆగిపోయిన సమయాన...



ఆపిల్ చెట్టు నుంచి పండు కిందపడిపోతుందని అందరికీ తెలుసు... కానీ అది కిందనే ఎందుకు పడాలి..? అని అడిగిన వాడు సర్ ఐజాక్ న్యూటన్. ఉత్తమమైన ప్రశ్న వేస్తే సారవంతమైన పరిష్కారాలు బయటికి వస్తాయి. భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని, అంతరిక్షంలో గ్రహాల కదలికలకు సంబంధించిన విషయాలను ప్రతిపాదించిన ఆయన అఖండ మేధావి, గణిత, భౌతిక శాస్త్రవేత్త. ''అంతరిక్షంలో గ్రహాలు ఎలా తిరుగుతున్నాయి... అన్న విషయాన్ని ఆకర్షణ సిద్ధాంతం ప్రతిపాదన చేస్తుందనీ, కానీ అక్కడ గ్రహాలు పెట్టిన వారు ఎవరు? అలా పెట్టి వాటిని నియమబద్ధమైన రీతిలో ఇంత వేగంతో ఇలానే కదలాలని నియంత్రిస్తున్నది ఎవరు? ...అన్న విషయాన్ని చెప్పదు'' అని కూడా ఆయన అన్నారు అందుకే పెద్దలు..'' సైన్స్ ఎక్కడ ఆగిపోతుందో... అక్కడ ఆధ్యాత్మికత మొదలవుతుంది '' అంటూంటారు. ఉన్న విషయాన్నే కనుక్కొని ప్రతిపాదిస్తే-డిస్కవరీ, సృష్టిలో ఇతః పూర్వం లేని విషయాన్ని మొట్టమొదటిసారిగా తెలుసుకుంటే - ఇన్వెన్షన్. ఈ రెండింటి ద్వారా నిరూపణచేస్తూ వెడుతుంది సైన్స్. కానీ ఆ సైన్స్ ఎక్కడ ఆగిపోతుందో... అక్కడ వేదాంతం ప్రారంభం అవుతుంది. అదే న్యూటన్ మాటల్లో తెలుస్తున్నది. మంట పైకే రావాలి, కిందకు పోతే ఎవరికీ పనికిరాదు. నీరు కిందకు పోకుండా పైకి వెడితే సృష్టి నిలబడదు. గాలి దానంతట అది కదులుతూ పోతుంటుంది. సముద్రాలు భూమిని పూర్తిగా ముంచెత్తకుండా ఒక హద్దు దగ్గరే ఆగిపోతుంటాయి... ఇవి కంటికి కనిపించే విషయాలే అయినా ఎవరు వాటిని అలా నియంత్రిస్తున్నారు లేదా ఏ శక్తి వాటిని అలా శాసిస్తున్నది అన్న విషయం ఈ భౌతిక నేత్రానికి కనపడేది కాదు. మొగ్గ పువ్వు అవుతుంది. పరిమళం వెదజల్లుతుంటుంది. పువ్వు పిందె అయింది, పిందె కాయ అయింది, కాయ పండు అయింది, గుజ్జు రసమయింది, బాగా పండిన తరువాత చెట్టుకున్న ముచ్చెను వదిలి కిందపడిపోతున్నది.. సూర్యుడు, చంద్రుడు, ఆకాశంలో చుక్కలు... ఇవన్నీ మనకు కనపడేవే... కానీ వాటిని చక్కగా నియమబద్ధంగా చేసి మనకు చూపుతున్న ఆ శిల్పి ఎవరు? ఆయన మాత్రం కనపడడు.

మరి ఆయనను చూడాలని ఉందా!!! ఒక్కటే మార్గం. భక్తి. దీని ద్వారా భారతదేశం సృష్టి రహస్యాలను విప్పి చూపింది... ఎప్పటినుంచో చూపుతూ వస్తున్నది... అందుకే సనాతనమయింది. వేదం ప్రమాణంగా నిర్ణయింపబడింది. అది ఎవరో రచించినది కాదు.. అది ఈశ్వర వాక్కు. భగవద్గీత కూడా అంతే... అందుకే సర్వజనాదరణ పొందింది. సైన్స్ పరిమితులను గురించి న్యూటన్ నిజాయితీగా చెప్పినా గొప్ప మాట చెప్పాడు.

రామకృష్ణ పరమహంస చెప్పినట్లు ... నీటిని ఎవరు ఏ పేరు పెట్టి పిలిచినా, దాహం తీరుస్తుంది... అలా తీర్చడం దాని లక్షణం. సైన్స్ అందుకోలేని లేదా విప్పి చెప్పలేని విషయాలను ఆధ్యాత్మికత జన సామాన్యానికి సులువుగా అందిస్తుంది భక్తి అనే మాధ్యమం ద్వారా.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి


పూర్వం కురు రాజ్యాన్ని ఇంద్రప్రస్థ నగరం రాజధానిగా ధనంజయ కౌరవ్యుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతని ఆస్థాన పురోహితుడు, మంత్రి సుచీరతుడు అనే పండితుడు. ఒకరోజున వారిద్దరూ కూర్చొని పరిపాలన విషయాలు చర్చించుకుంటూ ఉండగా 'ధర్మయజ్ఞం' అనే విషయం చర్చకు వచ్చింది.

''అశ్వమేధం, రాజసూయం, పుత్రకామేష్టి మొదలైన యాగాలు తెలుసు. ధర్మ యాగం ఎలా చేయాలి ఆచార్యా!'' అని అడిగాడు రాజు.

''మహారాజా! నాకూ పూర్తిగా తెలియదు. మన రాజ్యంలో భగీరథీ తీరంలో విదుర పండితుడు ఉన్నాడు. ఆయన సర్వజ్ఞుడు. వెళ్ళి వివరంగా తెలుసుకు వస్తాను. శెలవియ్యండి'' అని అడిగి మరునాడు బయలుదేరి వెళ్ళి విదుర పండితుణ్ణి కలుసుకున్నాడు. విదురుడు తన మిత్రుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు. కుశల ప్రశ్నల తర్వాత తాను వచ్చిన విషయం చెప్పాడు సుచీరతుడు.

అంతలో ఎందరో శిష్యులు ఆయన సందర్శన కోసం వచ్చారు. దానితో ....''మిత్రమా! నేను ఈ సమయంలో ధర్మయాగం గురించి చెప్పలేను. అదిగో.. అక్కడ అడవి సమీపంలో నా పెద్ద కుమారుడు భద్రకారుని ఆశ్రమం ఉంది. అతనూ పండితుడే. వెళ్ళి భద్రకారుణ్ణి అడుగు'' అని చెప్పి పంపాడు. సుచీరతుడు ఆయన వద్దకు వెళ్లి తాను వచ్చిన విషయాన్ని వివరించగా... ''మహాశయా! మీ ప్రశ్నకు సమాధానం చెప్పే యోగ్యత నాకు లేదు. ఇంకా రెండు యోజనాల దూరం ముందుకు వెళ్ళు. అక్కడ నదీతీరంలో ఒక ఆశ్రమం ఉంటుంది. అది నా పెద్ద తమ్ముడు సంజయునిది. అతడు ప్రాజ్ఞుడు. నీకు అతను సమాధానం చెప్తాడు'' అని సగౌరవంగా సాగనంపాడు భద్రకారుడు.

ధర్మ యజ్ఞం



సుచీరతుడు వెళ్ళే సమయానికి సంజయుడు అక్కడ లేడు. తిరిగి వచ్చేసరికి సాయంత్రం అయ్యింది. వచ్చాక, సుచీరతునికి తగు సత్కారాలు చేశాడు. ఆ విషయం తెలుసుకుని–

''సుచీరతా! నేను కూడా దీనికి సమాధానం చెప్పలేను. నిజం చెప్పాలంటే అందుకు తగను. సదాచార భ్రష్టుణ్ణి. ఇందుకు తగినవాడు మా అందరికంటే చిన్నవాడు మా తమ్ముడు సంభవుడు. అతని ఆశ్రమం ఈ పక్కనే ఉంది. వెళ్ళు'' అని మర్యాద పూర్వకంగా చెప్పాడు. సుచీరతుడు మరునాటి వేకువనే లేచి సంభవుని దగ్గరకు వెళ్ళాడు. విషయం అంతా చెప్పాడు.

ఉదయం స్నానాదికాలు పూర్తయ్యాక వారిద్దరూ ఒక మామిడి చెట్టు కింద కూర్చున్నారు.

''సుచీరతా! ధర్మయాగం చేసేవారు ఐదు విషయాలు పాటించాలి. అందులో మొదటిది; ఎప్పుడు చేసే పని అప్పుడే చేయాలి. తరువాత చేయవచ్చులే అని బద్ధకించకూడదు. నిర్లక్ష్యం తగదు. ఈ రెండు లక్షణాల్ని సమయపాలన అనే యజ్ఞగుండంలో కాల్చి బూడిద చెయ్యాలి.

ఇక రెండోది; ఎవ్వరు ఏది చెప్పినా జాగ్రత్తగా వినాలి. విన్న ప్రతిదాన్నీ ఆచరించకూడదు. బాగా ఆలోచించి సరైన వాటిని మాత్రమే ఆచరించాలి.

మూడోది; ఏ విషయంలోనూ హద్దు దాటకూడదు. ప్రకృతిలో ఒక్కో శక్తికి ఒక్కో హద్దు ఉంటుంది. సమాజంలో ఒక్కో వ్యక్తికి ఒక్కో హద్దు ఉంటుంది. అర్హత ఉంటుంది. ప్రతి వారు తమ తమ హద్దులు తెలుసుకోవాలి. ఈ హద్దులు అమానవీయ, అకుశల విషయాల్లో లింగ భేదాల్లో కాదు. మన సామాజిక నైతిక నడవడికలో తండ్రికి, తల్లికి, తనయులకీ, గురువులకీ ఒక్కొక్కరికి ఒక్కో హద్దులుంటాయి. వారి వారి హద్దుల్లో వారికి గౌరవ మర్యాదలు దక్కుతాయి. నైతిక హద్దులు దాటడం చాలా ప్రమాదం.

అలాగే అధర్మ కార్యాలు చేయకూడదు. మనం చేసే పనులు మనకూ, పరులకూ హితాన్ని, సుఖాన్ని ఇవ్వాలి. ఇలా అందరికీ సుఖాన్నిచ్చేవే ధర్మకార్యాలు. అధర్మ కార్యాలు చేసేవారు రేవు కాని చోట నదిలో స్నానానికి దిగిన వారితో సమానం. అది వారికే ప్రమాదం.

ఇక ఐదో విషయం; చెడు తలపులు మానాలి. చెడు చేష్టలే కాదు. చెడ్డ ఆలోచనల్ని మన మనసులోకే రానీయకూడదు. ఒకవేళ వచ్చినా యజ్ఞజ్వాలలో మండించే సమిధల్లా వాటిని కాల్చి బూడిద చెయ్యాలి.

సుచీరతా! ఈ ఐదూ పాటిస్తే అదే ధర్మయాగం. ఈ యాగం చేసినవారు శుక్ల పక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెంది, పున్నమి చంద్రునిలా శోభిల్లుతారు'' అని చెప్పాడు.

సుచీరతుడు ఇంద్రప్రస్థం చేరి ధనంజయ కౌరవ్యునికి ఈ విషయాలు చెప్పాడు.

తన రాజ్యంలో ప్రజలందరూ– 'ధర్మయాగం' చేయవలసిందిగా రాజు చాటింపు వేయించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

మరికొన్ని రోజులు...



● ప్రభాస్

దాదాపు ముప్పై రోజులుగా ఫారిన్ ట్రిప్‌లో ఉన్నారు ప్రభాస్. ఈ ట్రిప్ ఇప్పటికే పూర్తి కావాల్సిందట.. కానీ మరికొన్ని రోజులు ఆయన అక్కడే ఉండనున్నారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశాపటానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ఇది. ఈ సినిమా టైటిల్, ట్రైలర్, సినిమా విడుదల తేదీని 'శాన్ డియాగో కామిక్ కాన్ 2023' వేడుకలో లాంచ్ చేస్తారు. ఈ నెల 20న (భారతీయ కాలమానం ప్రకారం ఈ నెల 21) జరగనున్న ఈ వేడుక కోసం ప్రభాస్ మరికొన్ని రోజులు అమెరికాలోనే ఉండి, ఆ తర్వాత ఇండియాకి తిరిగొస్తారట. అనంతరం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్: సీజ్‌ఫైర్' ప్రమోషన్స్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. ఈ చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. కాగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్'(ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా చేస్తున్నారు ప్రభాస్. అలాగే 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే సినిమాకి ప్రభాస్ పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే.

యాక్షన్ మోడ్



● ఎన్టీఆర్

'దేవర' సినిమా కోసం ఎన్టీఆర్ యాక్షన్ మోడ్ కంటిన్యూ అవుతోంది. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన లెంగ్తీ షూటింగ్ షెడ్యూల్ ముగిసింది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు, ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించారు. పీటర్ హెయిన్స్ కొరియోగ్రఫీ చేసిన ఈ యాక్షన్ ఎపిసోడ్ సముద్రతీరం నేపథ్యంలో ఉంటుందని తెలిసింది. కాగా అతి త్వరలో మరో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారట కొరటాల శివ. సో.. దేవరగా ఎన్టీఆర్ యాక్షన్ మోడ్ మరికొన్ని రోజులు కంటిన్యూ అవుతుందనుకోవచ్చు. కాగా హీరో అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హ 'దేవర' సినిమాలో ఒక పాత్రలో కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కల్యాణ్‌రామ్, కె.హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా 2024 ఏప్రిల్ 5న విడుదల కానుంది.

ప్రత్యేక శిక్షణ.. బాలీవుడ్ స్పై థ్రిల్లర్ 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్న 'వార్ 2' లో తన పాత్ర కోసం ఎన్టీఆర్ స్పెషల్ గెటప్‌లో కనిపిస్తారట. ఇందుకు సంబంధించిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఎన్టీఆర్ ప్రత్యేకమైన శిక్షణ తీసుకోనున్నారని ఇండస్ట్రీ టాక్.

ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్?



● రవితేజ

హీరో రవితేజ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్‌గా చార్జ్ తీసుకునే అవకాశాలు ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. అజయ్‌దేవగన్ హీరోగా రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహించిన 'రైడ్' (2018) సినిమా హిందీలో ఘన విజయం సాధించింది. నిజాయితీ గల ఓ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ అమీ పట్నాయక్ (అజయ్ దేవగన్) తనకు ఎదురైన సవాళ్లను ఏ విధంగా సాల్వ్ చేశాడన్నదే 'రైడ్' కథాంశం. ఈ సినిమా తెలుగులో రీమేక్ కానుందంటూ వార్తలు వచ్చాయి. కొందరు హీరోల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. తాజాగా మరోసారి 'రైడ్' రీమేక్ ప్రస్తావన టాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ రీమేక్‌లో రవితేజ హీరోగా నటిస్తారని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాను నిర్మిస్తుందని టాక్. మరి.. 'రైడ్' రీమేక్‌లో రవితేజ నటిస్తారా? లేదా? తెలియాలంటే వేచి చూడాలి.


నిజమైన వసూళ్లు చెప్పమంటాను!



● కాజోల్

షారుక్ ఖాన్–కాజోల్ బాలీవుడ్ హిట్ పెయిర్. వీరిద్దరి కాంబోలో పలు సినిమాలు వచ్చినా 1995లో వచ్చిన 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' (తెలుగులో ప్రేమించి పెళ్ళాడుతా) సినిమా ఎవర్‌గ్రీన్. అయితే తాజాగా కాజోల్ సరదాగా చేసిన వ్యాఖ్యలపై షారుక్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆమెపై మండిపడుతున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే.. కాజోల్ లాయర్‌గా నటించిన 'ది ట్రయల్' వెబ్ సిరీస్ గత శుక్రవారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. 'ది ట్రయల్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు కాజోల్. 'ఇప్పటికిప్పుడు షారుఖ్ ఖాన్ ఎదురైతే మీరు అడిగే ఒక్క విషయం ఏంటి?' అని విలేకరులు ఆమెను ప్రశ్నించగా..'పఠాన్' సినిమా నిజమైన వసూళ్లు ఎంతో చెప్పమంటాను' అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు కాజోల్. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ ఏడాది జనవరి 25న విడుదలైన 'పఠాన్' సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు చేసిందని యూనిట్ పేర్కొంది. తాజాగా కాజోల్ చేసిన వ్యాఖ్యలతో 'పఠాన్' కలెక్షన్స్ నిజమా? కాదా? అనే సందేహాలు కొందరు వ్యక్తం చేస్తుండగా, షారుక్ ఫ్యాన్స్ మాత్రం కాజోల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారితోషికం ఇవ్వకున్నా నటించేవాణ్ణి – విజయ్ సేతుపతి



''షారుక్ ఖాన్ కోసమే 'జవాన్' చిత్రంలో నటిస్తున్నాను. నాకు ఒక్క రూపాయి పారితోషికం ఇవ్వకపోయినా కూడా ఆయనతో కలిసి నటించేవాణ్ణి'' అన్నారు నటుడు విజయ్ సేతుపతి. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా వైవిధ్యమైన పాత్రలతో దక్షిణాది ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన 'ముంబైకర్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. సంతోష్ శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత నెల (జూన్ 2) విడుదలైంది. ప్రస్తుతం ఆయన షారుక్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వం వహిస్తున్న హిందీ సినిమా 'జవాన్' లో విలన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ–''షారుక్ అంటే నాకు అభిమానం. ఆయన కోసమే 'జవాన్'లో విలన్‌గా చేస్తున్నా. నాకు పారితోషికం ఇవ్వకున్నా ఆయనతో కలిసి నటించేవాణ్ణి'' అంటూ షారుక్ ఖాన్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. 'జవాన్' సినిమా సెప్టెంబర్ 7న విడుదల కానుంది. కాగా త్యాగరాజన్ కుమార్ రాజా దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'సూపర్ డీలక్స్' (2019) లో విజయ్ సేతుపతి నటనపై షారుక్ ఖాన్ గతంలో ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

పల్లెటూరి ప్రేమ కథ



● యష్ రంగినేని

''పల్లెటూరిలో జరిగే ప్రేమ కథే 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఒక అనూహ్య ఘటన వల్ల హీరో, హీరోయిన్ల ప్రేమ కథ ఎలాంటి మలుపులు తిరిగింది? అనే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో, పక్కా వాణిజ్య అంశాలతో తెరకెక్కిన ఈ మూవీ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని నిర్మాత యష్ రంగినేని అన్నారు. చైతన్య రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వం వహించిన 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' ఈ నెల 21న విడుదలఅవుతోంది. చిత్ర నిర్మాత యష్ రంగినేని మాట్లాడుతూ– ''నాకు పాత తెలుగు సినిమాలంటే ఇష్టం. లండన్ వెళ్లినప్పుడు ఎన్టీఆర్‌గారి పాత సినిమాలు చూస్తుంటాను. 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' ని చెందు బాగా తీశాడు. నేను కూడా ఓ పాత్ర చేశాను. విజయ్ దేవరకొండతో మేము నిర్మించిన 'పెళ్ళి చూపులు, డియర్ కామ్రేడ్' సినిమాలను త్వరలో రీ రిలీజ్ చేస్తాం'' అన్నారు.

ఫాంటసీ రెయిన్‌బో



హీరోయిన్ రష్మిక మందన లీడ్ రోల్‌లో నటిస్తున్న తొలి చిత్రం 'రెయిన్‌బో'. మలయాళ నటుడు దేవ్ మోహన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీతో శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్. ప్రకాష్ బాబు, ఎస్ఆర్. ప్రభు తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''రొమాంటిక్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'రెయిన్‌బో'. తమిళనాడు, కొడైకెనాల్ పరిసర ప్రాంతాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. అతిత్వరలోనే సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, కెమెరా: కెఎం భాస్కరన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: తంగ ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరవేంద్రరాజ్ భాస్కరన్.

● రష్మిక మందన

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



● సంజయ్‌రావు, ప్రణవి

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను ఈ నెల 29న విడుదల చేస్తోంది. ''మ్యారేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ కొత్త పాయింట్‌ను ఈ సినిమాలో చర్చించబోతున్నాం. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది. సినిమా హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది. బ్రహ్మాజీ, సప్తగిరి తదితరులు నటించిన ఈ సినిమాకు సహ–నిర్మాతలు: చింతా మెర్వాన్, సీహెచ్ చైతన్య పెన్మత్స, నిహార్ దేవెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



ఆదుకున్న ధనంజయ, మాథ్యూస్

పాకిస్తాన్ జట్టుతో గాలెలో ఆదివారం మొదలైన తొలి టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 65.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 242 పరుగులు సాధించింది. 54 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ లంక జట్టును ఏంజెలో మాథ్యూస్ (64 ; 9 ఫోర్లు), ధనంజయ డిసిల్వా (97 బ్యాటింగ్) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 131 పరుగుల భాగస్వామ్యం జోడించారు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది మూడు వికెట్లు పడగొట్టాడు.



పోరాడి ఓడిన లక్ష్య సేన్

యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ పోరాటం ముగిసింది. అమెరికాలో జరిగిన ఈ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 17-22, 24-22, 17-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్, ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. లక్ష్య సేన్‌కు 3,045 డాలర్ల (రూ. 2 లక్షల 50 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4,900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అల్‌కరాజ్ అద్భుతం

ఆల్ ఇంగ్లండ్ క్లబ్ వేదికపై కొత్త చరిత్ర నమోదైంది. క్లే కోర్టు స్పెషలిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకొని, హార్డ్‌కోర్ట్‌పై తొలి గ్రాండ్‌స్లామ్ సాధించిన తర్వాత ఇప్పుడు గ్రాస్ కోర్టుపై స్పెయిన్ 'బేబీ బుల్' మెరిశాడు. 23 గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ జొకోవిచ్ వరుస విజయాలకు విరామమిస్తూ యువ సంచలనం కొత్త శకానికి నాంది పలికాడు. రెండు పదుల వయసుకే కీర్తి శిఖరంపై నిలిచిన కార్లోస్ అల్‌కరాజ్ అద్భుత ఆటతో ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో విజేతగా నిలిచాడు. ఐదు సెట్‌ల పాటు హోరాహోరీగా సాగిన సమరంలో 'ఆల్‌టైమ్ దిగ్గజం' జొకోవిచ్‌ను 'పచ్చిక' కరిపించి చాంపియన్‌గా అవతరించాడు. వరల్డ్ నంబర్‌వన్‌గా తన అద్వితీయ ఆటను అతను సాధించిన గెలుపు టెన్నిస్‌లో రాబోయే నూతన శకానికి నాంది పలికింది. 24వ టైటిల్‌తో పాటు క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన జొకోవిచ్ ఆఖరి వరకు తన స్థాయికి తగ్గ ఆటతో ప్రయత్నించినా... ఇద్దరి మధ్య ఉన్న '16' ఏళ్ల అంతరం ఆట చివర్లో అతని జోరుకు అడ్డుకట్ట వేసింది. నాదల్ వారసుడిగా గుర్తింపు తెచ్చుకొని పిన్న వయసులోనే పలు రికార్డులకు చిరునామాగా మారిన అల్‌కరాజ్ సగర్వంగా తన రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని ప్రదర్శించాడు.

- 'వింబుల్డన్' విజేతగా స్పెయిన్ స్టార్
- కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్
- హోరాహోరీ ఫైనల్లో ఓడిన జొకోవిచ్

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు


అల్‌కరాజ్		జొకోవిచ్
9	ఏస్‌లు	2
7	డబుల్ ఫాల్ట్‌లు	3
5/19	బ్రేక్ పాయింట్లు	5/15
28/46	నెట్ పాయింట్లు	39/65
66	విన్నర్స్	32
45	అనవసర తప్పిదాలు	40
168	మొత్తం పాయింట్లు	166

లండన్: వింబుల్డన్‌లో వరుసగా 35వ విజయంతో ఐదో టైటిల్, ఓవరాల్‌గా 24వ గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకోవాలనుకున్న నొవాక్ జొకోవిచ్ కోరిక నెరవేరలేదు. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) చేతిలో రెండో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) ఓడిపోయాడు. 4 గంటల 42 నిమిషాల పాటు సాగిన పోరులో అల్‌కరాజ్ 1-6, 7-6 (8/6), 6-1, 3-6, 6-4 స్కోరుతో జొకోవిచ్‌పై నెగ్గాడు. 2022లో యూఎస్ ఓపెన్ సాధించిన అల్‌కరాజ్‌కు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఈ ఏడాది వరుసగా ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి జోరు మీదున్న 36 ఏళ్ల జొకోవిచ్ మూడో గ్రాండ్‌స్లామ్ తుది పోరులో ఓటమితో నిరాశగా నిష్క్రమించాడు. విజేత అల్‌కరాజ్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 25 కోట్ల 29 లక్షలు), రన్నరప్ జొకోవిచ్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ. 12 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

హోరాహోరీగా...

అంచనాలకు తగినట్లుగా జొకోవిచ్ దూకుడుగా ఆటను మొదలు పెట్టాడు. 5-0తో దూసుకుపోయాడు. అదే జోరులో తొలి సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో హోరాహోరీ సమరం సాగింది. అల్‌కరాజ్ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంతో జొకోవిచ్ కూడా ప్రతీ పాయింట్ కోసం శ్రమించాల్సి వచ్చింది. స్కోర్లు 4-4, 5-5, 6-6తో సమమవుతూ వచ్చాయి. టైబ్రేక్‌లో చివరకు బ్యాక్‌హ్యాండ్ విన్నర్‌తో పాయింట్ నెగ్గిన అల్‌కరాజ్ సెట్‌ను గెలుచుకున్నాడు. ఈ సెట్ 85 నిమిషాలు సాగడం విశేషం. ఈ సెట్ నాలుగో గేమ్‌లో 29 షాట్‌ల ర్యాలీతో స్టేడియం హోరెత్తింది.





పట్టు కోల్పోయిన జొకో...

రెండో సెట్ గెలిచిన ఉత్సాహంలో అల్‌కరాజ్ మూడో సెట్‌లో తన జోరును కొనసాగించాడు. 3-1తో అతను ముందంజ వేశాడు. అయితే ఐదో గేమ్ ఈ మ్యాచ్ మొత్తానికే హైలైట్‌గా సాగింది. 27 నిమిషాల పాటు 13 'డ్యూస్'లతో సాగిన ఈ గేమ్‌లో ప్రతీ పాయింట్ కోసం ఇద్దరు ఆటగాళ్లు తీవ్రంగా పోరాడారు. ఈ గేమ్‌ను గెలుచుకొని 4-1తో ఆధిక్యంలో నిలిచిన అల్‌కరాజ్‌కు మరో రెండు గేమ్‌లు గెలుచుకునేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఓడితే టైటిల్ కోల్పోయేస్థితిలో నాలుగో సెట్ బరిలోకి దిగిన జొకోవిచ్ తన స్థాయి ఆటను ప్రదర్శించి సెట్ సాధించాడు. చివరి సెట్‌లో 1-1తో సమంగా నిలిచిన తర్వాత మూడో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆ తర్వాత తన సర్వీస్‌లను నిల బెట్టుకొని అల్‌కరాజ్ విజయం ఖరారు చేసుకున్నాడు.

జ్యోతికి రజతం... జ్యోతికశ్రీకి కాంస్యం

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడో స్థానం

బ్యాంకాక్: ప్రతిష్టాత్మక ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ తమ రెండో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో భారత్ 6 స్వర్ణాలు, 12 రజతాలు, 9 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 27 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. 2017లో భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ అత్యధికంగా 29 పతకాలతో అగ్రస్థానంలో నిలువగా... 1989, 1985 ఆసియా చాంపియన్‌షిప్‌లలో 22 పతకాల చొప్పున సాధించింది.

చివరిరోజు ఆదివారం భారత అథ్లెట్లు 13 పతకాలు సొంతం చేసుకున్నారు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు జ్యోతి యర్రాజీ రజతం, దండి జ్యోతికశ్రీ కాంస్య పతకం సాధించారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం నెగ్గి చరిత్ర సృష్టించిన జ్యోతి యర్రాజీ 200 మీటర్ల విభాగంలో రజతం గెలిచింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 23.13 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది.





మహిళల 4x400 మీటర్ల రిలేలో దండి జ్యోతికశ్రీ, హీనా మలిక్, ఐశ్వర్య మిశ్రా, శుభ వెంకటేశన్ బృందానికి కాంస్య పతకం దక్కింది. జ్యోతికశ్రీ బృందం 3 నిమిషాల 33.73 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచింది. పురుషుల 4x400 మీటర్ల రిలేలో అమోజ్ జేకబ్, అజ్మల్, మిజో కురియన్, రాజేశ్‌లతో కూడిన భారత బృందం (3ని:01.80 సెకన్లు) రజతం సాధించింది. మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో అభా ఖతువా (భారత్) ఇనుప గుండును 18.06 మీటర్ల దూరం విసిరి జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకం గెలిచింది. మహిళల 5000 మీటర్ల రేసులో పారుల్ చౌదరీ (15ని:52.35 సెకన్లు) రజతం, అంకిత (16ని:03.33 సెకన్లు) కాంస్యం నెగ్గారు. పురుషుల 5000 మీటర్ల విభాగంలో గుల్‌వీర్ సింగ్ (13ని:48.33 సెకన్లు) కాంస్యం సాధించాడు. పురుషుల జావెలిన్ త్రోలో డీపీ మనూ (81.01 మీటర్లు) రజతం దక్కించుకున్నాడు. పురుషుల 800 మీటర్లలో కిషన్ కుమార్ (1ని:45.88 సెకన్లు), మహిళల 800 మీటర్లలో కేఎం చందా (2ని:01.58 సెకన్లు) రజత పతకాలు నెగ్గారు. పురుషుల 20 కిలోమీటర్ల నడకలో వికాశ్ సింగ్ (1గం:29ని:32 సెకన్లు) కాంస్యం, మహిళల 20 కిలోమీటర్ల నడకలో ప్రియాంక గోస్వామి (1గం :34ని:24 సెకన్లు) రజతం గెలిచారు.

భారత మహిళల జట్టుకు షాక్

వన్డేల్లో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఓటమి

మిర్పూర్: భారత మహిళల జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో రెండు వరుస టి20లను గెలిచి సిరీస్‌ను చేజిక్కించుకుంది. తర్వాత ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకొని ఆఖరి టి20లో ఘోరంగా ఓడింది. తాజాగా ఆదివారం మొదలైన వన్డే సిరీస్‌లో అదే ధోరణి కొనసాగించి మరో ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 40 పరుగుల తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం సిరీస్‌లో 0-1తో వెనుకబడింది. వర్షంతో 44 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బంగ్లా 43 ఓవర్లలో 152 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (39; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

భారత బౌలర్లలో అమన్‌జోత్ కౌర్ (4/31) రాణించగా, దేవిక వైద్యకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత సులువైన లక్ష్యమే ఎదురైనా బ్యాటర్ల నిలువెత్తు నిర్లక్ష్యం భారత మహిళల జట్టును 35.5 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూల్చింది. ఈ మ్యాచ్‌కు ముందు బంగ్లాదేశ్‌తో ఆడిన ఐదు వన్డేల్లోనూ నెగ్గిన భారత్ తొలిసారి ఓటమి చవిచూసింది. దీప్తి శర్మ చేసిన 20 పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోరంటే మన మహిళల జట్టు వైఫల్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. స్టార్ స్మృతి మంధాన (11), హర్మన్‌ప్రీత్ (5), జెమీమా (10) అంతా పెవిలియన్ బాట పట్టారు. వన్డే క్రికెట్లోనూ అరంగేట్రం చేసిన ఆంధ్ర అమ్మాయి బారెడ్డి అనూషకు వికెట్ దక్కలేదు. బ్యాటింగ్‌లో 2 పరుగులు చేసి రనౌటైంది.



సౌత్ జోన్ ఖాతాలో దులీప్ ట్రోఫీ

- 13 ఏళ్ల తర్వాత మళ్లీ టైటిల్
- ఫైనల్లో వెస్ట్ జోన్‌పై విజయం

బెంగళూరు: సౌత్ జోన్ గతేడాదే దులీప్ ట్రోఫీని ఎగరేసుకుపోదామనుకుంటే వెస్ట్ జోన్ జట్టు అడ్డుకుంది. ఇప్పుడు అదే వెస్ట్ జోన్‌ను... చతేశ్వర్ పుజారా, సూర్యకుమార్ యాదవ్, పృథ్వీ షాలున్న గట్టి జట్టుకు షాక్ ఇచ్చి గత ఫైనల్ పరాజయానికి సౌత్ జోన్ బదులు తీర్చుకుంది. ఈ సీజన్ 'దులీప్ ట్రోఫీ'ని హనుమ విహారి సారథ్యంలోని సౌత్ చేజిక్కించుకుంది. ఫైనల్లో 75 పరుగుల తేడాతో వెస్ట్‌జోన్‌పై ఘనవిజయం సాధించింది. 13 ఏళ్ల తర్వాత ఈ దేశవాళీ టోర్నీని మళ్లీ ముద్దాడింది. సౌత్‌కిది 14వ టైటిల్. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో 298 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో... ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 182/5తో ఆట కొనసాగించిన వెస్ట్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 84.2 ఓవర్లలో 222 పరుగుల వద్ద ఆలౌటైంది. ఐదో రోజు ఆట మొదలైన కాసేపటికే కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ (95; 11 ఫోర్లు) వెనుదిరగడంతో సౌత్ విజయం లాంఛనమైంది. లోయర్ ఆర్డర్, టెయిలెండర్లలో ధర్మేంద్రసింగ్ జడేజా (15; 2 ఫోర్లు) మినహా ఇంకెవరూ కనీసం 10 పరుగులైనా చేయలేకపోయారు. వైశాక్, సాయికిషోర్‌లకు చెరో 4 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో వెస్ట్ వెన్ను విరిచిన విద్వత్ కావేరప్ప (7/53)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.


దులీప్ ట్రోఫీతో కెప్టెన్ విహారి

విద్య, ఉద్యోగ సమాచారం

భారత వాయుసేనలో అగ్నివీర్ నియామకాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత వాయుసేన.. అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలచేసింది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్(సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు)/ఇంటర్ ఒకేషనల్ లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్ /ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్ /ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫేజ్-1(ఆన్‌లైన్ రాతపరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ట్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 27.07.2023.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువుతేది:** 17.08.2023.
» **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం:** 13.10.2023.
» **వెబ్‌సైట్:**https://agnipathvayu.cdac.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 14 ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో ఆఫీసర్ స్కేల్ 2, 3, 4, 5 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** ఏజీఎం-బోర్డ్ సెక్రటరీ-కార్పొరేట్ గవర్నెన్స్-01, ఏజీఎం-మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఎంఐఎస్)-01, చీఫ్ మేనేజర్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఎంఐఎస్)-01, చీఫ్ మేనేజర్, మార్కెట్ ఎకనామిక్ అనలిస్ట్-01, చీఫ్ మేనేజర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆడిట్-01, ఎకనామిస్ట్-02, మెయిల్ అడ్మినిస్ట్రేటర్-01, ప్రొడక్షన్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్ ఫర్ ఈఎఫ్‌టీ స్విచ్-02, ప్రొడక్షన్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్ ఫర్ యూపీఐ స్విచ్-04.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఎస్, సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు స్కేల్-3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230, స్కేల్-2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.69,810, స్కేల్-4 పోస్టులకు రూ.76,010 నుంచి రూ.89,890, స్కేల్-5 పోస్టులకు రూ.89,890 నుంచి రూ.1,00,350.
» **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 400 స్కేల్2, స్కేల్3 ఆఫీసర్ పోస్టులు

పుణె ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో ఆఫీసర్ స్కేల్ 2, 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 400
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ స్కేల్3-100, ఆఫీసర్ స్కేల్2-300.
» **అర్హత:** 60శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ లేదా సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ఆఫీసర్ స్కేల్-3 పోస్టులకు 25 నుంచి 38 ఏళ్లు. ఆఫీసర్ స్కేల్-2 పోస్టులకు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు స్కేల్-3 పోస్టులకు రూ.63,840 నుంచి రూ.78,230. స్కేల్-2 పోస్టులకు రూ.48,170 నుంచి రూ.68,810.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రీసెర్చ్ పోస్టులు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్.. తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్-01, రీసెర్చ్ అసిస్టెంట్-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ,ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** రీసెర్చ్ అసోసియేట్‌కు 40 ఏళ్లు, రీసెర్చ్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.35,000, రీసెర్చ్ అసిస్టెంట్‌కు రూ.20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.07.2023.
» **వెబ్‌సైట్:** uohyd.ac.in

గ్రూప్-2.. సక్సెస్ ప్లాన్

» ఆగస్ట్ 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు
» పోటీలో అయిదున్నర లక్షల మంది అభ్యర్థులు
» నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే విజయం

గ్రూప్-2 సర్వీసెస్ పరీక్ష..! తహశీల్దార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఏసీటీఓ.. వంటి క్రేజీ పోస్టులు ఉండే సర్వీసు! గెజిటెడ్ ర్యాంకుతో కొలువు ఖరారు చేసే పరీక్ష! అన్నింటికీ మించి సర్కారీ కొలువు సొంతం చేసుకునే అవకాశం! అందుకే గ్రూప్ 2కు లక్షల మంది పోటీపడుతుంటారు. తెలంగాణలో గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను మరింత పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. పరీక్ష తేదీలు సమీపిస్తుండడమే! ఆగస్ట్ 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ సన్నాహకాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో.. గ్రూప్ 2లో విజయానికి ప్రిపరేషన్ ప్లాన్..

మొత్తం 783 పోస్టులకు 5,51,943 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అంటే.. ఒక్కో పోస్ట్‌కు 705 మంది పోటీ ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ స్థాయి పోటీలో నెగ్గాలంటే.. అభ్యర్థులు పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

సిలబస్‌కు సరితూగే

గ్రూప్-2 అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో..ఇప్పటివరకు చదివిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇప్పుడు కొత్త పుస్తకాల జోలికి వెళ్లకుండా.. సిలబస్‌కు సరితూగే పరిమిత పుస్తకాలను మాత్రమే చదవాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలున్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు. అదే విధంగా అకాడమీ పుస్తకాలను చదవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్2లో విజయానికి విశ్లేషణాత్మక అధ్యయనం ముఖ్యం. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. కాని అన్ని కోణాల్లో అవగాహన ఉంటేనే సమాధానాలు గుర్తించగలిగేలా ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి ప్రస్తుత సమయంలో డిస్క్రిప్టివ్ విధానంలో చదువుతూ.. ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివేలా సమయ పాలన పాటించాలి.

కామన్ టాపిక్స్

అభ్యర్థులు కామన్ టాపిక్స్‌ను ఒకే సమయంలో చదివేలా ప్లాన్ చేసుకోవాలి. పరీక్ష సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లలోని ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్; భారత రాజ్యాంగం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అన్ని అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

ఏదీ వదలకుండా

ఇప్పటి వరకు ప్రిపరేషన్‌ను పూర్తి చేసే క్రమంలో ఏమైనా టాపిక్స్ వదిలేస్తే వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించి తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే టాపిక్స్‌ను లోతుగా చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.

సొంత నోట్స్

అభ్యర్థులు ఇంతకాలం రాసుకున్న సొంత నోట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యమైన అంశాలు, పాయింట్లతో రాసుకున్న నోట్స్‌ను పదే పదే చదువుతూ ముందుకు సాగాలి. మతాలు,సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

ప్రభుత్వ విధానాలు

- రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం ప్రభుత్వ విధానాలపై ప్రచురితమైన అధికారిక డాక్యుమెంట్లను పరిశీలించాలి. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు రూపొందించారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి.
- తెలంగాణ ఏర్పాటుకు ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు.. నిధులు.. నియామకాలు.. వంటి వాటిపై ఎలాంటి విధానాలు తెచ్చారో తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన పాలసీలపై అవగాహన పెంచుకోవాలి. ఎస్సీలు,ఎస్టీలు,మహిళలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనులకు సంబంధించి తెచ్చిన పథకాలను అధ్యయనం చేయాలి.



పేపర్-4కు ప్రత్యేకంగా

గ్రూప్-2 అభ్యర్థులు పేపర్-4పై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. ఇందులో 'తెలంగాణ ఆలోచన (1948-1970), ఉద్యమ దశ(1971-1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991-2014)).. అని మూడు దశలను పేర్కొన్నారు. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం- 1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకూ జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు -వాటి సిఫార్సులపై పట్టు సాధించాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణకు కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

'స్పెషల్' ఫోకస్

తెలంగాణ ప్రత్యేక అంశాలను చదివేటప్పుడు.. తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీ పేరుతో ప్రత్యేకంగా ఉన్న టాపిక్స్‌ను మరింత లోతుగా అధ్యయనం చేయాలి. చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు-రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు-వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు-పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యమున్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం-విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపైనా అవగాహన అవసరం. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు-ఉత్పాదకతతోపాటు, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన పెంచుకోవాలి. తాజా బడ్జెట్ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులపై పట్టు సాధించాలి.

రివిజన్.. రివిజన్

గ్రూప్-2 అభ్యర్థులు పునశ్చరణకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని గ్రహించాలి. పరీక్ష తేదీలకు కనీసం పది రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కు సమయం కేటాయించుకోవాలి. రివిజన్ సమయంలో షార్ట్ నోట్స్, సొంత నోట్స్‌లను అనుసరించాలి. దీంతోపాటు ప్రీవియస్ పేపర్స్, ప్రాక్టీస్ పేపర్స్ సాధన కూడా గ్రూప్2 పరీక్షలో విజయానికి దోహదం చేస్తుంది.

గ్రూప్-2 పరీక్ష ఇలా..

పేపర్	సబ్జెక్ట్	ప్రశ్నలు	మార్కులు
1	జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్	150	150
2	హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ 1) సోషియో కల్చరల్ హిస్టరీ ఆఫ్ ఇండియా, తెలంగాణ 2) భారత రాజ్యాంగ సమీక్ష, రాజకీయాలు 3) సామాజిక స్వరూపం, సమస్యలు, పబ్లిక్ పాలసీలు	150	150
3	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ 1) ఇండియన్ ఎకానమీ: సమస్యలు, సవాళ్లు 2) ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ 3) అభివృద్ధి సమస్యలు, మార్పు	150	150
4	తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం 1) ఐడియా ఆఫ్ తెలంగాణ(1948-1970) 2) మొబిలైజేషన్ దశ (1971-1990) 3) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశ (1991-2004)	150	150
మొత్తం		600	600

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	502	66,061
నిఫ్టీ ▲	151	19,565

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,114	▽	25
డోజోన్స్	34,509	▲	114
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,435	▽	6
డాక్స్	16,105	▽	36
షాంఘై	3,237	▲	1
నికాయ్	32,391	▽	28

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఇంటి రుణ భారం తగ్గే దారేది..!

ఇంటిని కొనుగోలు చేయడం ప్రతి ఒక్కరి జీవితంలో అదిపెద్ద ఆర్థిక లక్ష్యం. ఇందుకోసం భారీ మొత్తం అవసరంపడుతుంది. ఎన్నో ఏళ్లపాటు కష్టార్జితాన్ని పొదుపు, మదుపు చేసి ఇల్లు కొనుక్కోవడం ఒక మార్గం అయితే, 20-25 ఏళ్ల కాలానికి రుణం తీసుకుని ఇంటిని సమకూర్చుకోవడం రెండో మార్గం. రెండు దశాబ్దాల క్రితం అయితే ఎక్కువ మంది జీవితాంతం కష్టపడి పొదుపు చేసి ఇంటిని సమకూర్చుకునే వారు. కానీ, ఇందులో మార్పు వచ్చింది. రుణం మార్గంలో చిన్న వయసులోనే సొంతింటివారయ్యే అవకాశం ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. కానీ, ఇదేమంత చిన్న విషయం కానే కాదు. తీసుకున్న అసలు రుణాన్ని, వడ్డీ సహా చెల్లించుకోవాలి. పైగా రుణం ఎంత ఇవ్వాలి, ఎంత వడ్డీ, ఎన్నేళ్ల కాల వ్యవధి అనే అంశాలను రుణమిచ్చే సంస్థే నిర్ణయిస్తుంటుంది. ఈ విషయంలో రుణదాతకు ఉన్న స్వేచ్ఛ తక్కువ. అందుకే రుణంపై ఇంటిని సమకూర్చుకునే వారు తప్పకుండా కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. దీర్ఘకాలం పాటు రుణ బాధ్యత మోయకుండా, ఆ భారాన్ని దింపుకునే, తగ్గించుకునే మార్గాల గురించి తెలుసుకోవాలి.

20 ఏళ్ల కాలానికి రెట్టింపు చెల్లింపు ● అసలు ఎంతో.. వడ్డీ అంతే ● వీలైనప్పుడు ముందస్తు చెల్లింపులు
నిర్ణీత గడువు కంటే ముందే గుడ్‌బై ● దీనివల్ల వడ్డీలో గణనీయమైన ఆదా





ఇంటి రుణంపై చెల్లించే ఈఎంఐ ఓ సగటు మధ్య తరగతి కుటుంబానికి చాలా పెద్ద మొత్తమే అవుతుంది. నెలవారీ ఆర్జనలో 30–40 శాతం వరకు ఉండొచ్చు. 20 ఏళ్ల కాలానికి గృహ రుణం తీసుకున్నారని అనుకుంటే.. గడువు పూర్తయ్యే నాటికి రుణదాత చెల్లించే మొత్తం రెట్టింపు అవుతుంది. అంటే తీసుకున్న రుణం ఎంతో, అంత మేర వడ్డీ కూడా ఇక్కడ చెల్లించాల్సి వస్తుంది. కానీ, ఆర్థిక కోణం నుంచి చూస్తే ఇదేమంత లాభదాయక విషయం కాదన్నది వాస్తవం. ఇంటి రుణం విషయంలో కొంత లాభపడాలంటే ఆ రుణాన్ని వీలైనంత తొందరగా ముగించేయడం మెరుగైన ఆలోచన అవుతుంది.

'రుణ' వాటా తగ్గాలి

ఇంటిని కొనుగోలు చేసే వారు రుణాన్ని వీలైనంత తక్కువకు పరిమితం చేసుకోవాలన్నది ప్లాన్ రూపీ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు అమోల్ జోషి సూచించారు. అంటే రుణం వీలైనంత తక్కువగా ఉండాలి. కానీ, ఆచరణలో ఎక్కువ కేసుల్లో దీనికి విరుద్ధంగా జరుగుతుందంటున్నారు అమోల్ జోషి. ''ఇంటి రుణం తీసుకునే వారు సరిపడా సైజు, చక్కని వసతులు వంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. దీనివల్ల వారు తీసుకోవాల్సిన రుణం మొత్తం పెరిగిపోతుంటుంది''అని జోషి వివరించారు. కానీ, రుణం వస్తుంది కదా అని ఖరీదైన ఇంటిని సులభంగా కొనుగోలు చేయడం కాకుండా, తిరిగి నెలవారీ ఎంత మేర చెల్లించాల్సి వస్తుందన్నది కూడా పట్టించుకోవాలి. ఒక వ్యక్తి 20 ఏళ్ల కాలానికి గృహ రుణం తీసుకున్నారని అనుకుంటే.. 8.5 శాతం వార్షిక వడ్డీపై 20 ఏళ్లకూ కలిపి అసలుకు సరిపడా వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు రూ. కోటి రుణం తీసుకుంటే 8.5 శాతం రేటుపై, 20 ఏళ్లలో రూ.1.08 కోట్లను వడ్డీ రూపంలోనే చెల్లించాల్సి వస్తుంది.

వడ్డీ భారం తగ్గాలంటే..?

పైన చెప్పుకున్నట్టు అసలుకు సమానంగా వడ్డీ చెల్లించకూడదని మీరు కోరుకునేట్టు అయితే, రుణాన్ని నిర్దేశిత గడువు కంటే ముందుగానే చెల్లించేసేలా ప్రణాళిక ప్రకారం నడుచుకోవడం చక్కని మార్గం. అది కూడా రుణాన్ని తీసుకున్న తొలినాళ్లలోనే ముందస్తు అదనపు చెల్లింపులను ప్రారంభించాలి. ఎందుకంటే ఆరంభంలోనే రుణంపై వడ్డీ భారం ఎక్కువ పడుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ వడ్డీ భారం తగ్గుతూ, అసలులో ఎక్కువ జమ అవుతుంది. పైన చెప్పుకున్న ఉదాహరణలో రూ.కోటి రుణాన్ని తీసుకున్న మూడేళ్ల తర్వాత నుంచి నెలవారీ ఈఎంఐకి అదనంగా ముందస్తు చెల్లింపులు మొదలు పెట్టి.. రుణాన్ని 14–15 ఏళ్లలోనే తీర్చేసేట్టు అయితే, రూ.20–25 లక్షల వరకు వడ్డీ రూపంలో ఆదా చేసుకోవచ్చు. అలా కాకుండా అదనపు ముందస్తు చెల్లింపులను జాప్యం చేశారనుకుంటే.. పదో ఏట తర్వాతే మొదలు పెట్టేట్టు అయితే అప్పుడు వడ్డీ రూపంలో ఆదా చేసుకునేది స్వల్పంగానే ఉంటుంది. అందుకే రుణం తీసుకున్న తర్వాత వీలైనంత ముందుగా అదనపు చెల్లింపుల మార్గాలను అన్వేషించుకోవాలి. ''వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలోనే ఉన్నాయి. ఇంకొంత పెరిగే అవకాశాలు లేకపోలేదు. కనుక వడ్డీ భారాన్ని వీలైనంత తగ్గించుకునేందుకు ముందస్తు చెల్లింపులు మంచి ఆప్షన్ అవుతుంది. ఒకవేళ వడ్డీ రేట్లు ఇక్కడి నుంచి తగ్గుముఖం పడితే ముందస్తు చెల్లింపుల రూపంలో వడ్డీని మరింత మేర ఆదా చేసుకున్నట్టు అవుతుంది''అని సృజన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వ్యవస్థాపక భాగస్వామి దీపాలి సేన్ సూచించారు. ముందస్తు చెల్లింపుల్లో మరో ఆప్షన్‌ను కూడా పరిశీలించొచ్చు. ఈఎంఐ రుణ కాలవ్యవధి అంతటా మారకుండా స్థిరంగా ఉంటుంది. కానీ, వేతన జీవి ఆదాయం ఏటా పెరుగుతూ వెళుతుంది. దీనికి తగ్గట్టుగా రుణ ఈఎంఐని ఏటా పెంచుకుంటూ, మధ్యలో అదనంగా సమకూరే మొత్తాన్ని కూడా ముందస్తు చెల్లింపులకు వినియోగించుకుంటే, 20 ఏళ్ల రుణాన్ని 10 ఏళ్లలోనే ముగించేయవచ్చు. దీనివల్ల వడ్డీ రూపంలో గణనీయమైన మొత్తం ఆదా అవుతుంది. ఏటా ఈఎంఐ పెంచుకోవడాన్ని స్టెపప్ ఈఎంఐగా చెబుతారు. పెరిగే వేతనాలు, బోనస్‌లను ఇందుకు వినియోగించుకోవాలి.



వీలైనంత ముందుగా..

నిర్ణీత గడువు కంటే ముందుగానే గృహ రుణాన్ని వదిలించుకోవడం వల్ల వడ్డీ రూపంలో పెద్ద మొత్తమే ఆదా అవుతుందని స్పష్టంగా తెలుస్తోంది. కనుక దీన్ని విస్మరించకూడదు. అయితే, రుణ గ్రహీత చెల్లింపుల సామర్థ్యమే అంతిమంగా దీన్ని నిర్ణయిస్తుంది. భారతీయుల్లో ఎక్కువ మంది దీర్ఘకాలం పాటు రుణ భారాన్ని మోయడానికి ఇష్టపడని వారేనని నిపుణులు సైతం చెబుతున్నారు. ''పదేళ్ల క్రితం వరకు ఎక్కువ శాతం రుణాలు ఏడు నుంచి 9 ఏళ్ల మధ్యలోనే ముగించినట్టు మా డేటా తెలియజేస్తోంది. కాకపోతే ముందస్తుగా రుణాన్ని తీర్చేయడం అన్నది ఇప్పుడు 9–12 ఏళ్లకు మారింది. భారత్‌లో ఎక్కువ మంది రుణాల విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు''అని మార్ట్‌గేజ్ వరల్డ్ సీఈవో విపుల్ పటేల్ తెలిపారు. ఏక మొత్తంలో కొంత రుణాన్ని తీర్చి వేయడానికి సాధారణంగా మూడు నుంచి ఐదేళ్ల అయినా వ్యవధి అవసరం పడొచ్చు. ఎందుకంటే ఎంతో కొంత సమకూర్చుకోవడానికి ఇంత మేర కాల వ్యవధి అవసరం కనుక. ఏటా ఈఎంఐను పెంచుతూ చెల్లించడం ఒక ఆప్షన్ అయితే, మధ్యలో వచ్చే బోనస్, ఇతరత్రా వెసులుబాటు లభించినప్పుడు అదనంగా ఒకే విడత చెల్లించడం మరో మార్గం. ''రుణ గ్రహీత తన ఇష్టం ప్రకారం ఈఎంఐని పెంచి చెల్లించడం కాకుండా, స్టెపప్ ఈఎంఐ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల ఆటోమేటిక్‌గా ఈఎంఐ పెరుగుతుంది. లేకపోతే కొన్ని ఆకర్షణీయమైన ఖర్చులతో ముందస్తు చెల్లింపులపై ప్రభావం పడుతుంది''అని దీపాలిసేన్ సూచించారు.

అన్ని అంశాలు చూసిన తర్వాతే

వ్యక్తిగత ఆర్థిక అంశాల్లో గృహ రుణం అన్నది ఒక్క భాగం మాత్రమే. కనుక ముందస్తుగా రుణాన్ని చెల్లించే ముందు, ఇతర బాధ్యతలు, అవసరాలు, వెసులుబాటును కూడా చూసుకోవాలన్నది నిపుణుల సూచన. అందరి ఆర్థిక పరిస్థితులు ఒకే మాదిరిగా ఉండవు. తమ క్లయింట్ల విషయంలో భిన్న వ్యవహార శైలిని చూస్తుంటామని అమోల్ జోషి వెల్లడించారు. ''పెరుగుతున్న జీవనశైలి ఖర్చులతో నెలవారీ పొదుపు కష్టంగా మారుతోంది. కనుక వ్యక్తులు సింగిల్ షాట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏడాదికోసారి ముందస్తు చెల్లింపునకే ప్రాధాన్యం ఇస్తున్నారు'' అని జోషి వివరించారు. జీవితంలో ఎన్నో అవసరాలు పెరుగుతుంటాయి. కనుక వాటికి కూడా ప్రాధాన్యం ఇస్తూ గృహ రుణాన్ని ముందుగా తీర్చివేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గృహ రుణాన్ని ముందుగా తీర్చివేయాలని భావించే వారు తమ ఆదాయపన్ను కోణంలోనూ దీన్ని ఓ సారి విశ్లేషించుకోవాలి. ఎందుకంటే పాత పన్ను విధానంలో గృహ రుణంపై అసలు, వడ్డీ మొత్తం కలిపి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.3.5 లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు. కనుక రూ. 9 లక్షల వరకు వార్షికాదాయం కలిగిన వారికి గృహ రుణం రూపంలో గణనీయమైన మొత్తమే ఆదా చేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 2 లక్షల మొత్తం వడ్డీ చెల్లింపులకే పన్ను ప్రయోజనం సెక్షన్ 24(బీ) కింద ఉంటుంది. సెక్షన్ 80సీ కింద అసలుకు జమ చేసే రూ.1.5 లక్షలకు కూడా పన్ను ఆదా ప్రయోజనం క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే, ఒక ఆర్థిక సంవత్సరంలో గృహ రుణంపై వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షల లోపునకు తగ్గిపోయినప్పుడు, పన్ను పరిధిలో ఉన్న వారు ముందస్తు చెల్లింపుల వైపు మొగ్గు చూపించొచ్చు.

●●●

''గృహ రుణం పెద్ద మొత్తంలో తీసుకుంటే, సమీప కాలంలో వేరే ఇతర పెద్ద ఆర్థిక లక్ష్యాలు లేకుంటే.. వీలైనంత అదనపు మొత్తంతో రుణాన్ని ముందుగా తీర్చివేయడమే మంచిది. అది నెలవారీ కావచ్చు, ఏడాదికోసారి కావచ్చు. మిగిలిన గృహ రుణం కొంతే ఉంటే, అప్పుడు మిగులు మొత్తాన్ని పెట్టుబడులు, ముందస్తు చెల్లింపులు అనే రెండు భాగాలుగా విభజన చేసుకోవాలి''అని దీపాలి సేన్ సూచించారు. గృహ రుణం అనేది పెద్ద బాధ్యత. సొంతింటి కల సాకారానికి దీని సాయం తీసుకోవడంలో తప్పు లేదు. కానీ, ఈఎంఐ రూపంలో నెలవారీ ఎంత చెల్లింపుల సామర్థ్యం తమకు ఉంది, తమ కుటుంబ ఆదాయం, అవసరాలు, ఆరోగ్య చరిత్ర, ఇతర ఆర్థిక బాధ్యతలు ఇలాంటి ఎన్నో అంశాలు విశ్లేషించిన తర్వాతే దీనిపై స్పష్టతకు రావడానికి వీలుంటుంది. ఈ విషయంలో నిపుణుల సహాయం తీసుకునేందుకు వెనుకాడకూడదు. చెల్లింపుల సామర్థ్యం పూర్తి స్థాయిలో లేదంటే, ఇంటి కొనుగోలుకు అయ్యే వ్యయంలో ఎక్కువ మొత్తాన్ని సమకూర్చుకున్న తర్వాతే, గృహ రుణం విషయంలో ముందుకు వెళ్లడం ఆర్థిక సౌకర్యాన్నిస్తుంది.

భారం ఎంత తగ్గుతుంది..

- గృహ రుణం: రూ.కోటి
- కాలవ్యవధి: 20 ఏళ్లు
- వడ్డీ రేటు: 8.5 శాతం
- ఈఎంఐ: రూ.86,782
- నికర వడ్డీ చెల్లింపు: 1.08 కోట్లు
- ఉదాహరణ: మూడేళ్ల తర్వాత నుంచి నెలవారీ రూ. 20వేలు అదనంగా చెల్లించడం/మూడేళ్ల తర్వాత నుంచి ఏటా ఒకేసారి రూ. 2 లక్షల చొప్పున చెల్లించడం/ఏడేళ్ల తర్వాత ఒకే విడత రూ.20 లక్షలు జమ చేయడం
- నికర వడ్డీ భారం: రూ.77.67 లక్షలు/ రూ.79.39 లక్షలు/రూ.79.45లక్షలు
- ఆదా అయ్యే వడ్డీ: రూ.30.63 లక్షలు/ రూ.28.91లక్షలు/రూ.28.85 లక్షలు
- రుణం ముగింపు కాలం: 14ఏళ్లు/15ఏళ్లు/15ఏళ్లు



హౌసింగ్ డాట్ కామ్ ద్వారా వ్యక్తిగత రుణాలు

ఫిన్‌బాక్స్‌తో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: ప్రాపర్టీ టెక్నాలజీ సంస్థ 'హౌసింగ్ డాట్ కామ్' ఫిన్‌బాక్స్ భాగస్వామ్యంతో వ్యక్తిగత రుణాలను ఆఫర్ చేయనున్నట్టు ప్రకటించింది. రూ.10 లక్షల వరకు రుణాలను తక్షణమే జారీ చేయనున్నట్టు తెలిపింది. రెంటల్ సెక్యూరిటీ డిపాజిట్, ఇంటి నవీకరణ, ఫర్నిచర్ కొనుగోలు అవసరాలను తీర్చేందుకు గాను కస్టమర్లకు రుణ సాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొంది. మరింత సౌకర్యవంతంగా డిజిటల్ రూపంలో రుణాల మంజూరుకు గాను ఈ సేవను తన యాప్, వెబ్‌సైట్‌తో అనుసంధానించనున్నట్టు ప్రకటించింది. హౌసింగ్ ఎడ్జ్ ద్వారా కస్టమర్లు ఈ సేవను పొందొచ్చని తెలిపింది. సంక్లిష్టమైన రుణ దరఖాస్తులకు కాలం చెల్లిపోయిందని, మొత్తం రుణ దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే 3 నిమిషాల్లోనే పూర్తయ్యేలా ఏర్పాటు చేసినట్టు హౌసింగ్ డాట్ కామ్ గ్రూప్ సీఈవో ధృవ్ అగర్వాల్ తెలిపారు. దరఖాస్తు ఆమోదం పొందిన 24 గంటల్లోనే రుణాన్ని మంజూరు చేయనున్నట్టు చెప్పారు. ఇళ్లకు సంబంధించి అన్ని అవసరాలను అందించే ఏకీకృత వేదికగా అవతరించడమే తమ లక్ష్యమని తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-7-2023	
విశాఖ	475-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	72.00
16-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	450-00
వరంగల్	452-00
రిటైల్ ధర	5.10

మహానగర్ గ్యాస్ | సీడీ ఈక్విసెర్చ్ ప్రయివేట్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,081 టార్గెట్: రూ. 1,306

ఎందుకంటే: ప్రభుత్వ రంగ దిగ్గజం గెయిల్ ఇండియా ప్రమోట్ చేసిన మహానగర్ గ్యాస్ లిమిటెడ్ గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో 303.49 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల(ఎస్‌సీఎం) గ్యాస్‌ను విక్రయించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో సాధించిన 285.26 మిలియన్ ఎస్‌సీఎం అమ్మకాలతో పోలిస్తే ఇది 6.4 శాతం అధికం. తాజా(క్యూ4) అమ్మకాలలో సీఎన్‌జీ 5.8 శాతం, పీఎన్‌జీ 7.8 శాతం చొప్పున వృద్ధి చూపాయి. ఈ క్యూ4లో మొత్తం ఆదాయం 48 శాతానికిపైగా జంప్‌చేసి రూ. 1,610 కోట్లను అధిగమించింది. దీనిలో సీఎన్‌జీ బిజినెస్ ఆదాయం 62 శాతం దూసుకెళ్లి రూ. 1,138 కోట్లను తాకగా.. పీఎన్‌జీ విభాగం నుంచి 23 శాతం అధికంగా రూ. 464 కోట్లు(గతంలో రూ. 377 కోట్లు) లభించింది. అంతక్రితం ఏడాది క్యూ4లో ఈ రెండు విభాగాల మొత్తం ఆదాయం కేవలం రూ. 1,087 కోట్లుగా నమోదైంది. కాగా.. కంపెనీ ప్రధానంగా సిటీ గ్యాస్ పంపిణీ(సీజీడీ) రంగంపైనే దృష్టి సారించింది. సీజీడీలో అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తోంది. గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా కస్టమర్ల సంఖ్యను పెంచుకోవాలని చూస్తోంది. ఏడాదిలో 30–40 స్టేషన్లను జత చేసుకోవాలని ఆశిస్తోంది. రాయ్‌గఢ్ జిల్లాలో విస్తరణ ద్వారా పీఎన్‌జీ నెట్‌వర్క్‌కు జోష్ లభించనున్నట్లు కంపెనీ విశ్వసిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ప్రత్యక్ష బిడ్డింగ్, వ్యూహాత్మక భాగస్వామ్యాలు తదితర ప్రణాళికల ద్వారా అమ్మకాలలో 5.5 శాతం పురోగతిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



హీరో మోటోకార్ప్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,138 టార్గెట్: రూ. 3,475

ఎందుకంటే: ద్విచక్ర వాహన రంగ దేశీ దిగ్గజం హీరో మోటోకార్ప్ అంతర్జాతీయ దిగ్గజం హార్లే డేవిడ్‌సన్(హెచ్‌డీ)తో చేతులు కలపడం ద్వారా రూపొందించిన తొలి ప్రొడక్టును ఇటీవల విడుదల చేసింది. ఎక్స్440 బ్రాండుతో హైఎండ్ బైక్‌ను ప్రవేశపెట్టింది. జైపూర్‌లోగల ఇన్నొవేషన్ టెక్నాలజీ కేంద్రం(సీఐటీ) ద్వారా అభివృద్ధి చేసిన ఈ బైక్‌తో 400 సీసీ విభాగంలో కంపెనీ తొలిసారి అడుగు పెట్టింది. సుప్రసిద్ధ హార్లే డేవిడ్‌సన్ బైకుల మోడళ్లను పోలిన ఎక్స్440ను మూడు వేరియంట్లలో విడుదల చేసింది. డెనిమ్, వివిడ్, ఎస్ బ్రాండ్లతో వీటిని ప్రవేశపెట్టింది. వీటి ఎక్స్‌షోరూమ్ ధరలు రూ. 2.29 లక్షల నుంచి రూ. 2.69 లక్షల మధ్యలో నిర్ణయించింది. కంపెనీకి రాజస్తాన్‌లో గల నీమ్‌రాణా ప్లాంటులో వీటిని రూపొందిస్తోంది. దేశవ్యాప్తంగా హార్లే డేవిడ్‌సన్ డీలర్ నెట్‌వర్క్ ద్వారా విక్రయిస్తోంది. వెరసి హెచ్‌డీ బ్రాండులో ఎక్స్440 బైక్‌ను అత్యంత ఆకర్షణీయ స్థాయిలో రూ. 2.29 లక్షల ప్రారంభ ధర వద్ద విడుదల చేయడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకోగలుగుతోంది. అయితే పేపర్‌మీద చూస్తే బైక్ అన్ని అంశాలలోనూ అత్యంత విజయవంతమైనట్లే కనిపిస్తున్నప్పటికీ.. మార్కెట్లో కస్టమర్ల నుంచి అసలు స్పందన(ఫీడ్‌బ్యాక్) రావలసి ఉంది. ఇందుకు కొంతసమయం వేచి చూడవలసి ఉంటుంది. కాగా.. తదుపరి కాలంలో తాజా ప్లాట్‌ఫామ్ ద్వారా హీరో మోటో బ్రాండ్ బైకులు సైతం వెలువడనున్నాయి. ద్విచక్ర వాహన విభాగంలో దేశీయంగా డిమాండ్ రికవరీ బాటలో ఉంది. ప్రధానంగా 100 సీసీ విభాగంలో పట్టున్న కంపెనీకి పట్టణాల నుంచి కనిపిస్తున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాలలోనూ కొనసాగవలసి ఉంది.



మిరే అసెట్ నుంచి నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్



హైదరాబాద్: మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) ప్రకటించింది. ఇది జూలై 18 వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయాలి. ఏక్తా గాలా దీనికి ఫండ్ మేనేజరుగా ఉంటారు. 12 టాప్ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులను ఇది ట్రాక్ చేస్తుంది. రాబోయే రోజుల్లో మరింతగా వృద్ధి చెందనున్న బ్యాంకింగ్ రంగంలో ఇన్వెస్ట్ చేసేందుకు, మెరుగైన రాబడులు పొందేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ హెడ్ (ఈటీఎఫ్ ప్రోడక్ట్) సిద్ధార్థ్ శ్రీవాస్తవ తెలిపారు. మొండి బాకీల సమస్యను వదుల్చుకున్న బ్యాంకింగ్ రంగం గత కొన్నాళ్లుగా మెరుగైన పనితీరు కనపరుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఫిన్‌టెక్ విప్లవంతో ఈ రంగం మరింత వృద్ధి చెందగలదని చెప్పారు.

రూపాయి ముఖ విలువను విభజించొచ్చా?

నా వయసు 59 ఏళ్లు. నేను పదవీ విరమణ తీసుకున్నప్పటికీ, నా పీఎఫ్ ఖాతాలో ఉన్న బ్యాలన్స్‌ను ఉపసంహరించుకోలేదు. అయినప్పటికీ నా పీఎఫ్ బ్యాలన్స్‌పై వడ్డీ జమ అవుతూనే ఉంటుందా?

– నానీ పార్థీ

పదవీ విరమణ అనంతరం, పీఎఫ్ ఖాతాకు వరుసగా మూడేళ్ల పాటు ఎలాంటి చందాలు జమ అవ్వకపోతే, అప్పుడు ఆ ఖాతా ఇన్ఆపరేటివ్‌గా మారిపోతుంది. అక్కడి నుంచి ఇక వడ్డీ జమ అవ్వడం కూడా నిలిచిపోతుంది. అంటే పదవీ విరమరణ తర్వాత మూడేళ్ల పాటే వడ్డీ జమ అవుతుంది. పదవీ విరమణ అనంతరం భవిష్యనిధి ఖాతాలోని బ్యాలన్స్‌ను పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు. ఐదేళ్ల సర్వీసు నిండిన తర్వాత ఉపసంహరించుకునే పీఎఫ్ బ్యాలన్స్ మొత్తంపై పన్ను ఉండకపోవడం అదనపు ప్రయోజనం. మరొక ముఖ్య విషయం ఏమిటంటే, రిటైర్మెంట్ తర్వాత పీఎఫ్ బ్యాలన్స్‌ను వెనక్కి తీసుకోకపోతే, జమయ్యే వడ్డీ మొత్తం పన్ను పరిధిలోకి వస్తుంది. కనుక పీఎఫ్ బ్యాలన్స్‌ను ఉపసంహరించుకుని, మీ లక్ష్యాలు, రాబడుల ఆకాంక్షలకు అనుగుణంగా వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిది.

ఏదైనా ఒక కంపెనీ షేరు ముఖ విలువ రూపాయి ఉంటే దాన్ని ఎలా విభజిస్తారు? వారి ముందున్న ఆప్షన్లు ఏంటి?

– అరుణ్ పాలస్

మన దేశంలో ఒక షేరు కనిష్ఠ ముఖ విలువ రూ.1గా ఉంది. దీని ప్రకారం ఒక షేరు ముఖ విలువ రూపాయిగా ఉంటే, దాన్ని విభజించడానికి అవకాశం ఉండదు. ఒక కంపెనీ ముఖ విలువను విభజించడం వెనుక ఉద్దేశ్యం ఆయా కంపెనీ షేర్ల లిక్విడిటీని (అందుబాటు) పెంచడమే. షేరు ధరను విభజించడం వల్ల మూలధనంలో ఎలాంటి మార్పు ఉండదు. కనుక ఒక ఇన్వెస్టర్‌గా ముఖ విలువను విభజించే విషయంలో పొందే ప్రయోజనం ఏమీ ఉండదు. అలాగే, నష్టపోయేదీ ఉండదు. ఉదాహరణకు ఎక్స్‌వైజెడ్ అనే కంపెనీ షేరు మార్కెట్ ధర రూ.100 ఉందనుకుందాం. మార్కెట్లో 50,000 వేల షేర్లు ఉన్నాయి. మిస్టర్ ఏ రూ.5,000 పెట్టి ఈ కంపెనీలో 50 షేర్లను కొనుగోలు చేశాడు. ఆ తర్వాత కంపెనీ 5:1 స్టాక్ స్ప్లిట్‌ను ప్రకటించింది. అంటే ప్రతి ఒక్క షేరు ఐదు షేర్లుగా విభజించనున్నారు. విభజన తర్వాత మిస్టర్ ఏ వద్దనున్న 50 షేర్ల స్థానంలో 250 షేర్లు జమ అవుతాయి. అప్పటి వరకు రూ.10గా ఉన్న ముఖ విలువ రూ.2గా మారుతుంది. విభజన తర్వాత షేరు మార్కెట్ ధర కూడా రూ.100 నుంచి రూ.20కు సవరణ అవుతుంది. 250 షేర్లు, రూ.20 చొప్పున వాటి మొత్తం మార్కెట్ విలువలో ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ఒక కంపెనీ షేరు ముఖ విలువను విభజిస్తుందా, లేదా? అన్నది ముఖ్యం కాదు. స్టాక్ ముఖ విలువ విభజన అంచనా ఆధారంగా పెట్టుబడులు పెట్టకూడదు. స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు తగినంత సమయం, కృషి అవసరం. ఒక కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి ముందు వ్యాపార నమూనా, ఆర్థిక మూలాలు, యాజమాన్యం సమర్థత, కార్యకలాపాలను నైతికంగా నిర్వహిస్తున్నారా? వృద్ధి అవకాశాలు, వ్యాల్యూషన్ సహేతుక స్థాయిలోనే ఉందా? పోటీ కంపెనీలతో పోలిస్తే మెరుగైన పనితీరు చూపించగలదా? తదితర అంశాల ఆధారంగానే నిర్ణయం తీసుకోవడం సూచనీయం.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

హెచ్‌బిట్స్ ఆల్టర్నేటివ్ ఫండ్‌కు సెబీ ఆమోదం




న్యూఢిల్లీ: అంకుర సంస్థ హెచ్‌బిట్స్ ప్రతిపాదిత రూ. 500 కోట్ల ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతినిచ్చింది. ఈ ఫండ్ ద్వారా సేకరించిన నిధులను కమర్షియల్ రియల్ ఎస్టేట్‌పై ఇన్వెస్ట్ చేయనున్నట్లు హెచ్‌బిట్స్ వెల్లడించింది. ఈ పెట్టుబడులపై ఇన్వెస్టర్లు 18–20 శాతం మేర రాబడులు అందుకునే అవకాశం ఉందని పేర్కొంది. మే నెలాఖరున సెబీ నుంచి అనుమతి లభించిందని, ప్రస్తుతం ఫ్యామిలీ ఆఫీస్‌లు, అత్యంత సంపన్నులు, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, ఇంటర్నేషనల్ ఫండ్స్ నుంచి నిధులు సమీకరిస్తున్నామని వివరించింది. ప్రస్తుతం హెచ్‌బిట్స్ తొమ్మిది ప్రాపర్టీలవ్యాప్తంగా రూ. 220 కోట్ల అసెట్స్‌ను నిర్వహిస్తోంది. 50,000 మంది పైచిలుకు రిజిస్టర్డ్ యూజర్లు ఉన్నారు.

ఈ బాంబు ఒక్కటి వేస్తే..

100 బాంబులు వేసినట్టే..

ఏదైనా బాంబును ప్రయోగిస్తే.. అది పడిన ప్రదేశంతోపాటు కొంతదూరం వరకు విధ్వంసం సృష్టిస్తుంది. అక్కడితో దాని పని అయిపోతుంది. అదే క్లస్టర్ బాంబును ప్రయోగిస్తే.. టార్గెట్ చేసిన ప్రదేశంతోపాటు చుట్టుపక్కల కొంత దూరం దాకా విధ్వంసం సృష్టిస్తుంది. అందులోని భాగాలు ఆ తర్వాత కూడా పేలుతూనే.. అక్కడికి వచ్చినవారి ప్రాణాలు తీస్తూనే ఉంటాయి. తాజాగా ఉక్రెయిన్‌కు అమెరికా క్లస్టర్ బాంబులను ఇవ్వడం, ప్రతిగా తమ వద్ద కూడా క్లస్టర్ బాంబులు ఉన్నాయని రష్యా హెచ్చరించడం నేపథ్యంలో.. క్లస్టర్ బాంబులు ఏమిటి? వాటితో ప్రమాదమేంటి? ఇప్పటి వరకు ఎక్కడైనా ప్రయోగించారా? అన్న వివరాలు తెలుసుకుందామా..

- సాక్షి సెంట్రల్ డెస్క్



అప్పుడే పేలక.. తర్వాత ప్రాణాలు తీస్తూ..

క్లస్టర్ బాంబులు వెదజల్లే బాంబ్లెట్లలో అన్నీ అప్పటికప్పుడే పేలిపోవు. వాటిలో కొన్ని నేలపై చెల్లాచెదురుగా పడిపోతాయి. కొన్నిసార్లు ఏళ్లకేళ్లు కూడా అలాగే ఉంటాయి. ఎప్పుడైనా సైనికులుగానీ, సాధారణ పౌరులుగానీ వాటిని తాకితే పేలిపోయి ప్రాణాలు తీస్తాయి. అంటే యుద్ధం ముగిసిపోయినా బాంబుల బాధ తప్పని పరిస్థితి.

- గతంలో వియత్నాం, లావోస్, ఇరాక్, అఫ్గానిస్తాన్ తదితర యుద్ధాల్లో అమెరికా ఈ క్లస్టర్ బాంబులను వినియోగించింది కూడా. వాటిలో పేలిపోకుండా ఉన్న బాంబులు ఇప్పటికీ తరచూ విస్ఫోటం చెందుతూ ప్రజలు ప్రాణాలను బలి తీసుకుంటూనే ఉన్నాయి.
- క్లస్టర్ బాంబులు భారీగా జన హననానికి దారి తీస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు వీటి వాడకాన్ని నిషేధిస్తూ ఒప్పందం చేసుకున్నాయి. అయితే ఆ ఒప్పందంపై అమెరికా, ఉక్రెయిన్, రష్యా సంతకం చేయకపోవడం గమనార్హం.

ఒకటి కాదు వందల బాంబులు కలిపి..



సాధారణంగా క్షిపణులు అయినా, ఇతర బాంబులు అయినా వాటిలో పేలిపోయే భాగం (వార్ హెడ్) ఒకటే ఉంటుంది. ఒకే ప్రదేశంలో పెద్ద పేలుడు సంభవిస్తుంది. అదే క్లస్టర్ బాంబులో వందలకొద్దీ చిన్న బాంబులు (బాంబ్లెట్లు) ఉంటాయి. దీనిని ప్రయోగించాక నిర్దేశించిన ప్రాంతానికి చేరుకోగానే విచ్చుకుని.. అందులోని చిన్న బాంబులన్నింటినీ కొంతదూరం వరకు వెదజల్లుతుంది. ఇలా ఎక్కువ విస్తీర్ణంలో పేలుళ్లు జరుగుతాయి. అంత విస్తీర్ణంలో విధ్వంసం జరుగుతుంది. మిలటరీ స్థావరాలు, వాహనాలు, ఆయుధాలు నాశనమవుతాయి. ఆ ప్రాంతంలో ఉండే సైన్యం, సాధారణ ప్రజలకూ ప్రమాదం కలుగుతుంది.

'డడ్ రేటు'తో ఎఫెక్ట్

క్లస్టర్ బాంబు ప్రయోగించినప్పుడు పేలకుండా ఉండిపోయే బాంబ్లెట్ల శాతాన్ని 'డడ్ రేటు'గా పిలుస్తారు. ఈ డడ్ రేటు ఎంత ఎక్కువగా ఉంటే.. భవిష్యత్తులో ప్రజలు వాటి బారినపడే ప్రమాదం అంత ఎక్కువగా ఉంటుంది. రష్యాకు చెందిన క్లస్టర్ బాంబుల డడ్ రేటు 4శాతం నుంచి 40 శాతం వరకు ఉంటుందని అంచనా. తాజాగా ఉక్రెయిన్‌కు ఇచ్చిన క్లస్టర్ బాంబుల డడ్ రేటు చాలా తక్కువగా 2.35 శాతమేనని అమెరికా అధికారులు ప్రకటించడం గమనార్హం.

క్లస్టర్ బాంబుల ప్రత్యేకతలివీ..

- క్లస్టర్ బాంబు బరువు సాధారణంగా 450 కిలోల నుంచి 500 కిలోల వరకు ఉంటుంది. అందులో ఒక్కోటీ ఏడెనిమిది అంగుళాల పొడవున్న 200 వరకు బాంబ్లెట్లు ఉంటాయి.
- క్లస్టర్ బాంబు నిర్దేశిత లక్ష్యానికి చేరువకాగానే.. అతి వేగంగా తిరగడం మొదలవుతుంది. తర్వాత దశలవారీగా బాంబ్లెట్లను విడుదల చేస్తుంది. దీనివల్ల బాంబ్లెట్లు దూరదూరంగా, వేగంగా పడిపోతాయి.
- క్లస్టర్ బాంబుల్లోని బాంబ్లెట్లకు కిందివైపు ఫ్యాన్ తరహా ప్రత్యేకమైన రెక్కలు, లేకుంటే చిన్నపాటి ప్యారాచూట్లను అమర్చుతారు. దీనితో అవి ఓ క్రమంలో నేలను తాకి పేలిపోతాయి.
- పేలిపోకుండా ఉండిపోయిన బాంబ్లెట్లను గుర్తించి నిర్వీర్యం చేయడం కూడా ప్రమాదకరమైన పనే. ఎవరైనా తాకగానే పేలిపోయే అవకాశాలు ఎక్కువ. అందువల్ల బాంబ్ డిస్పోజల్ యూనిట్లు, రోబోలతో వాటిని గుర్తించి, నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది.

శ్రీవారికి స్వర్ణ శంఖం

కానుకగా అందజేసిన ఇన్ఫోసిస్ అధినేత దంపతులు

తిరుమల: శ్రీవారికి బంగారు అభిషేక శంఖాన్ని ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి దంపతులు ఆదివారం కానుకగా అందజేశారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో వారు శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి స్వర్ణ అభిషేక శంఖాన్ని అందజేశారు. దాదాపు 2 కేజీల బరువు ఉండవచ్చు నని టీటీడీ వర్గాలు తెలిపాయి. నారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ.. 1953 నుంచి తాము శ్రీవారిని దర్శించుకుంటున్నామని చెప్పారు.



సీజనల్ వ్యాధులు షురూ

నెల రోజుల్లో రెండు లక్షల మందికి జ్వరాలు

- జలుబు, దగ్గుతో సతమతం
- రోజురోజుకు పెరుగుతున్న డెంగీ కేసులు
- ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులకు జనం క్యూ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జలుబు, దగ్గు, జ్వరాల కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. డెంగీ, మలేరియా కేసులు కూడా భారీగా వెలుగుచూస్తున్నాయి. గత నెల రోజుల్లోనే రాష్ట్రంలో దాదాపు 2 లక్షల మంది జ్వరాల బారినపడినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వాతావరణం మారడం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా జ్వరాలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరిగినట్లుగా వైద్య యంత్రాంగం అంచనా వేసింది. వానాకాలమంతా జ్వరాలు కొనసాగే పరిస్థితి ఉందని హెచ్చరిస్తోంది.

ఆస్పత్రుల్లో రోగుల క్యూ

సీజనల్ వ్యాధులతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. హైదరాబాద్‌లోని ఫీవర్ ఆస్పత్రి, ఉస్మానియా, గాంధీ సహా జిల్లాల్లోని ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. ఓపీలో సగం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారే.

పీహెచ్‌సీల్లో కానరాని దాక్టర్లు

కొన్ని చోట్ల వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగ నిర్లక్ష్యం బాధితులకు శాపంగా మారింది. అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా ప్రభుత్వం వేసిన అంచనాలకు మించి జ్వరాలు, డెంగీ, మలేరియా కేసులున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

పగటి పూట కుట్టే దోమతో డెంగీ...



డెంగీ కారక ఈడిస్ ఈజిప్ట్ దోమ అన్ని దోమల్లాంటిది కాదు. పగటిపూటే కుడుతుంది. ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిల్వ ఉంచే మంచినీటిలోనే పుట్టి పెరుగుతుంది. ఒక వారం రోజులు కదపకుండా దోసెడు నీరున్నా చాలు. అందులో పునరుత్పత్తి ప్రక్రియ కొనసాగిస్తుంది. ఎయిర్ కూలర్లలో, డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన మంచినీటిలో, వాడకుండా పక్కన పడేసిన పాత టైర్లు, రేకు డబ్బాల్లో వాన నీరు కురిస్తే ఆ చిన్ననీటి గుంతల్లోనూ జీవనం కొనసాగిస్తుంది. అందుకే ఇంట్లో, కార్యాలయాల్లో ఎక్కడైనా కొద్దిపాటి నీటి నిల్వ లున్నాయా అని పరిశీలించాలి. డెంగీ వస్తే ఉన్నట్టుండి తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి వస్తుంది. కళ్లు తెరవడం కష్టంగా ఉంటుంది. చర్మంపై దద్దుర్లు అయినట్లు కనిపించడం, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. అధిక దాహంతో పాటు రక్తపోటు స్థాయిలు పడిపోతాయి.

ఐజీఎం పరీక్షతోనే డెంగీ నిర్ధారణ

డెంగీ నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో దీనిని నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. విధిగా అందుబాటులో ఉండే ఐజీఎం పరీక్ష చేయించాలి. ప్లేట్‌లెట్లు 20 వేలలోపు పడిపోతే అది ప్రమాదకరంగా భావిస్తారు. 15 వేల కన్నా తగ్గితే డెంగీ షాక్, డెంగీ మరణాలు సంభవిస్తాయి. డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. ఎలక్ట్రాల్ పౌడర్, పళ్లరసాలు రోగికి ఇవ్వాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు అదుపులోకి వస్తాయి. ఇంకా తగ్గకుంటే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తుంది. ఇక వైరల్ ఫీవర్ వస్తే విపరీతంగా మంచినీరు తాగాలి. పండ్లరసాలు తీసుకుంటే ప్లేట్‌లెట్లు పడిపోకుండా కాపాడుతాయి.



ఎప్పటిలాగే రాష్ట్ర ప్రభుత్వ పిలుపు రాలేదు

రాజ్‌భవన్‌లో బోనమెత్తిన గవర్నర్ తమిళిసై

- అందుకే రాజ్‌భవన్‌లో బోనాల వేడుకలన్న గవర్నర్ తమిళిసై
- రాజ్‌భవన్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో బోనం సమర్పణ

లక్డీకాపూల్: బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈసారి కూడా పిలుపు రాలేదని, అందుకే ఎప్పటిలాగే రాజభవన్‌లో బోనాల వేడుకలు నిర్వహిస్తున్నామని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. రాజ్‌భవన్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై అమ్మవారికి బోనం సమర్పించి, ఒడిబియ్యం పోశారు. ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలందరికీ తెలుగులో బోనాల శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ సకల సౌకర్యాలు అందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని వెల్లడించారు.

రైతుల అభ్యున్నతికి నాబార్డు విశేష కృషి

నాబార్డు 42వ వ్యవస్థాపక దినోత్సవంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై

చిక్కడపల్లి: రైతుల అభ్యున్నతికి నాబార్డు అందిస్తున్న సేవలు అమోఘమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆదివారం జరిగిన నాబార్డు 42వ వ్యవస్థాపక దినోత్సవంలో గవర్నర్ ప్రసంగించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయరంగాల్లో పెట్టుబడుల వల్ల ఆహారభద్రత, పోషకాహార లోపం, ఇతర సవాళ్లను పరిష్కరించవచ్చన్నారు. పేదరిక నిర్మూలన, నీరు, శక్తి, వాతావరణమార్పు, సుస్థిర వ్యవసాయం అభివృద్ధికి నాబార్డు విస్తృత కార్యక్రమాలు చేపడుతోందని కొనియాడారు. ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు, గ్రామీణ రుణసంస్థల సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల రైతులకు మేలు కలుగుతోందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన, ప్రధానమంత్రి కృషి సించాయ్, పరంపరంగత్ కృషివికాస్ యోజన వంటి పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రన్, నాబార్డు జనరల్ మేనేజర్ ఉష తదితరులు పాల్గొన్నారు.

గ్రేట్ ఇండియన్ బ్రాండ్ అరకు కాఫీ



ప్రపంచంలోనే తొలి గిరిజన ఆర్గానిక్ బ్రాండ్

నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్

రీట్వీట్ చేసిన ఆనంద్ మహీంద్రా

సాక్షి, అమరావతి: అరకు కాఫీ ఘుమఘుమలు మరోసారి అంతర్జాతీయంగా ఖ్యాతికెక్కింది. ప్రపంచంలోనే తొలి గిరిజన సంప్రదాయ కాఫీ అయిన అరకు కాఫీ ఇండియన్ గ్రేట్ బ్రాండ్లలో ఒకటి అంటూ నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ ట్వీట్ చేయగా.. దానిని స్వాగతిస్తూ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా రీట్వీట్ చేశారు. దీంతో మరోసారి అంతర్జాతీయంగా అరకు కాఫీపై ట్విట్టర్ వేదికగా పెద్ద చర్చ జరుగుతోంది. ఇండియాలో జరుగుతున్న జీ–20 సమావేశాల్లో విదేశీ ప్రతినిధులకు అందంగా ప్యాక్ చేసిన అరకు కాఫీని అందిస్తున్నామని, ఇది ప్రపంచంలోనే తొలి గిరిజన కాఫీగా గుర్తింపు పొందిందంటూ అమితాబ్ కాంత్ కీర్తించారు. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న కాఫీ సాగు ప్రాంతంగా అరకుకు గుర్తింపు లభించిందన్నారు. ప్రతిసారి సేంద్రియ సాగు పరీక్షలో స్థిరంగా 90 కంటే ఎక్కువ మార్కులు సాధిస్తూ తొలి ఇండియన్ కాఫీగా నిలవడమే కాకుండా.. గ్రేట్ ఇండియన్ బ్రాండ్‌గా ఎదిగిందన్నారు. ఈ ట్వీట్‌పై ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ.. దేశ విజయాన్ని అద్దంపట్టే విధంగా అరకు కాఫీని ఎంచుకోవడం అద్భుతమైన నిర్ణయమంటూ పొగిడారు.

నాడు యాచక వృత్తి.. నేడు సూపర్‌వైజర్

- ఈ గౌరవం సీఎం జగన్ చలవే
- ట్రాన్స్‌జెండర్ సహస్ర ప్రశంసలు



నందిగామ: వైఎస్ జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి మేలు జరుగుతోందనేందుకు తానే ఉదాహరణ అని ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన ట్రాన్స్‌జెండర్ ఇనపనుర్తి సహస్ర అన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం వల్లే యాచక వృత్తి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ నేడు సూపర్‌వైజర్‌గా రాణిస్తున్నానని తెలిపారు. 'నా అసలు పేరు సురేష్. చిన్నతనం నుంచి మహిళగా మారాలని కోరిక. పదవ తరగతి పూర్తికాగానే ఢిల్లీకి వెళ్లాను. అక్కడ హిజ్రాగా మారి నందిగామ వచ్చాను. అందరూ నన్ను దూరంగా పెట్టారు. చేద్దామంటే పని దొరకలేదు. దీంతో యాచించడం తప్ప మరోమార్గం దొరకలేదు. నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నించా రాలేదు. 2019లో జగన్ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ద్వారా ఏపీఎస్‌బీసీఎల్‌కు చెందిన మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం వచ్చింది. తర్వాత పెళ్లి కూడా చేసుకున్నాను. సీఎం జగన్ చలవతోనే నేడు నాకు గౌరవం దక్కుతోంది' అని సహస్ర తెలిపింది.

వ్యవ'సాయం' భేష్

- గ్రామ స్థాయిలో రైతులకు సేవలు ప్రశంసనీయం
- ఇలాంటి అద్భుత వ్యవస్థను ఇంకెక్కడా చూడలేదు
- దేశవ్యాప్తంగా అనుసరించాలని కేంద్రానికి సూచిస్తాం
- వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ చైర్మన్ విజయ్‌పాల్ శర్మ ప్రశంసలు



కృష్ణాజిల్లా గండిగుంటలో ఆర్బీకే పని తీరును తెలుసుకుంటున్న సీఏసీపీ చైర్మన్ విజయ్‌పాల్

సాక్షి, అమరావతి: 'వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు నిజంగా ఓ అద్భుతం.. నాకు తెలిసి ఇలాంటి వ్యవస్థ దేశంలోనే కాదు... ప్రపంచంలోనే ఎక్కడా లేదు. ఆర్బీకేలతో గ్రామ స్థాయిలో రైతులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయం, అనుసరణీయం. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది' అని వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సీఏసీపీ) చైర్మన్ ప్రొఫెసర్ విజయ్‌పాల్ శర్మ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా పంటలకు కనీస మద్దతు ధరల నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసే కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఆదివారం కృష్ణా జిల్లా గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్), ఆర్బీకే ఛానల్‌ను సందర్శించారు. రైతుల సందేహాలను కాల్ సెంటర్ సిబ్బంది శాస్త్రవేత్తల సహాయంతో ఎలా నివృత్తి చేస్తున్నారో స్వయంగా పరిశీలించారు. టోల్ ఫ్రీ నంబర్ 155251కు వస్తున్న కాల్స్‌ను నిశితంగా గమనించారు. కాల్ చేసిన పలువురు రైతులను కాల్ సెంటర్ సేవల గురించి వాకబు చేశారు. పంటల వారీగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపుల్లో రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న తీరును పరిశీలించి అభినందించారు. శాస్త్రవేత్తలతో భేటీ అయ్యారు. అనంతరం ఆర్బీకే ఛానల్ ద్వారా ప్రసారమవుతున్న రైతు ప్రాయోజిత కార్యక్రమాలను స్వయంగా తిలకించారు. చాలా బాగున్నాయంటూ కితాబిచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల అధికారుల సలహాలు, సూచనలతో రూపొందిస్తున్న వీడియోలను పరిశీలించారు. తమ అనుభవాలను తోటి రైతులకు వివరించేందుకు వచ్చిన ఆదర్శ రైతులతో ముచ్చటించారు. రైతు భరోసా మేగజైన్ అద్భుతంగా ఉందంటూ ప్రశంసించారు. జాతీయ స్థాయిలో కిసాన్ కాల్ సెంటర్స్ పనిచేస్తున్నా ఈ స్థాయిలో సేవలందించడం లేదన్నారు. ఇదే రీతిలో అన్ని రాష్ట్రాల్లో కాల్ సెంటర్లు నెలకొల్పితే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొంటూ ఐసీసీ సెంటర్ సందర్శకుల పుస్తకంలో తన అభిప్రాయాన్ని పొందుపరిచారు.

విల్లు.. వివాదాలకు చెల్లు



- భవిష్యత్తులో కుటుంబ తగాదాలు రావొద్దంటే వీలునామా తప్పనిసరి
- వారసుల్లో ఎవరెవరికి ఎంత ఇవ్వాలో అంత ఇవ్వొచ్చు
- ఎన్నిసార్లు విల్లు రాసినా అంతిమంగా రాసిన దానికే చెల్లుబాటు

రఘు వయసు 51. అప్పటివరకూ కష్టపడి కూడబెట్టింది ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా దాచుకున్నాడు. నామినీగా భార్య పేరు రాశాడు. కొన్నాళ్లకు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. మరి.. రఘు డిపాజిట్లు మొత్తం నామినీగా ఉన్న భార్యకే దక్కాయా? అంటే లేదనే చెప్పాలి.

సరస్వతి భర్త చిన్న వయసులోనే కాలం చేశాడు. వారికి పిల్లలు కూడా లేరు. ఉన్నదల్లా తల్లి, తండ్రి, అత్త మాత్రమే. ఈ పరిస్థితుల్లో సరస్వతి కూడా మరణిస్తే ఆమె సంపాదించినది ఎవరికి దక్కుతుంది? ముగ్గురికీ అనుకుంటున్నారా? కానీ చట్టప్రకారం ఒక్క అత్తకు మాత్రమే దక్కింది.

సాక్షి, హైదరాబాద్: ఇలాంటి ఘటనలు ఏ ఒకరిద్దరికో పరిమితం కాదు.. ఇటీవలి కాలంలో చాలా మంది ఇళ్లలో ఎదురవుతున్నవే. మరి ఒక వ్యక్తి తన ఆస్తులను ఇష్టం వచ్చిన వారికి ఇవ్వాలనుకుంటే ఎలా? నామినీకి, వీలునామాకు తేడా ఏమిటి? దాన్ని ఎప్పుడు రాయాలి.. ఎలా రాయాలి లాంటి వివరాలతో కథనం.

వీలునామా అంటే... : ఒక వ్యక్తి మరణం తరువాత తన స్థిర, చరాస్తులు ఎవరికి చెందాలో, ఎలా పంపకాలు జరగాలో తెలియజెప్పే చట్టబద్ధమైన డాక్యుమెంటే వీలునామా. మరణ వాంగ్మూలానికి ఎంత చట్టబద్ధత ఉందో అలాంటి చట్టబద్ధతే ఈ వీలునామాకు ఉంది. మనిషి బతికున్నంత వరకు వీలునామా ఎన్ని సార్లయినా మార్చుకోవచ్చు. కానీ చివరిసారిగా రాసిన వీలునామానే చట్టప్రకారం చెల్లుబాటు అవుతుంది. వీలునామాపై ఇద్దరు సాక్షుల సంతకం తప్పనిసరి. ఆరోగ్యంగా, మానసికంగా సరిగ్గా ఉన్న మేజర్లు రాసిన విల్లు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. భారతీయ వారసత్వ చట్టం సెక్షన్ 59 ప్రకారం విల్లు రాయాలి.

నామినీ వేరు.. వారసులు వేరు..: చాలా మంది జీవిత బీమాకో.. బ్యాంకు ఖాతాకో.. ఇతర ఆర్థిక లావాదేవీలకో.. నామినీగా ఎవరినో ఒకరిని పెడతారు. తమకేమన్నా అయితే నామినీకి ఆ మొత్తం వెళుతుందనుకుంటారు. అయితే చట్టప్రకారం నామినీ అనేది వారసుల కిందకు రాదు. వ్యక్తి మరణించిన తర్వాత ఆ నగదు నామినీకి చెందదు. వారసుల్లో నామినీ ఉంటే వారికి చట్టప్రకారం వాటా మాత్రమే వస్తుంది. నామినీగా ఒక వారసుడి పేరో లేదా వారసురాలి పేరో పెట్టినంత మాత్రాన ఆ నగదు మొత్తం వారికే చెందదు. ఇది తెలియని చాలా మంది నామినీగా ఫలానా వారి పేరు పెట్టారని వారికి రావాల్సిన వాటాను కోల్పోతుంటారు.

వీలునామా రిజిస్ట్రేషన్ అవసరమా?..: వీలునామాను రిజిస్ట్రేషన్ చేయిస్తే.. దాంతో లబ్ధిదారులు బ్యాంకు రుణాలు, ఇతర అవసరాలకు వాడుకొనే వీలు ఉంటుంది. రిజిస్టర్ అయిన వీలునామాకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. నామమాత్రపు చార్జీతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. తెల్ల కాగితంపై రాసినా చట్టబద్ధమే. కుటుంబంలో కనీసం ఒక్క వ్యక్తికయినా వీలునామాను ఎక్కడ భద్రపరిచిందీ తెలియజేయాలి.

ఆన్‌లైన్‌లో వీలునామా సేవల కోసం ఓ సంస్థ..: అత్యంత స్వల్ప రుసుముతో ఆన్‌లైన్ ద్వారా చట్ట ప్రకారం విల్లు సిద్ధం చేసే లక్ష్యంతో ఆసాన్‌విల్ అనే సంస్థ ఏడాది క్రితం ప్రారంభమైంది. ఈ సంస్థ రూపకర్త తెలంగాణ వ్యక్తి విష్ణు చుండి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉన్నట్లు.. వీలునామా కూడా ఉండాలన్నదే ఆ సంస్థ లక్ష్యం. అంతేకాదు.. తమ వద్దకు వచ్చే వారిని సేవా కార్యక్రమాలు, అవయవ దానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు రూ. 100 కోట్లను వివిధ చారిటీలకు అందించారు. దీనికిగాను 2018లో ది సొసైటీ ఆఫ్ విల్ రైటర్స్ నుంచి గుర్తింపు పత్రం అందుకున్నారు.

రూ. 1,50,000 కోట్లు..

ఎవరికీ చెందకుండా దేశవ్యాప్తంగా బ్యాంకు ఖాతాల్లో, బీమా పాలసీ కంపెనీల్లో పేరుకుపోయిన నగదు లెక్క ఇది. (లెక్కల్లోకి రానిది ఈ మొత్తంకన్నా ఇంకా ఎక్కువ ఉండొచ్చు.)

స్పృహలో లేనప్పుడు రాస్తే చెల్లదు...



సొంతంగా సంపాదించిన ఆస్తులకు, ఆదాయానికి సంబంధించి మాత్రమే వీలునామా రాయొచ్చు. వంశపారంపర్యంగా వచ్చే ఆస్తులు చట్టప్రకారం వారసులకే ఆ ఆస్తులు దక్కుతాయి. ఆ వ్యక్తి మరణానంతరమే వీలునామా అమల్లోకి వస్తుంది. మత్తులో ఉన్న సమయంలోనూ, తీవ్ర అనారోగ్యంగా ఉన్నప్పుడు, తాను ఏం చేస్తున్నానన్న దానిపై స్పృహ లేని వ్యక్తులు వీలునామా రాయడానికి అవకాశం లేదు. – సామల రవీందర్, ప్రభుత్వ న్యాయవాది, హైకోర్టు

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.